

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఉక్రెయిన్‌పై రష్యా ఖండాంతర క్షిపణి దాడి

ఆర్‌ఎస్-26 రూబెజ్‌గా అనుమానాలు!

ఒక కింజాల్, ఏడు కేహెచ్-101తో బీభత్సం

14

కాగ్ అధిపతిగా సంజయ్ మూర్తి ప్రమాణం

ఈ పదవిని చేపట్టిన తొలి తెలుగు అధికారిగా ఘనత

శుక్రవారం | 22-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 217 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి రా. 6.08 తదుపరి అష్టమి; నక్షత్రం: ఆశ్లేష సా. 5.10 తదుపరి మఖ; వర్జ్యం: తె. ఉ. 6.56, తె. 6.18 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 8.41-9.25, మ. 12.23-1.07; అమృతఘడియలు: మ. 3.27-5.10, రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.27; సూర్యాస్తమయం: 5.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అమెరికాతో అట్లుంటది

ఆంధ్రాలో లంచమిస్తే.. అక్కడ కేసులు

అమెరికాతో ముడిపడిన విదేశీ కంపెనీలపైనా చట్టం కొరడా

ప్రపంచంలో ఎక్కడ లంచాలు ఇచ్చినా కేసులు, చర్యలకు వీలు

కఠినంగా ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్

క్షణాల్లో పతనం

అదానీ గ్రూప్ లంచాలు ఇవ్వచూపిందంటూ అమెరికా చేసిన అభియోగాలతో గౌతమ్ అదానీకి చెందిన సంస్థల షేర్ల విలువలు భారీగా పతనమయ్యాయి. అదానీ సంస్థల షేర్ల విలువ రూ.2.24 లక్షల కోట్ల మేర ఆవిరైంది.

	బుధవారం ఒక్కో షేరు ధర	గురువారం జరిగిన నష్టం (₹)	నష్ట శాతం
అదానీ ఎంటర్‌ప్రైజెస్	2821.50	661.50	23.44
అదానీ గ్రీన్ ఎనర్జీ	1412.70	267.70	18.95
అదానీ పవర్	524.10	50.40	9.62
అదానీ పోర్ట్స్	1289.65	170.60	13.23%
అదానీ ఎనర్జీ సొల్యూషన్స్	871.55	174.30	20%
అదానీ విల్మర్ లిమిటెడ్	327.65	32.75	10%
అదానీ టోటల్ గ్యాస్	671.75	69.75	10.38%
ఏసీసీ లిమిటెడ్	2185	174.70	7.99%
అంబుజా సిమెంట్స్	549.55	69.55	12.66%

వివాదాస్పద వ్యాపారవేత్త.. గౌతమ్ అదానీ!

దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన రాజకీయ వేత్తగా ముద్రపడిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి!

వీరిద్దరి మధ్య 'ముడుపుల బంధం' బట్టబయలైంది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల కోసం అదానీ సంస్థ వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.2,029 కోట్ల లంచాలను ఎరవేసింది. ఇందులో ఏకంగా రూ.1,750 కోట్లు 'జగన్ యంత్రాంగానికే' అందించింది. ఇది తెలుగుదేశం పార్టీ చేసిన ఆరోపణ కాదు! మన దేశానికి చెందిన సీబీఐ, ఈడీలు తేల్చిన సంగతీ కాదు. అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ), ఆ దేశ దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ, న్యాయ శాఖ నిగ్గు తేల్చిన విషయాలు! దీనిపై ఈస్ట్ డిస్ట్రిక్ట్ న్యూయార్క్ కోర్టులో అభియోగాలు కూడా నమోదయ్యాయి. అదానీపై అమెరికాలో అరెస్టు వారెంటు జారీ అయ్యింది.

సౌర విద్యుత్ కొనుగోళ్లలో భారీ గోల్‌మాల్

రాష్ట్ర ప్రభుత్వాలకు అదానీ లంచాల ఎర

నాడు జగన్‌కే రూ.1,750 కోట్ల ముడుపులు

మిగతా రాష్ట్రాలన్నింటికీ కలిపి రూ.280 కోట్లు


జగన్‌తో భేటీ తర్వాతే కుదిరిన ఒప్పందాలు

న్యూయార్క్ కోర్టులో న్యాయ శాఖ చార్జిషీటు

గౌతమ్ అదానీ అరెస్టుకు కోర్టు వారెంట్ జారీ

జగన్‌తో భేటీ, ముడుపుల లెక్కతేలాకే ఒప్పందాలు

కుండబద్దలు కొట్టిన అమెరికా స్టాక్స్ సంస్థ



జగన్-అదానీ లంచాల కహానీ!

సమగ్ర కథనాలు 12, 13లో

అమెరికా బయటపెట్టిన అక్రమ బంధం

న్యూయార్క్ కోర్టులో కేసు, అభియోగాలు

అమరావతి/న్యూఢిల్లీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో రెండో అతిపెద్ద సంపన్నుడైన గౌతమ్ అదానీ భారీ సంక్షోభంలో ఇరుక్కున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థను అడ్డం పెట్టుకొని, రాష్ట్రాల్లోని విద్యుత్ సంస్థలకు సౌరశక్తిని అమ్మే కాంట్రాక్టులు దక్కించుకోవడం కోసం 2021-24 మధ్యకాలంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సహా ఐదు రాష్ట్ర ప్రభుత్వాల్లోని కీలక వ్యక్తులకు రూ.2,029 కోట్లు లంచంగా చెల్లించారని అమెరికా కేంద్ర దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ సంచలన ప్రకటన చేసింది. అందులో రూ.1,750 కోట్లు అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని కీలకమైన వ్యక్తికి చెల్లించారని ప్రకటించింది.

అసలేం జరిగింది...

భారత సౌర విద్యుత్తు సంస్థ (సెకీ) రాష్ట్రాలకు సోలార్ పవర్ సరఫరా చేసేందుకు ఆహ్వానించిన టెండర్‌ను

మిగతా 12వ పేజీలో...

మోదీ సర్కారులో అదానీ అవినీతి బయటపడదు

జేపీసీ వేయాల్సిందే.. రాహుల్‌గాంధీ డిమాండ్

వచ్చే పార్లమెంటు సమావేశాల్లో పెను దుమారం?

కెన్యా కటీఫ్!

అదానీతో ఒప్పందాలు రద్దు చేసుకున్న కెన్యా

భాగస్వామ్య దేశాలు ఇచ్చిన సమాచారంతోనేనన్న అధ్యక్షుడు రూటో

మాపై ఆరోపణలు పూర్తిగా నిరాధారం: అదానీ

'అక్రమ బంధం'పై సీఎం సమీక్ష

సెకీతో ఒప్పందంపై చర్చ.. 1-2 రోజుల్లో తదుపరి నిర్ణయం

సెకీ దెబ్బతో రాష్ట్రానికి వేల కోట్ల షాకులు

మరో వరం

ఆంధ్రా సూరీడు @ అదానీ!

అదానీ గ్రూప్ ఆయా రాష్ట్రాలకు లంచాలు ఎరవేసింది. ఆ సమయంలో ఏపీ సీఎం జగన్‌ను అదానీ వ్యక్తిగతంగా కలిశారు. ఆ తర్వాతే 7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం కుదిరింది" అని అమెరికా దర్యాప్తు సంస్థలు ఇప్పుడు వెల్లడించాయి. అచ్చంగా ఇవే వివరాలతో 2021 సెప్టెంబరు 22న 'ఆంధ్రా సూరీడు అదానీ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన ప్రత్యేక కథనం



మూడేళ్ల కిందటే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

ఇప్పుడు నిర్ధారించిన అమెరికా సంస్థలు

ముడుపుల ముడి వీడింది!

నాడు సౌర విద్యుత్‌పై 'సెకీ' టెండరు దక్కించుకున్న అదానీ

ధర చూసి రాష్ట్రాలు బెంబేలు.. విద్యుత్ కొనుగోలుకు ముందుకురాని డిస్కమ్‌లు

రాష్ట్రాలన్నీ గాలించినా దక్కని ఫలితం.. కానీ ఏపీలో తలుపులు తెరిచిన జగన్

రాష్ట్ర టెండర్లు రద్దు చేసి 'సెకీ'కి సై.. అదానీ కలిసిన 4 రోజులకే కేబినెట్‌లో ఓకే

ఇవే వివరాలతో అదానీపై అమెరికాలో కేసు

అదానీ పంచిన లంచాల్లో ఏపీ వాటా రూ.1,750 కోట్లు

'ఆంధ్రజ్యోతి' అక్షర సత్యం

అదానీ గ్రూప్ పంచిన 2,029 కోట్ల లంచాల్లో నాటి జగన్ సర్కారు వాటానే రూ.1,750 కోట్లు! ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెకీ ద్వారా 7వేల మెగావాట్ల అదానీ విద్యుత్తు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఒక్కో మెగావాట్‌కు రూ.25 లక్షల చొప్పున లంచం! 7వేల మెగావాట్లకు.. రూ.1,750 కోట్లు! ఇది.. అమెరికా దర్యాప్తు సంస్థలు తేల్చిన లెక్క..!



14

ఇకపై రాజకీయాలు మాట్లాడను

ఏ పార్టీనీ పొగడను.. విమర్శించను.. మద్దతివ్వను

రాజకీయాలకు పూర్తిగా గుడ్‌బై

చివరి శ్వాస వరకూ కుటుంబం కోసమే బతుకుతా: పోసాని

అందరికంటే చంద్రబాబునే ఎక్కువగా పొగిడానని వెల్లడి

1,87,000 కోట్ల పెట్టుబడులు

ఎన్టీపీసీతో రాష్ట్ర సర్కారు ఒప్పందం

రాష్ట్రానికి రూ.20,620 కోట్ల రాబడి.. 1,06,000 మందికి ఉపాధి

చంద్రబాబు సమక్షంలో ఎన్టీపీసీ, ఇంధనశాఖ సంయుక్త ఒప్పందం

పునరుత్పాదక రంగానికి మహర్దశ: ముఖ్యమంత్రి

14

రామాయపట్నంలో పెట్రో హబ్!

రూ.65 వేల కోట్లతో ఏర్పాటుచేయనున్న బీపీసీఎల్

తీవ్ర కసరత్తు తర్వాత కేంద్రం మొగ్గు రామాయపట్నం వైపే

ఢిల్లీ స్థాయిలో మొదలైన సన్నాహాలు

3 నెలల్లో విశాఖకు టీసీఎస్

ఏపీలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల సృష్టే లక్ష్యం: లోకేశ్

2

ఇక మీ ఆటలు సాగవ్!

'రాజకీయ' నేరగాళ్ల భరతం పడతా: సీఎం

తల్లి, చెల్లి వ్యక్తిత్వాన్ని కించపరిచిన వ్యక్తిని వెనకేసుకొస్తావా?

వర్రా వాడిన భాషను నా నోటితో ఉచ్చరించలేను

వీళ్లకు మనస్సాక్షే లేదు.. బాబాయి హత్యను మొదట గుండెపోటన్నారు

చంపారని తేలాక 'నారాసుర రక్తచరిత్ర' అంటూ డ్రామాలు

కోడికత్తి, గులకరాయి కేసులూ ఈ కోవలోవే

ఇలాంటి రాజకీయాలను జీవితంలో చూడలేదు

మాఫియాలను అరికట్టేందుకు పటిష్ఠ చట్టాలు

నేరస్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తాం

2

అసెంబ్లీలో సీఎం హెచ్చరిక



ఆడబిడ్డల జోలికొస్తే ఏం చేయాలో అది చేసి చూపిస్తాం. అమ్మాయిలపై అఘాయిత్యాలకు పాల్పడితే.. అదే వారికి చివరి రోజవుతుంది.

దళిత మహిళ అయిన ప్రస్తుత హోం మంత్రికే రక్షణ లేకపోతే రాష్ట్రంలో ఇంకెవరికి ఉంటుంది? డీజీపీ, హోం సెక్రటరీ, డిప్యూటీ సీఎం.. ఎవరైనా సరే పేటీఎం బ్యాచ్‌కు లెక్కలేదు. ఏమిటీ విచ్చలవిడితనం?

గత ప్రభుత్వంలో కొంత మంది సీనియర్ పోలీసు అధికారులు వ్యవస్థకే మచ్చ తీసుకొచ్చారు. అలాంటి వారిని సస్పెండ్ చేసి చర్యలు తీసుకుంటున్నాం. తప్పు చేసినవారెవరినీ ఉపేక్షించం.

- ముఖ్యమంత్రి చంద్రబాబు

బలం లేకున్నా బరిలోకి

2

పీఏసీకి వైసీపీ నేత పెద్దిరెడ్డి నామినేషన్

ప్రజాపద్దుల కమిటీలో అసెంబ్లీ నుంచి 9 మందికి అవకాశం

ఒక్కో సభ్యుడికి 20 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం

వైసీపీకి ఉన్నది 11 మందే అయినా పోటీకి సంసిద్ధం

సంఖ్యా బలం ప్రకారమే వెళ్లాలని కూటమి నేతల నిర్ణయం

చైర్మన్‌గా జనసేన ఎమ్మెల్యే పులపర్తి ఖరారు!

రేషన్, ఇసుక మాఫియాపై 'పిడి'కిలి


భూ ఆక్రమణల సవరణ బిల్లులో కఠిన నిబంధనలు

కబ్జాలకు ప్రయత్నిస్తే 14 ఏళ్లు జైలే! 2

జ్యుడీషియల్ ప్రివ్యూ రద్దు సహా పలు బిల్లులకు ఓకే

చట్టసభల్లో బీసీలకు 33% కోటా తీర్మానం

భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి పేరు



రఘురామ క్రమశిక్షణ.. సభ్యుల చిరాకు!

శాసనసభలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు క్రమశిక్షణ సభ్యులకు చిరాకు తెప్పించింది. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే వెలగపూడిని ఉద్దేశించి 'మీ గోల కొంచెం తగ్గించండి' అని డిప్యూటీ స్పీకర్ అన్నారు. ఆతర్వాత ధూళిపాళ్లను ఉద్దేశించి 'సభ్యులు గుంపులుగా మాట్లాడితే సభ ఆర్డర్‌లో ఉండట్లేదు. ఏదైనా ముఖ్యమైంది ఉంటే బయటికెళ్లి మాట్లాడుకోండి' అని అన్నారు. ఆతర్వాత జయనాగేశ్వర రెడ్డిని ఉద్దేశించి 'మీరు ప్రశ్న వరకే మాట్లాడండి. ఉపోద్ఘాతం వద్దు' అని సూచించారు. ఈ సందర్భంగా బండారు సత్యనారాయణ మూర్తి లేచి.. 'సభలో మాట్లాడటం సభ్యుల హక్కు. ఏమి మాట్లాడాలో మీరే నిర్దేశిస్తే ఎలా?' అని నిలదీశారు. 'పాతికేళ్లకుపైగా సభలో సభ్యుడిని. నాకు కూడా మీరు డిసిప్లైన్ నేర్పిస్తున్నారు. ఇదేమన్నా పాఠశాలా?' అని ధూళిపాళ్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. 'పక్క సీట్లో సభ్యుడితో కూడా మాట్లాడకూడదంటే ఎలా? సభ వాయిదా వేయండి.. బయటకు పోతాం' అంటూ వెలగపూడి వెళ్లిపోయారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్

శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం

- తీర్మానం కాపీ హైకోర్టు, కేంద్రానికి పంపుతాం
- త్వరలోనే బెంచ్ ఏర్పాటు: చంద్రబాబు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)


రాయలసీమ ముఖద్వారమైన కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేయాలని శాసనసభ గురువారం ఏకగ్రీవంగా తీర్మానంచేసింది. ప్రాంతాలకు అతీతంగా శాసనసభ్యులు కర్నూలులో బెంచ్ ఏర్పాటును హర్షధ్వానాలతో ఆమోదం తెలిపారు. దీంతో తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. అసెంబ్లీ తీర్మానం కాపీని త్వరలో హైకోర్టు, కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. వీలైనంత త్వరగా కర్నూలులో బె ంచ్ ఏర్పాటవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం భోజన విరామం తర్వాత సభలో న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ కర్నూలులో బెంచ్ ఏర్పాటు కోరుతూ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ జరిగింది. రాయలసీమ ప్రాంతానికి చెందిన సభ్యులు మాట్లాడారు. చివరగా చంద్రబాబు మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ తీర్మానాన్ని బలపరచి ఆమోదించాలని కోరారు. స్పీకర్ జోక్యం చేసుకొని.... తీర్మానాన్ని సమర్థించేవారెవరు అనగా సభ్యులు ఏకగ్రీవంగా బలపరిచారు.

రెండు పార్కులూ సీమకే కేటాయించా...

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త కార్యాలయాలు కర్నూలులోనే ఉంటాయని సీఎం స్పష్టం చేశారు. వాటిని తరలించాలన్న ఆలోచన లేదని, ఆఫీసులు అక్కడే కొనసాగుతాయని ప్రకటించారు. రాయలసీమలో కర్నూలు, తిరుపతి; ఉత్తరాంధ్రలో విశాఖను మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాయలసీమను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని తెలిపారు. పాదయాత్రలో ప్రకటించినవిధంగా మిషన్ రాయలసీమ హామీలు అమలుచేస్తామని చెప్పారు. కేంద్రం రెండు ఇండస్ట్రియల్ పార్కులు ఇస్తే, వాటిని కర్నూలు జిల్లా ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటు చేశామని, వీటి అభివృద్ధికి రూ.5 వేల కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. ఓర్వకల్లును డ్రోన్ హబ్‌గా మార్చేందుకు 300 ఎకరాలు కేటాయించామని చెప్పారు. కాగా, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేయడం తమ అదృష్టమని రాయలసీమ ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. బెంచ్ ఏర్పాటయితే కర్నూలు ముఖచిత్రమే మారిపోతుందన్నారు. కాఆ, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని శాసనమండలిలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తీర్మానం ప్రవేశపెట్టారు. ద్రవ్య వినియోగ బిల్లు సహా మరో 3 బిల్లులకు శాసనమండలి ఆమోదం తెలిపింది.

ఇక మీ ఆటలు సాగవ్!

'రాజకీయ' నేరగాళ్ల భరతం పడతా: సీఎం



భూ కబ్జాలకు పాల్పడితే 14 ఏళ్లు జైల్లోనే..

గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు ఇష్టానుసారంగా భూ కబ్జాలకు పాల్పడ్డారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరుతో మోసాలకు తెరతీశారు. రాష్ట్రవ్యాప్తంగా భూ ఆక్రమణలపై 8,305 ఫిర్యాదులు రాగా.. అవన్నీ 22ఏ కేసులు, భూ కబ్జాలకు సంబంధించినవే. అందుకే సీఎంగా ప్రమాణ స్వీకారం చేయగానే ఈ నల్లచట్టాన్ని రద్దు చేస్తూ ఫైల్‌పై సంతకం చేశాను. కఠినమైన గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో అమలవుతున్న చట్టాలను అధ్యయనం చేసి భూ ఆక్రమణల చట్టంలో సవరణలు తీసుకొచ్చాం. ఇక మీదట ఎవరైనా భూ కబ్జాలకు పాల్పడినా.. బెదిరింపులకు దిగినా.. బాధితులు కేసు పెడితే కబ్జాదారులు 10 నుంచి 14 ఏళ్ల పాటు జైల్లో మగ్గాల్సిందే. భూ ఆక్రమణల కేసులను 6 నెలల్లోపు పరిష్కరించేందుకు వీలుగా ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి.. బాధితుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్లను కూడా నియమిస్తాం. చట్టాన్ని ఉల్లంఘించేవారిపై చాలా కఠినంగా వ్యవహరిస్తాం.

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): 'ఇష్టానుసారంగా చేస్తే.. ఇకపై మీ ఆటలు సాగవ్! రాజకీయ ముసుగులో ఉన్న నేరస్థుల భరతం పడతా. రౌడీలు, భూ కబ్జాదారులు, సంఘ విద్రోహ శక్తులు గుండెల్లో రైళ్లు పరుగెత్తించే కఠినమైన చట్టాలను అమలు చేస్తాం. ఎవరైనా తప్పుచేయాలంటే భయపడే పరిస్థితి తీసుకొస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. 'షర్మిల వైఎస్ఆర్‌కు పుట్టిన బిడ్డ కాదు.. వైఎస్ విజయమ్మకు పుట్టిన బిడ్డ మాత్రమే' అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి తన కన్నతల్లి, తోడబుట్టిన చెల్లెలి వ్యక్తిత్వాన్ని డ్యామేజ్ చేసిన వర్రా రవీందర్‌రెడ్డిని మాజీ సీఎంగా పనిచేసిన వ్యక్తి సమర్థిస్తున్నారంటూ వైఎస్ జగన్‌పై ఆయన మండిపడ్డారు. వర్రా వాడిన భాషను తన నోటితో ఉచ్చరించలేనన్నారు. 'అలాంటి భాషను వాడిన వ్యక్తిని వెనకేసుకొస్తావా? అతడి పేరుతో వేరేవాళ్లు పోస్టులు పెట్టారని చెబుతావా' అంటూ జగన్‌ను నిలదీశారు. తనపై అసభ్యకర పోస్టులు పెట్టిన కేసులో అవినాశ్‌రెడ్డిని కూడా అరెస్టు చేయాలని షర్మిల డిమాండ్ చేస్తున్నారని గుర్తు చేశారు. గురువారం శాసనసభలో భూ ఆక్రమణల నిరోధక బిల్లు, పీడీ యాక్టు సవరణ బిల్లుపై చర్చసందర్భంగా సీఎం మాట్లాడారు. వైసీపీ పేటీఎం బ్యాచ్ ఆర్గనైజ్డ్‌గా సోషల్ మీడియాలో ఇష్టానుసారం పోస్టులు పెడుతూ ఆడవాళ్ల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో డిజిటల్ కార్పొరేషన్‌లో వైసీపీ మనుషులను పెట్టి ఒక వ్యవస్థను తయారు చేశారని.. వారి అడ్రసులు తెలియకుండా సోషల్ మీడియా ద్వారా దాడికి తెగబడుతున్నారని విమర్శించారు. 'ఇదంతా చూస్తుంటే మనసు వికలమైపోతోంది. నిద్రకూడా రావడం లేదు. ప్రజలకు సేవ చేయడానికి వచ్చిన వారు ఇన్ని అవమానాలు పడాలా? మొన్ననే విశాఖపట్నంలో ఒక అమ్మాయి నగ్న ఫోటోలు తీసి.. ఆమె జీవితాన్ని నాశనం చేశారు. వాళ్లు మనుషులా? మృగాలా' అని విరుచుకుపడ్డారు. పీడీ యాక్టుకు పదును పెడుతున్నామన్నారు. తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న చట్టాలను అధ్యయనం చేసినట్లు తెలిపారు. కల్తీ విత్తనాలు, ఎరువుల విక్రయాలు మొదలుకొని రేషన్ బియ్యం స్మగ్లింగ్, ఇసుక మాఫియాలను అరికట్టేందుకు పటిష్ఠ చట్టాలు తీసుకొచ్చి నేరస్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తామని స్పష్టం చేశారు. వాళ్లు ఎక్కడ దాక్కున్నా పట్టుకొచ్చి శిక్షిస్తామని.. తప్పు చేయాలంటే భయపడే పరిస్థితి తీసుకొస్తామని ప్రకటించారు. ఇంకా ఏమన్నారంటే..

వివేకా హత్యపై డ్రామాలు

'వివేకా హత్య జరిగినప్పుడు నేనే సీఎంను. ఆయన గుండెపోటుతో చనిపోయాడని ఆరోజు ఉదయమే నాకు మెసేజ్ వచ్చింది. అది 'సాక్షి' మెసేజే. పోలీసు వ్యవస్థతోపాటు అధికారులూ అదే చెప్పారు. వివేకా గుండెపోటుతో చనిపోయాడని విజయసాయిరెడ్డి కూడా ఉదయమే ప్రెస్‌మీట్‌లో చెప్పారు. నేనూ నమ్మాను. అది ఎన్నికల సమయం. హెలికాప్టర్లు ఉన్నాయి. సొంత బాబాయి చనిపోతే జగన్ వెంటనే వెళ్లాలి కదా! మధ్యాహ్నం వరకు వెళ్లలేదు. ఈలోపే హత్య జరిగిన రూము, బాత్‌రూములను క్లీన్ చేసేశారు. వివేకా భౌతిక కాయాన్ని క్లీన్ చేసి బాక్స్‌లో పెట్టేశారు. స్థానిక సీఐని మేనేజ్ చేసేశారు. అయితే వివేకా కూతురికి అనుమానం వచ్చి తన తండ్రి శవానికి పోస్టుమార్టం చేయాలని కోరింది. పోస్టుమార్టం సమయంలో వివేకా తలపై గాట్లు బయటపడ్డాయి. దాంతో జగన్ డ్రామాలు మొదలు పెట్టాడు. మర్నాడు ఆయన పత్రికలో 'నారాసుర రక్త చరిత్ర' అంటూ కథనాలు రాశారు. వీళ్లకసలు మనస్సాక్షే లేదు. కోడికత్తి కేసు, మొన్న ఎన్నికల ముందు జరిగిన గులకరాయి కేసు కూడా ఇలాంటివే. ఇలాంటి రాజకీయాలను నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు.

శాంతి భద్రతలతోనే రాష్ట్రాభివృద్ధి

రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉంటేనే అభివృద్ధి సాధ్యం. ప్రజలు ప్రశాంతంగా జీవించగలుగుతారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయి. టూరిజం అభివృద్ధి చెందుతుంది. రాష్ట్ర భవిష్యత్ కోసం ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నాం. గంజాయి సమస్య పెద్ద సవాల్‌గా మారింది. గత ఐదేళ్లలో దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు ఆంధ్రప్రదేశ్.. విశాఖపట్నంలోనే. జగన్ ఐదేళ్లలో ఒక్కసారైనా దీనిపై సమీక్ష చేయలేదు. దాంతో ఇళ్ల దగ్గర కూడా గంజాయి సాగు చేసే పరిస్థితి. కాలేజీలకు కూడా విస్తరించింది. విదేశాలకూ ఎగుమతి చేశారు. రాష్ట్రంలో ఎక్కడ.. ఏ నేరం జరిగినా దాని వెనుక గంజాయి బ్యాచ్ ఉంటోంది. ఈ బ్యాచ్‌లకు పకడ్బందీ నెట్‌వర్క్ ఉంది. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడితే.. మా టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేశాయి. గంజాయి కట్టడికి సమయం పడుతుందని ఎన్నికల ముందే చెప్పాను. పిల్లలు మత్తుకు అలవాటుపడి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. అలాంటివారిపై జనం తిరుగుబాటు చేయాలి.

పోలీసు వ్యవస్థ ప్రక్షాళన

పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నాం. 6వేలకు పైగా కానిస్టేబుళ్లను రిక్రూట్ చేస్తాం. జిల్లాకో సైబర్ పోలీసు స్టేషన్ పెడతాం. 2,812 కొత్త వాహనాల కొనుగోలుకు రూ.280 కోట్లు మంజూరు చేశాం. పోలీసులకు గత ప్రభుత్వం చెల్లించాల్సిన వివిధ బకాయిలు రూ.859 కోట్లను దశలవారీగా క్లియర్ చేస్తాం. రూ.90 కోట్లతో పోలీసు బలగాల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నాం. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం, ఇతర కార్యక్రమాల నిర్వహణకు రాజధానిలో ఐదెకరాలు కేటాయిస్తాం.

రేషన్, ఇసుక మాఫియాపై 'పీడీ'కిలి!

భూ ఆక్రమణల సవరణ బిల్లులో కఠిన నిబంధనలు



అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ గురువారం పలు కీలక బిల్లులకు ఆమోదం తెలిపింది. మహిళల వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ సోషల్ మీడియాలో విచ్చలవిడిగా పోస్టులు పెడుతున్నవారి భరతం పట్టడంతోపాటు రేషన్ బియ్యం స్మగ్లింగ్, ఇసుక మాఫియాలను ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్టు పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సవరణ బిల్లు, భూ దురాక్రమణల (నిషేధిత) సవరణ బిల్లుతో పాటు మరో 5 బిల్లులను ఆమోదించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు తరఫున హోంమంత్రి వంగలపూడి అనిత పీడీ యాక్టు సవరణ బిల్లును ప్రవేశపెట్టగా.. ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ (నిషేధిత) సవరణ బిల్లు-2024ను రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సభ ముందుంచారు. పట్టణాలు/నగరాల్లో గత ప్రభుత్వం విధించిన చెత్త పన్నును తొలగిస్తూ ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టం (రెండో సవరణ) బిల్లు-2024ను రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు. ఏపీ వస్తు సేవల పన్ను సవరణ బిల్లు-2024, ఏపీ విలువ ఆధారిత పన్ను సవరణ బిల్లు-2024లను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్.. ఆంధ్రప్రదేశ్ ధార్మిక హిందూ మత సంస్థలు, ఎండోమెంట్స్ సవరణ బిల్లు -2024ను దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.. ఆంధ్రప్రదేశ్ మౌలిక సదుపాయాలు, పారదర్శకంగా ముందస్తు న్యాయ సమీక్ష (జ్యుడీషియల్ ప్రివ్యూ) రద్దు బిల్లు-2024ను రాష్ట్ర మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రవేశపెట్టారు. అనంతరం ఆయా బిల్లులు సభ ఆమోదం పొందినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు.

5 నెలల్లోనే క్రైం రేటు తగ్గింది: హోంమంత్రి అనిత

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఐదు నెలల కాలంలో రాష్ట్రంలో నేరాల రేటు 18 శాతం తగ్గిందని హోం మంత్రి అనిత తెలిపారు. నేరగాళ్ల వెన్నులో వణుకు పుట్టే విధంగా పీడీ యాక్టులో సవరణలు చేశామన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతలు బందిపోట్ల మాదిరిగా పేదలను బెదిరించి వారి భూములను కబ్జా చేసేశారని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. వీటిపై 79,907 ఫిర్యాదులు రాగా.. వాటిలో 8,970 భూ ఆక్రమణలకు సంబంధించినవేనని తెలిపారు. భూ ఆక్రమణలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి 10 నుంచి 14 ఏళ్ల జైలు శిక్ష విధించేలా చట్టంలో సవరణలు ప్రతిపాదించామన్నారు. ఇక, లోన్ యాప్‌లో రుణం తీసుకుంటే వారికి చావే శరణ్యమని హోంమంత్రి అనిత అన్నారు. రాష్ట్రంలో ప్రజల్ని మానసికంగా ఏడిపిస్తూ చావులకు కారణం అవుతున్న 199 మందిని ఇటీవలి కాలంలో అరెస్టు చేసినట్లు తెలిపారు.

బీసీలకు 33% రిజర్వేషన్ కోసం పోరు: బాబు

చట్టసభల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తూ బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవిత ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీనిపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. చట్టసభల్లో బీసీలకు 33శాతం రిజర్వేషన్లు సాధించేవరకు టీడీపీ పోరాడుతుందని చెప్పారు.

సత్యకుమార్ సామెతపై మండలిలో దుమారం

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన మెడికల్ కళాశాలల నిర్మాణంపై వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మండలిలో విమర్శించారు. కేంద్రం ఇచ్చిన రూ.198 కోట్లను దారి మళ్లించిందన్నారు. వైద్య కళాశాలల నిర్మాణానికి రూ.8,400 కోట్లు ఖర్చుపెట్టాల్సి ఉండగా రూ.1,400 కోట్లే ఖర్చు చేసిందన్నారు. ఈ సందర్భంగా సత్యకుమార్ యాదవ్ చెప్పిన సామెత సభలో దుమారం రేపింది. ఇది ఓ మతం వారిని కించపరిచేలా ఉందని.. మంత్రి క్షమాపణలు చెప్పాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేశారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ 'తన సామెత ఏ కులాన్నీ, ఏ మతాన్నీ అవమానించేలా, మనోభావాలను దెబ్బతీసేదిగా లేదని, ఒకవేళ ఉన్నట్లు భావిస్తే.. వెనక్కి తీసుకుంటున్నాను' అన్నారు. చైర్మన్ మోషేన్‌రాజు 'ఆ పదాలను రికార్డుల నుంచి తొలగించాలి' అని ఆదేశించారు.

ఆ జిల్లాలకు కేంద్రం 1,750 కోట్లు: మంత్రి కేశవ్

రాయలసీమ, ఉత్తరాంధ్రలోని ఏడు వెనుకబడిన ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక ప్యాకేజీ కింద 2014నుంచి ఇప్పటి వరకూ 250కోట్ల చొప్పున మొత్తం 1,750కోట్లు విడుదల చేసిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఎమ్మెల్యేలు వాల్మీకి పార్థసారథి, బొనెల విజయ్ కుమార్, పల్లె సింధూర, ఎంఎస్ రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ఈ జిల్లాలతోపాటు ప్రకాశం జిల్లాను కూడా పరిగణలోకి తీసుకుని నిధులు మంజూరు చేయాలని ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు కోరినట్లు పయ్యావుల వెల్లడించారు.

త్వరలో నూతన టెక్స్‌టైల్ పాలసీ: మంత్రి సవిత

చేనేత రంగానికి పూర్వ వైభవం, వస్త్ర రంగానికి ప్రోత్సాహం కల్పిస్తూ త్వరలో ఏపీ టెక్స్‌టైల్ పాలసీ తీసుకు రాబోతున్నట్లు ఆ శాఖ మంత్రి సవిత అసెంబ్లీలో వెల్లడించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. ఎమ్మిగనూరు, రాయదుర్గం, పామిడిలో టెక్స్‌టైల్ పార్కులు, చీరాలలో హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి తెలిపారు.

ఏయూ మాజీ వీసీపై చర్యలు తీసుకోవాలి: పల్లా

ఆంధ్రా యూనివర్శిటీలోకి రాజకీయ చీడను తీసుకొచ్చి అపవిత్రం చేసిన మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రసాదరెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. జీరో అవర్‌లో ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. వర్సిటీలో రాజకీయ పార్టీల సమావేశాలు పెట్టిన ప్రసాదరెడ్డి విశ్వవిద్యాలయానికే కళంకం తెచ్చారని అన్నారు. మాజీ వీసీపై విచారణకు ఆదేశించాలని కోరారు.

రీ సర్వే పేరుతో దోచుకున్నారు: మంత్రి అనగాని

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): 'ఏం చేశారని రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలపై ఫొటోలు వేసుకున్నారు. భూముల రీ సర్వే పేరుతో ప్రజాధనాన్ని దోచుకునేందుకు గత ప్రభుత్వం కుట్రలు చేసింది' అని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. గురువారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి మాట్లాడుతూ రీసర్వేలో వేలాది మంది రైతుల భూముల కొలతల్లో తేడాలు వచ్చాయన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన కౌలు రైతుల చట్టాన్ని సవరించి కౌలు రైతులకు మేలు చేసేలా కొత్త చట్టం తెస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. విశాఖపట్నంలో గాలి నాణ్యత క్యూబిక్ మీటరుకు సగటున 86 మైక్రోగ్రాముల(పీఎం10) సాంద్రతను చూపిస్తోందని, ఇది కేంద్ర ప్రమాణాల కంటే 1.43 రెట్లు ఎక్కువని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. పర్యావరణ క్షీణత, కాలుష్య ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

అసెంబ్లీ లాబీలు కిటకిట

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బడ్జెట్ సమావేశాలు ముగింపు దశకు చేరుకోవడంతో అసెంబ్లీ లాబీలు కిటకిటలాడుతున్నాయి. ఎమ్మెల్యేలు, మంత్రుల కోసం పనులపై వచ్చిన వారు పెద్ద సంఖ్యలో ఉండటం లాబీలను కిక్కిరిసేలా చేస్తోంది. మంత్రి లోకేశ్ చాంబర్ వద్ద సందర్శకులు లాబీల్లో గురువారం బారులు తీరారు. ఆయన శాఖతో సంబంధం లేకుండా అనేక రకాల సమస్యలపై కలవాలని వారు ప్రయత్నించారు. అదే సమయంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు కూడా ఆయనను కలవడానికి రావడంతో విపరీతమైన రద్దీ నెలకొంది. సభ ముగిశాక సీఎం చంద్రబాబుకు వినతి పత్రాలు ఇవ్వడానికి సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రసక్తే లేదు

పవన్, అచ్చెన్న, భరత్ స్పష్టీకరణ



అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రసక్తేలేదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, టీజీ భరత్ స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ అంశాన్ని త్రికరణ శుద్ధిగా ఆపి ఉంటే ఈ రోజు ఆ ప్రశ్నే వచ్చేదే కాదని శాసనమండలిలో వైసీపీ సభ్యులకు పవన్ కల్యాణ్ చురక వేశారు. గురువారం మండలిలో స్టీల్ ప్లాంట్ అంశంపై వాడివేడిగా చర్చ జరిగింది. ప్రశ్నోత్తరాల సమయంలో వైసీపీ ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్ మాట్లాడారు. ప్రైవేటీకరణ కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ఉద్దేశమే లేదన్నారు. అయితే అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని శాసనమండలిలో తీర్మానం చేయాలని వైసీపీ సభ్యులు పట్టుబట్టారు. అసలు చేసే ప్రసక్తే లేనప్పుడు తీర్మానం ఎందుకని కూటమి సభ్యులు నిలదీశారు. దీంతో మంత్రులు, వైసీపీ సభ్యుల మధ్య మాటల యుద్ధం జరిగింది. వైసీపీ సభ్యులు పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని, దానికి సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అలాంటప్పుడు తీర్మానం చేపట్టాల్సిన అవసరంలేదని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర మంత్రి కుమారస్వామి సైతం స్పష్టంగా ప్రకటించారన్నారు. టాటాతో టైఅప్ చేసుకుని వ్యాపారం అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉందన్నారు. కార్మిక సంఘాల నేతలు గత ప్రభుత్వంలో సీఎం జగన్ దగ్గరకు వెళితే భూములమ్మి అప్పులు తీర్చుకోమన్నారని చెప్పారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గతంలో విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని, అప్పటి ప్రధాని వాజపేయి వద్దకు చంద్రబాబు వెళ్లి 1200 కోట్లు గ్రాంట్‌గా తీసుకువచ్చి ఆపారన్నారు.

అమిత్‌షాను కోరా: పవన్ కల్యాణ్

ఉక్కు ప్రైవేటీకరణ అంశంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ప్రకటన చేయాలని మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సూచించారు. దీంతో సభలో పవన్ మాట్లాడారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ప్రసక్తే లేదని, ప్రైవేటీకరణ చేయవద్దని తాను కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసి కోరానని చెప్పారు. కాగా ప్లాంట్ భూములు వేలం వేసేందుకు ఇప్పటికే ప్రకటనలు జారీ చేశారని విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు.

మేం కంపెనీలు తెస్తే.. జగన్ తరిమేశారు

- అసెంబ్లీలో మంత్రి లోకేశ్ ప్రకటన

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన అనంతరం 2014-19 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో కష్టపడి పారిశ్రామిక, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీలను తీసుకొచ్చిందని... కానీ, జగన్ వచ్చాక ఆ కంపెనీలు రాష్ట్రం వదిలిపోయేలా చేశారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో 27 కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలివెళ్లాయని చెప్పారు. శాసనసభలో గురువారం జీరో అవర్ తర్వాత మంత్రి లోకేశ్ ఎలక్ట్రానిక్స్, డేటా పాలసీలపై ప్రకటన చేశారు. ఎంతో కష్టపడి తాము టీసీఎల్‌ను రాష్ట్రానికి తీసుకురాగా, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే.. టీసీఎల్‌లో పనిచేసే ఓ అధికారిని భోజనానికి పిలిచి నిర్బంధించారన్నారు. ఎలక్ట్రానిక్ తయారీ యూనిట్లు, డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తే పెట్టుబడి రాయితీ, తక్కువ ధరకే వసతులు కల్పిస్తామని మంత్రి చెప్పారు. ఉత్పత్తి రంగంలో ఏపీని నం.1 స్థానంలో నిలబెడతామని చెప్పారు.

3 నెలల్లో విశాఖకు టీసీఎస్: లోకేశ్

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక పాలనలో నిర్వీర్యమైన రాష్ట్ర ఐటీ రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తామని మంత్రి నారాలోకేశ్ స్పష్టం చేశారు. మూడు నెలల్లోనే విశాఖకు ప్రతిష్ఠాత్మక టీసీఎస్ కంపెనీ తీసుకొస్తామని, అదానీ డేటా సెంటర్ కూడా వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఐదు లక్షల ఐటీ ఆధారిత ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీలో సభ్యులు విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ, గంటా శ్రీనివాస్ అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేశ్ సమాధానం చెప్పారు. విశాఖపట్నాన్ని ఐటీ హబ్‌గా మార్చే సంకల్పంతో చంద్రబాబు ప్రభుత్వం 2014-19లో ప్రోత్సాహకాలు కల్పిస్తే.. ఐదేళ్ల కిందట అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పెద్దలు వాటాలు ఇవ్వబోమన్న ఐటీ పరిశ్రమల్ని ఖాళీ చేయించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వ పాలసీని కొనసాగించి ఉంటే విశాఖపట్నం ప్రపంచ డేటా సెంటర్‌కు కేంద్రం అయ్యేదన్నారు.

బలం లేకున్నా బరిలోకి!

పీఏసీకి వైసీపీ నేత పెద్దిరెడ్డి నామినేషన్



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పులపర్తి రామాంజనేయులు

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ప్రజాపద్దుల సంఘం (పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ-పీఏసీ) ఎన్నిక రసవత్తరంగా మారింది. తగినంత బలం లేకపోయినా ఈ కమిటీలో సభ్యత్వం కోసం వైసీపీ తరఫున మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. దీంతో సంఖ్యాబలం ప్రకారమే ముందుకు వెళ్లాలని నిర్ణయించిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పార్టీలు.. ఈ కమిటీ చైర్మన్ పదవికి జనసేనకు చెందిన భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును అంతర్గతంగా ఖరారు చేశాయి. అయినా పెద్దిరెడ్డి పోటీలో కొనసాగుతుండడం ఆసక్తికరంగా మారింది. ఎన్నికలు ఖాయమవడంతో అసెంబ్లీ అధికారులు ఓటింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. శాసనసభ వేదికగా పనిచేసే కమిటీల్లో పీఏసీ కీలకమైనది. వివిధ ప్రభుత్వ శాఖలు పెట్టే ఖర్చుకు సంబంధించి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) లేవనెత్తిన అభ్యంతరాలపై ఈ కమిటీ విచారణ జరుపుతుంది. ఏ శాఖకు చెందిన అధికారులనైనా పిలిచి సమీక్ష నిర్వహించే అధికారం దీనికి ఉంది. శాసనసభలో అనేక కమిటీలు ఉన్నా ఈ ఒక్క కమిటీ చైర్మన్ పదవిని ప్రతిపక్షానికి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆ పార్టీకి చెందిన పయ్యావుల కేశవ్‌కు చైర్మన్ పదవి ఇచ్చారు. అప్పుడు టీడీపీకి 23 మంది ఎమ్మెల్యేలు ఉండడంతో ఇబ్బంది లేకుండా పోయింది. ఈసారి వైసీపీకి అసెంబ్లీలో కేవలం 11 మంది సభ్యులే ఉన్నారు. ఒక సభ్యుడిని గెలిపించుకోవడానికి అవసరమైనంత బలం కూడా ఆ పార్టీకి లేదు. ఈ విషయం తెలిసినా కూటమి పార్టీలతో సంప్రదింపులు జరపకుండా పెద్దిరెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు ద్వారకానాథరెడ్డి, బూచేపల్లి శివప్రసాదరెడ్డి, చంద్రశేఖర్ కూడా వచ్చారు. ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశాక వైసీపీ సభ్యులు సభాభవనంలోకి అడుగు పెట్టడం ఇదే ప్రథమం. పెద్దిరెడ్డి నామినేషన్ దాఖలు చేయడంతో.. అధికార కూటమి నేతలు అంతర్గతంగా సంప్రదింపులు జరుపుకొన్నారు. బలం లేకపోయినా వైసీపీ బరిలోకి దిగడంపై చర్చించారు. ఆ పార్టీని పట్టించుకోవలసిన అవసరం లేదని, సంఖ్యాబలం ప్రకారం వెళ్దామని నిర్ణయించారు. ఇటీవల గుజరాత్‌లో ప్రతిపక్షానికి పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వని విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ రాష్ట్ర అసెంబ్లీలో 182 మంది సభ్యులు ఉండగా.. స్వతంత్రులతో కలిసి బీజేపీకి 163 మంది ఉన్నారు. కాంగ్రెస్‌కు 12, ఆమ్ ఆద్మీ పార్టీకి నలుగురు, సమాజ్‌వాదీ పార్టీకి ఒక ఎమ్మెల్యే ఉన్నారు. రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. పీఏసీకి ఒక్కరిని కూడా గెలిపించుకునే బలం కాంగ్రెస్‌కు లేకపోవడంతో ఆ పార్టీకి పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వలేదు. అదే సంప్రదాయాన్ని ఆంధ్రలో కూడా పాటించాలని కూటమి నేతలు నిశ్చయించారు. ఆ తర్వాత శాసన మండలి చైర్మన్ చాంబర్లో శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, మండలిలో ప్రతిపక్షమైన వైసీపీ నేత బొత్స సత్యనారాయణ సమావేశమయ్యారు. చాలినంత సంఖ్యాబలం వైసీపీకి అసెంబ్లీలో లేనందువల్ల ఆ పార్టీకి పీఏసీ చైర్మన్ పదవి గానీ, సభ్యత్వం గానీ ఇవ్వలేమని కేశవ్ చెప్పారు. సంప్రదాయం ప్రకారం ప్రతిపక్షానికే ఆ పదవి ఇవ్వాలని, దానిని పాటించాలని బొత్స కోరారు. 'ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఇటీవల స్థానిక సంస్థల కోటా నుంచి ఎమ్మెల్సీ ఎన్నిక జరిగినప్పుడు వైసీపీ నుంచి మీరు పోటీ చేశారు. బలం లేదని మేం అసలు పోటీయే చేయలేదు. మీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసెంబ్లీలో మీ పార్టీకి కనీసం ఒక సభ్యుడిని గెలిపించుకునేంత బలం ఉంటే మేం తప్పనిసరిగా చైర్మన్ పదవి ఇచ్చేవాళ్లం. మీకు ఆ బలం లేదు. ప్రతిపక్ష హోదా కూడా లేదు. అందువల్ల ఇవ్వలేకపోతున్నాం' అని కేశవ్ స్పష్టంచేశారు. ఆ సమావేశం అనంతరం కూటమి నేతల అంతర్గత సమావేశంలో పీఏసీ చైర్మన్ పదవిని జనసేనకు ఇవ్వాలని నిర్ణయించారు. ఆ పార్టీ నుంచి భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును ఎంపిక చేశారు. ఆయన మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. టీడీపీకి చెందిన మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఆయన వియ్యంకుడు. ఈ కమిటీలోకి టీడీపీ తరఫున ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య(జగ్గయ్యపేట), జయనాగేశ్వర్‌రెడ్డి (ఎమ్మిగనూరు), అరిమిల్లి రాధాకృష్ణ (తణుకు), అశోక్‌రెడ్డి (గిద్దలూరు), బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు), నక్కా ఆనందబాబు (వేమూరు), కోళ్ల లలితకుమారి(ఎస్.కోట)లను ఎంపిక చేసి వారితో నామినేషన్లు దాఖలు చేయించారు. జనసేన నుంచి పులపర్తి, బీజేపీ తరఫున విష్ణుకుమార్‌రాజు నామినేషన్లు వేశారు. అసెంబ్లీ నుంచి పీఏసీలో 9 మంది సభ్యులు ఉండాల్సి ఉండగా కూటమి పార్టీలు తొమ్మిది మందితో నామినేషన్లు వేయించాయి. వైసీపీ నుంచి అదనంగా ఒకరు వేయడంతో పోటీ అనివార్యమైంది. దీంతో పోలింగ్ నిర్వహణకు అసెంబ్లీ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

జగన్ వస్తారా.. లేదా?

పీఏసీ పోలింగ్‌కు వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు వస్తారా రారా అన్నది ఆసక్తి కలిగిస్తోంది. ఏదైనా కారణం వల్ల కూటమి ఎమ్మెల్యేలు పది మంది స్థానికంగా అందుబాటులో లేకపోతే వైసీపీ ఎమ్మెల్యేలు వచ్చి ఓట్లు వేస్తారని.. కూటమి ఎమ్మెల్యేలు చాలినంత మంది ఉంటే ఓటింగ్‌కు రారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

మండలి సభ్యులపై అంగీకారం

శాసన మండలి నుంచి పీఏసీకి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవలసి ఉండగా వాటి విషయంలో వైసీపీ, టీడీపీ మధ్య అంగీకారం కుదిరింది. బలాబలాల ఆధారంగా వైసీపీకి రెండు స్థానాలు, టీడీపీకి ఒక స్థానం దక్కనుంది. మరో రెండు అసెంబ్లీ కమిటీల అధ్యక్ష పదవులకు కూడా అభ్యర్థులను ఖరారు చేశారు. పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్‌గా టీడీపీ ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్, అంచనాల కమిటీ చైర్మన్‌గా టీడీపీ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును ఎంపిక చేశారు.

తిరుపతి విమానాశ్రయంలో శ్రీవాణి టికెట్ల కోటా పెంపు

తిరుమల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో రోజూ జారీ చేస్తున్న శ్రీవాణి ట్రస్టు టికెట్ల కోటాను టీటీడీ పెంచింది. గతంలో ఇచ్చే వంద టికెట్లను 200కు పెంచారు. విమానాశ్రయంలోని కరెంట్ బుకింగ్ కౌంటర్‌లో భక్తులు ఈ టికెట్లను బుక్ చేసుకోవచ్చు. ఇక, తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనం వెనుకభాగంలో ఉన్న శ్రీవాణి టికెట్ల కౌంటర్‌లో ఆఫ్‌లైన్ ద్వారా జారీ చేస్తున్న టికెట్ల సంఖ్యను 900 నుంచి 800కు తగ్గించారు. ఈ విధానం శుక్రవారం నుంచి అమల్లోకి తీసుకురానున్నారు.

25న రూ.300 దర్శన టికెట్లు విడుదల

ఫిబ్రవరి నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ ఈ నెల 25వ తేదీన విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు ఈ కోటాను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'టీటీడీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' ద్వారా విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని టీటీడీ వసతి సముదాయాల్లో ఖాళీలను కూడా విడుదల చేస్తారు. మరోవైపు 23వ తేదీ ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ, 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు టికెట్లు జారీ చేయనున్నారు.

రేపు రాజధాని రైతుల ప్లాట్లకు ఈ-లాటరీ

విజయవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఇవ్వాల్సిన ప్యాకేజీ బ్యాలెన్స్ రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించేందుకు సీఆర్‌డీఏ అధికారులు నవంబరు 23వ తేదీన ఈ-లాటరీ నిర్వహిస్తున్నారు. విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో శనివారం ఈ-లాటరీ నిర్వహిస్తారు. రాజధానిలోని 9 గ్రామాల రైతులకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ (ఓఆర్ఎస్) ద్వారా రిటర్నబుల్ ప్లాట్లను కేటాయిస్తారు.


కూతురితో కృష్ణకిశోర్, శిరీష దంపతులు (ఫైల్)

ఉరి వేసుకున్న అమ్మా నాన్న.. ఊయలలో పాప

కుటుంబాన్ని మింగేసిన వైద్య రుణాలు.. అనంతపురం జిల్లా నార్పలలో విషాదం

నార్పల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైద్యంకోసం చేసిన అప్పులు భయపెడుతుంటే, ఉరి వేసుకున్న అమ్మానాన్న! ఆ పక్కనే ఊయలలో ఐదునెలల కుమార్తె మృతదేహం! ఇంకా నామకరణం కూడా కాలేదు. ఇంతలోనే ఆ చిన్నారికి నూరేళ్లు నిండిపోయాయి. ఆలస్యంగా స్థానికులు విషయం తెలుసుకున్నారు. దానివల్ల ఆకలికి అల్లాడి చిన్నారి చనిపోయిందా? లేక పాపను చంపేసి ఆ తర్వాత అమ్మానాన్న ఉరి వేసుకున్నారా? అనేది తెలియడం లేదు అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలో గుండెలు పిండేసే ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. నార్పలకు చెందిన కృష్ణకిశోర్‌కు స్థానికంగా మందుల షాపు ఉంది. రెండు సంవత్సరాల క్రితం గుంతకల్లుకు చెందిన శిరీషతో ఆయనకు వివాహం జరిగింది. వీరికి ఐదు నెలల క్రితం కుమార్తె పుట్టింది. ఇంకా నామకరణం చేయలేదు. అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణ కిశోర్‌కు పెళ్లికాకముందు మేజర్ ఆపరేషన్ జరిగింది. దీనికోసం రూ.20 లక్షల వరకు ఆయన అప్పు చేశారు. అంతకు మునుపు తన తల్లి వైద్యం కోసం మరో రూ.15 లక్షలు అప్పు చేశారు. ఇదంతా వడ్డీతో కలిపి రూ.50 లక్షలు దాటింది. ఈ క్రమంలో అప్పులిచ్చినవారి నుంచి ఒత్తిడి పెరిగినట్లు తెలిసింది. తీర్చే మార్గంలేక కొంతకాలంగా కృష్ణకిశోర్ తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. నడుపుతున్న మందులషాపు మీద రోజుకు వచ్చే రూ. 500, 600 కుటుంబం గడవడానికి సరిపోయేది. వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్న ఈ అప్పులు తీర్చడానికి వేరే మార్గం ఏదీ కనిపించలేదు. దీంతో భార్య శిరీషతో కలిసి ఇంటి పై భాగంలో ఉన్న గదిలో దూలానికి చీరతో కృష్ణకిశోర్ ఉరి వేసుకున్నారు. ఎవరి పనుల్లో వారు ఉండే రద్దీ ప్రాంతం కావడంతో చుట్టుపక్కలవారు ఈ కుటుంబం కనిపించకపోయినా...పట్టించుకోలేదు. కానీ గురువారం ఇంటి నుంచి విపరీతమైన దుర్వాసన మొదలైంది. అక్కడికి సమీపంలోని పెద్దమ్మ గుడి వద్ద ఏదైనా జంతువు చనిపోయి ఉంటుందని ముందు భావించారు. దానికోసం గాలించారు. ఈ క్రమంలో కృష్ణ కిశోర్ ఇంటి తలుపులు మూసి ఉండటం, నాలుగు రోజులుగా అలికిడి లేకపోవడంతో అనుమానం వచ్చి తలుపు తట్టారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో ఇంటిపైకి ఎక్కి చూశారు. ఆ ఇంట్లో నుంచి దుర్వాసన మరింత ఎక్కువగా రావడంతో అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని తలుపులు బద్దలు కొట్టించి లోపలికి వెళ్లారు. పై గదిలో దంపతులు ఉరికి వేలాడుతూ కనిపించారు. వారి కుమార్తె ఊయలలో చనిపోయి కనిపించింది. ఈ హృదయ విదారక దృశ్యాలను చూసి స్థానికులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉండేవారని, అప్పుల కారణంగానే ఇలా అర్ధంతరంగా చనిపోయారని కంటతడి పెట్టుకున్నారు.

కంటతడి పెట్టిస్తున్న పాప మృతి

కృష్ణ కిశోర్, శిరీష దంపతులు ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. కానీ వారి కుమార్తె మృతికి కారణాలు ఏమిటో పోస్టుమార్టం తరువాత తెలుస్తాయని అన్నారు. దంపతులు ఆత్మహత్యకు పాల్పడక ముందు చిన్నారికి విషం ఇచ్చారా..? లేక ఆకలిదప్పులతో ప్రాణాలు కోల్పోయిందా అన్న సందేహాలు నివృత్తి కావాల్సి ఉంది. అదేరోజు గమనించి ఉంటే కనీసం పాపైనా బతికేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణ కిశోర్ సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తిరుమలకు విజన్ డాక్యుమెంట్

- మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం
- టీటీడీలో టౌన్ ప్లానింగ్ విభాగం ఏర్పాటు: ఈవో శ్యామలరావు


టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుపతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలను పక్కా ప్రణాళికతో కూడిన మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతి పరిపాలన భవనంలో గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. 2019లో ఐఐటీ నిపుణులు తిరుమలకు రూపొందించిన మాస్టర్ ప్లాన్ ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. విజన్ డాక్యుమెంట్ రూపొందించిన ప్రతినిధులతో సమావేశమయ్యామని, ఆ మాస్టర్ ప్లాన్‌లోని ముఖ్యమైన అంశాలను పరిగణనలోకి తీసుకోనున్నట్టు చెప్పారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ ధార్మిక క్షేత్రమైన తిరుమలను మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా డిజైన్లు రూపొందించాలన్నారు. ఇందుకోసం విజన్ డాక్యుమెంట్ తక్షణావసరమని, టీటీడీకి అర్బన్ డెవలప్‌మెంట్ అండ్ టౌన్ ప్లానింగ్ వింగ్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కొన్ని పాత కాటేజీలతో పాటు బాలాజీ ఆర్టీసీ బస్టాండ్‌ను మార్చనున్నట్టు చెప్పారు. మల్టీలెవల్ కారు పార్కింగ్‌లను ఏర్పాటుచేసే ఆలోచన కూడా ఉందన్నారు. భవిష్యత్తులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోబుతున్నట్టు చెప్పారు. రాబోయే పాతికేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డాక్యుమెంట్‌ను రూపొందించి దాని ప్రకారం మౌలిక సదుపాయాలు రూపొందించే ఆలోచన ఉందన్నారు. ఇందుకు టౌన్ ప్లానింగ్‌లో నిపుణులైన రిటైర్డ్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌ను సలహాదారుగా నియమించామన్నారు. తిరుమలలో మరింతగా ఆధ్యాత్మికత వాతావరణం ఉండేలా ప్రస్తుతం ఉన్న కాటేజీలకు 150 పేర్లు సూచిస్తామని, వాటిలో నచ్చిన పేరును కాటేజీ దాతలు ఎంపిక చేసుకుని పేర్లను మార్చేలా టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుందన్నారు. ఆధ్యాత్మిక చిహ్నాలు లేని కాటేజీలను అందుకు అనుగుణంగా నిర్మాణంలో మార్పు చేసేలా చర్యలు తీసుకోబోతున్నామన్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ కృపాసాగర్


జస్టిస్ కృపాసాగర్

తిరుమల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

కేంద్ర సహాయ మంత్రి వర్మకు పితృ వియోగం


సూర్యనారాయణరాజు

భీమవరంటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తండ్రి సూర్యనారాయణరాజు (91) అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదారాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో గురువారం సాయంత్రం మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సూర్యనారాయణ రాజు సాంఘిక సంక్షేమ శాఖలో జిల్లా అధికారిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆయన భౌతిక కాయాన్ని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని వారి స్వగృహం నందు శుక్రవారం ఉదయం ప్రజల దర్శనార్థం ఉంచి, మధ్యాహ్నం ఒంటి గంటకు బలుసుమూడి మోక్షధామంలో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

ఏవోబీలో ఎదురుకాల్పులు

- మావోయిస్టు మృతి, ఒక పోలీసుకు గాయాలు


ఘటనా స్థలంలో ఒడిసా పోలీసులు స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల కిట్ బ్యాగ్‌లు, తుపాకులు, ఇతర సామగ్రి

సీలేరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఒడిసా సరిహద్దుల్లో (ఏవోబీ) పోలీసులకు, మావోయిస్టులకు నడుమ గురువారం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఒక మావోయిస్టు మృతిచెందిగా, ఒక పోలీసుకు గాయాలయ్యాయి. ఒడిసా పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిసా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కలిమెల బ్లాక్ పరిధిలోని జినెల్‌గూడా అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారం అందడంతో బుధవారం నుంచి పోలీసులు (డిస్ట్రిక్ వలంటీర్ ఫోర్స్) గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున మావోయిస్టులు ఎదురుపడడంతో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతిచెందగా, డమ్రు బద్రనాయక్ అనే పోలీస్‌కు గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను చికిత్స కోసం హెలికాప్టర్‌లో మల్కన్‌గిరి ఆస్పత్రికి తరలించారు.

తిరుమలలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

- కార్మికురాలికి స్వల్పగాయాలు

తిరుమల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. నందకం సమీపంలోని ఓ హోటల్‌లో గ్యాస్ సిలెండర్ మార్చే సమయంలో మంటలు చెలరేగాయి. సమీపంలో విధులు నిర్వహిస్తున్న కార్మికురాలు కవిత గాయపడ్డారు. వెంటనే ఆమెను స్థానిక అశ్విని ఆస్పత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో మంటలను అదుపుచేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ


ప్రాణాలతో చెలగాటం

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీజిల్లాలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నవజాత శిశువుల సంఖ్య పదిహేనుకు చేరింది. ఆ ప్రమాదంలో గాయపడి, తీవ్ర అస్వస్థతతో ఉన్న మరో ముగ్గురు పిల్లలు కన్నుమూశారు. ఈ హృదయవిదారక ఘటన జరిగి అనేకరోజులు కావస్తున్నప్పటికీ, పిల్లల్లో ఇంకొందరు మరణం అంచున ఉన్నారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, ఒక్కటొక్కటిగా వెలుగుచూస్తున్న నిజాలు నిర్ఘాంతపరిచేట్టుగా ఉన్నాయి.

భారత ప్రభుత్వం ఈనెల 15నుంచి 21వరకూ నవజాత శిశువుల వారోత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నప్పుడే ఈ దారుణం జరిగింది. మహారాణి లక్ష్మీబాయి మెడికల్ కాలేజీలోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)లో మంటలు రేగినప్పటికి అందులో 49మంది పసికందులు ఉన్నారు. తన ఇద్దరు పిల్లలనూ కోల్పోయినప్పటికీ, ఏడుగురు పసికందులను ఓ తండ్రి ఎంతో సాహసంగా రక్షించిన ఉదంతం చాలామందిని కుదిపివేసింది. తక్షణమే పదిమంది ప్రాణాలు తీసి, పదహారుమంది నవజాతశిశువులను తీవ్రంగా గాయపరచిన ఆ దుర్ఘటనకు షార్ట్‌సర్క్యూట్ కారణమని తేల్చారు. పసికందులంతా నిత్యం ఆక్సిజన్‌మీద ఉండేవార్డులో అగ్గిరాజుకున్నప్పుడు అది మరింత వేగంగా, తీవ్రంగా వ్యాపిస్తుందన్నమాట నిజం. ఈ కారణంగానే విద్యుత్ ప్రమాదాలకు ఏ విధంగానూ అవకాశమివ్వనిరీతిలో ఐసీయూ, ఎన్ఐసీయూ వంటి సున్నితమైన, కీలకమైన యూనిట్ల నిర్మాణం జరుగుతుంది. ప్రమాదాన్ని నివారించడం, తీవ్రతను నిరోధించడం, వ్యాప్తిని అరికట్టడం ఇత్యాది చర్యల విషయంలో ఏ విధమైన లోటూ రాకుండా సదరు వ్యవస్థల రూపకల్పన ఉంటుంది. ఎన్ఐసీయూలో వార్మర్లు, వెంటిలేటర్లు, పంపులు, మానిటర్లు ఇలా ప్రతీపరికరమూ కరెంటుమీదే నడుస్తుంది కనుక లోడ్ ఎక్కువ ఉన్నా తట్టుకొనే రీతిలో ఏర్పాట్లు ఉంటాయి. పైపులద్వారా నిత్యం ఆక్సిజన్ సరఫరా అయ్యే ఇటువంటి చోట్ల ముందు జాగ్రత్తచర్యలు మరింత అవసరం. షార్ట్‌సర్క్యూట్‌కు ఓవర్‌లోడ్ కారణమైతే, పాతవైరింగ్ ప్రాణాలు తీసినమాట వాస్తవం. అధికశాతం అగ్నిప్రమాదాలకు విద్యుత్ లోపాలే కారణమనీ, ఆస్పత్రుల్లో ఆ అవకాశాలు మరింత అధికమనీ ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ప్రభుత్వ ఆస్పత్రి కనుక, అక్కడకు వచ్చేదంతా నిరుపేదలే కనుక ఈ ఘోరం వెనుక నిధుల కొరతో, నిర్లక్ష్యమో ఉండటం సహజం. ప్రమాదానికి కారణం షార్ట్‌సర్క్యూట్ అని వెనువెంటనే నిర్ధారించడం పెద్ద విషయమేమీ కాదు.

ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు వాటిని ఓ ప్రకృతివిపత్తులాగా, మానవమాత్రుల చేతిలో ఏమీ లేదన్నట్టుగా చిత్రీకరించడం సులభం. తప్పుచేసినవారిమీద చర్యలు తీసుకుంటామని అంటూనే, తప్పంతా కరెంటుమీదకు తోసేయడం కనిపిస్తూనే ఉంది. ఇక, ఈ ప్రభుత్వ ఆస్పత్రికి మొన్న ఫిబ్రవరిలో అగ్నిమాపకశాఖ నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ ఇవ్వడానికి నిరాకరించినమాట నిజం. తమ ఆడిటింగ్‌లో ప్రభుత్వ ఆస్పత్రే కదా అని ఈ శాఖ తేలికగా తీసుకోనందుకు మెచ్చుకోవాలి. అగ్నిమాపకశాఖ ఇలా సర్టిఫికేట్‌ను కాదనడంతో, మెడికల్ కాలేజీ పెద్దలు ప్రభుత్వానికి లేఖరాశారట. నిధులు కేటాయించినపక్షంలో భవనాలకు, యూనిట్లకు అవసరమైన రిపేర్లు చేయించుకుంటామని, అగ్నిప్రమాదాల నివారణకు సరిపడా సామగ్రిని తెప్పించుకుంటామన్నది ఆ లేఖ సారాంశం. దీనికి ప్రభుత్వం ఏ విధంగా స్పందించిందో తెలియదు కానీ, ఈ ప్రమాదం జరిగేనాటికి సదరు భవనాలకు అగ్నిమాపకశాఖ అనుమతులు లేవు. నిజానికి ఈ మెడికల్ కాలేజీకి ఎప్పటినుంచో ఈ విధమైన పలురకాల అనుమతులు లేవని మరికొన్ని వార్తలు కూడా వినబడుతున్నాయి. నిజానిజాలు అటుంచితే, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వమే నివాసయోగ్యం కాని చోట పసికందులను సైతం ఉంచి, వారి ప్రాణాలు పోవడానికి కారణమైందన్న విమర్శలను ఎదుర్కొంటోంది. ఈ యూనిట్ నిర్మాణంలో ఉన్న లోటుపాట్లమీద కూడా ఇప్పుడు విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఈ ఏడాది మేనెలలో ఢిల్లీలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఇటువంటి ప్రమాదమే జరిగి ఏడుగురు నవజాత శిశువులు మరణించిన విషయం తెలిసిందే. ఇటువంటి ఘటనలు ప్రతీ ఏటా, దేశమంతా ఎక్కడోక్కడ జరుగుతూనే ఉన్నందున, నవజాత శిశువులకు భద్రమైన, నాణ్యమైన ఆరోగ్యసంరక్షణ కల్పించే ఏర్పాట్లనూ, సదరు సంరక్షణ ప్రమాణాలను తనిఖీచేసే వ్యవస్థలనూ బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

కులం సంపూర్ణం.. ఆర్థికం అర్ధసత్యం.. తేలేది అదేనా?



కులం నిజం! ఆర్థికం అర్ధసత్యం! తెలంగాణ సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన సర్వే అందించనున్న దృశ్యం గురించి ఇందుకు భిన్నంగా సూత్రీకరించలేం! కులం గురించి చెప్పటానికి ఇష్టపడని వారూ సర్వేలో ఎదురుపడ్డారు. కులగణనతో ప్రయోజనం లేదని తలచినవారూ అందులో పాల్గొనటానికి ససేమిరా అన్నారు. సర్వే ముందుకెళ్లిన కొద్దీ ఈ ఇరు వర్గాల సంఖ్యా గణనీయంగా పెరగలేదు. సర్వేలో ఏదో విధంగా పాల్గొన్న వారి సంఖ్యే ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. ఇక అనుకున్నట్లుగా సర్వే ముగిసి లెక్కలు కొలిక్కి వస్తే అటుఇటుగా కులాల సంఖ్యాబలం తేలిపోతుంది. ఆమేరకు సర్వే సఫలం అనుకోవచ్చు! ఈ సఫలత వెనుక ఒక ప్రగాఢ విఫలత కూడా కాచుకుని ఉంది. అది సృష్టించే ఇబ్బందులే ప్రధానమైనవి. ఆర్థిక స్థితిగతులకు సంబంధించి లభించే అసమగ్ర చిత్రమే ఆ విఫలతగా భావించొచ్చు. అనుకున్న లక్ష్యాన్ని సర్వే చేరుకోకుండా నిలిపివేసేది ఆ అసమగ్ర చిత్రమే!

ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన అసమగ్ర సమాచారంతోనే అసలు చిక్కంతా ఉంది. ఆ సమాచారంతో వివిధ వర్గాల, కులాల నిజ స్థాయిని సరిగా అంచనా వేయలేం. ఒక కులంలో ఆర్థిక అంతరాలను సమగ్రంగా లెక్కించలేని సర్వేతో చాలా విలువైన సమాచారం లభించని పరిస్థితే నెలకొంటుంది. వివిధ రూపాల్లో ఉన్న ఆస్తులు, సంపద గురించి నిజాయితీగా చెప్పే వారి సంఖ్య అంత ఆశాజనకంగా లేదనే సమాచారం క్షేత్రస్థాయి నుంచి అందుతోంది. సర్వే ఆరంభమైన మొదటిరోజు నుంచీ ఆస్తులు, సంపద గురించి విపులంగా చెప్పటానికి విముఖతను వ్యక్తం చేసిన వారు గణనీయంగానే ఉన్నారు. ఈ విముఖత మధ్యతరగతి, ధనికుల్లోనే గాక పెద్దగా ఆస్తుల్లేని వర్గాల నుంచి కూడా వ్యక్తమవుతోంది. ఆస్తులు చెప్పినవారు కూడా మొత్తం సమాచారం ఇచ్చారని భావించలేం. నాలుగు ఆస్తులు ఉంటే ఒకటి రెండు ఆస్తులు చెప్పి సరిపెట్టిన వాళ్లు ఎందరో ఉన్నారు. అంతెందుకు.. వ్యక్తిగత వాహనాల గురించి కూడా సరైన చిత్రం వస్తుందని విశ్వసించలేం. సర్వేలో ప్రజలు వెల్లడించిన వాహనాల సంఖ్యతో రవాణాశాఖ దగ్గర ఉన్న సమాచారంతో పోల్చి చూస్తే పరిమితులేమిటో తెలుస్తాయి. అస్తుబిస్తు ఆస్తులు ఉండి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అందుకుంటున్న వారు కూడా చాలా చోట్ల సరైన సమాచారం చెప్పిన దాఖలాలు కనపడటం లేదు. ఆస్తులు ఉన్నవి ఉన్నట్లుగా చెబితే పథకాలు అందవన్న భయమూ వ్యక్తమైంది. భూ ఆస్తులకు సంబంధించి సరైన సమాచారం అందిస్తే రెవెన్యూ, రిజి[illegible]న్ రికార్డులతో అది నూటికి నూరుపాళ్లు సరిపోవాలి. పట్టణాలు, నగరాల్లో అది ఎలాగూ జరగని పని! కనీసం గ్రామాల్లోని ఆస్తులకు సంబంధించైనా అట్లా సరిపోయే సమాచారాన్ని ప్రజలు ఇచ్చి ఉంటే ఒక అద్భుతంగా చెప్పుకోవచ్చు.

తెలంగాణలోనే కాదు దేశంలో ఎక్కడ సర్వే చేపట్టినా ఇదే పరిస్థితి ఉంటుంది. ఆస్తుల గురించి ప్రభుత్వాలు అడిగినప్పుడు ప్రజల స్పందన ఇలా ఉండటానికి బలమైన కారణం ఉంది. ఏ చట్టాన్నీ నిజాయితీగా అమలుచేయలేని ప్రభుత్వాలపై ప్రజల అంతరాంతాల్లో అపనమ్మకం గూడుకట్టుకుని ఉంటుంది. ఈ వైఖరి వలసపాలన కాలం నుంచి కొనసాగుతోంది. అధిక శిస్తులు, పన్నులతో ప్రభుత్వాలు ప్రజల్ని పీడించిన చరిత్ర కూడా దీనికి కారణమనే చెప్పాలి. చట్టాలను అతి సంక్లిష్టంగా రూపొందించి అర్థం కాకుండా ప్రజలను హడలెత్తించటంలో మనకెవరూ సాటిరారు. పోనీ చేసిన ఆ చట్టాలను నిక్కచ్చిగా అమలుపరచామా? అంటే అదీ లేదు. చట్టాల అమలు సాఫల్యతా రేటులో మనకు గొప్ప చరిత్ర లేదు. ఈ విషయంలో పాస్‌మార్కులు కూడా మనకు పడవు. భూసంస్కరణలు, వరకట్న నిషేధం, కులవివక్ష, పర్యావరణ పరిరక్షణ, భవన నిర్మాణ అనుమతులు లాంటి అందరికీ తెలిసిన విషయాలపై చట్టాలను తీసుకున్నా ఇదే పరిస్థితి కనపడుతుంది. చట్టాల్లో కఠినత, అమల్లో అసమర్థత.. ఇదే మన అసలైన చరిత్ర! దీన్ని దృష్టిలో ఉంచుకునే ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత గనర్ మిర్డాల్.. భారత్‌లోని ప్రభుత్వ వ్యవస్థను దృఢమైన ఆచరణకు పూనుకోని మెతక రాజ్యం (సాఫ్ట్ స్టేట్)గా వ్యాఖ్యానించారు. ఆస్తుల విషయంలో గోప్యతను పాటించటం మన సంస్కృతిలో భాగమైపోయింది. ఇరుగు దిష్టి.. పొరుగు దిష్టి పేరుతో దాచిపెట్టటం కూడా మనకు అలవాటే. ఇంటి చుట్టూ కన్నుకుట్టే వాళ్లుంటారనే నమ్మకం హిందూ ఆలోచనా విధానంలో సర్వసాధారణమని ప్రముఖ రచయిత నీరద్ సి చౌదరి 45 ఏళ్ల క్రితం చాలా చక్కగా చెప్పారు.

> **పాలనలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడటం ఒక ప్రజాస్వామిక ఆదర్శం. భారత్‌లో మాత్రం అన్ని కులాలకు సముచిత ప్రాధాన్యం ఒక రాజకీయ ఆదర్శం. ఆర్థిక పరిస్థితులను లెక్కలోకి తీసుకోకపోతే ఈ ఆదర్శమూ నెరవేరదు. కులాల్లో అట్టడుగున ఉన్న వారికీ న్యాయమూ దక్కదు. కేవలం కులం చుట్టూ మాత్రమే రాజకీయాలు నడిపితే కొనసాగేది అసమానతలే! ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా ప్రతిబింబించని ఏ కుల ఎక్స్‌రే సంపూర్ణం కాదు! అసంపూర్ణ ఎక్స్‌రేలతో లభించే సామాజిక న్యాయమూ అంతంతే!**



■ రాహుల్ కుమార్

కులాల లెక్కలను అధికారికంగా తేల్చాలన్న డిమాండు బీసీ వర్గాల నుంచి వచ్చింది. దీని లక్ష్యం ఒక్కటే. బీసీల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు ఉండాలి. వాటిని సాధించాలంటే కులాల లెక్కలు తేలాలి. 1960ల్లోనే రాంమనోహర్ లోహియా 'మేం 60.. మాకు 60' (60 శాతం జనాభా... 60 శాతం రిజర్వేషన్లు) అనే నినాదం ఇచ్చారు. అగ్రకులాల ఆధిపత్యంతో నిండిన కాంగ్రెస్ రాజకీయాలను ఎదుర్కొని బీసీలను సంఘటితపరచటానికి లోహియా పదునుపెట్టిన మార్గమది. ఆ మార్గం ఎన్నో ఎగుడుదిగుడులు చూసినప్పటికీ 1990ల నాటికి మండల్ రాజకీయాల రూపుతీసుకుని కాంగ్రెస్‌ను హిందీ రాష్ట్రాల్లో తీవ్రంగా దెబ్బతీసింది. అప్పటి నుంచీ ఆ ప్రాంతంలో కాంగ్రెస్ పెద్దగా కోలుకోలేదు. అందుకే ఒకనాడు తనను ఓడించిన రాజకీయాలను చేపట్టి మళ్లీ చక్రం తిప్పుతోంది. ఒకనాడు కాదన్నది నేడు అవుననటం రాజకీయాల్లో కొత్తకాదు. ఉదార ప్రజాస్వామ్య విధానాల స్థానంలో సంకుచిత జాతీయవాద ధోరణులు విజృంభించటమే దీనికి నిదర్శనం.

నిజానికి బీసీల జనాభా ఎంతో ఎవరికీ తెలియనిది కాదు. అనేక సర్వేల్లో ఇప్పటికే స్పష్టమైంది. 50 శాతానికి కాస్త అటుఇటుగానే వారి జనాభా ఉంటుంది. మండల్ కమిషన్ 52 శాతం బీసీలు (44శాతం హిందువులు, 8 శాతం ముస్లింలు) ఉన్నారని పేర్కొంది. 1931 నాటి జనాభా లెక్కలనూ ఆ తర్వాత 10 ఏళ్లకు పెరిగే జనాభా వృద్ధి రేటుని బట్టి మండల్ కమిషన్ ఆ అంచనాకు వచ్చింది. తెలంగాణ కులగణనలో సంఖ్యాపరంగా అనూహ్యమైన ఫలితాలు వచ్చే అవకాశం లేదు. జనాభా ఇంతని అధికారికంగా తేలితే రాజకీయ పదవులు, ఉద్యోగాలు, విద్యా ప్రవేశాల్లో అంతమేరకు రిజర్వేషన్లను కల్పించాలనే డిమాండు ఊపందుకుంటుంది. ఇక సంఖ్యని బట్టి వాటాలు అందిస్తామనే నినాదాన్ని ఎత్తుకున్న కాంగ్రెస్ పార్టీకి దాని నుంచి తప్పించుకునే అవకాశమూ లేదు. ఒకనాడు బీసీలను ఉపేక్షించి అగ్ర–కింది కులాలు – మైనారిటీల త్రైపాక్షిక అండతో రాజకీయ ఆధిపత్యం నడిపిన కాంగ్రెస్ కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే అగ్నిపరీక్షను ఎదుర్కొంటుంది. అది కూడా బీసీల నుంచే. ఘనీభవించిన కుల అస్తిత్వాలను ఒక పట్టాన కరిగించలేం. ఎప్పటికైనా అది గడ్డు సమస్యే!

బీసీల సంఖ్యపై అనూహ్యఫలితాలు రావనటానికి తెలంగాణకు సంబంధించి ఒక భూమిక ఉంది. 1931లో ఆనాటి నిజాం రాజ్యంలో సేకరించిన జనాభా సేకరణలో కులాల లెక్కలు స్పష్టంగానే తేలాయి. ఆనాటి తెలంగాణలో 75,54,598 మంది జనాభా ఉన్నారు. అందులో ముస్లింలు 9 శాతం ఉంటే అగ్రకులాల జనాభా 7,36,421 మాత్రమే. చిన్నాచితకా అగ్రకులాలను పరిగణనలోకి తీసుకున్నా కూడా మొత్తం హిందువుల్లో వారు 11–12 శాతం లోపే ఉంటారు. ఇక మాలలు (4,81,722), మాదిగలు (7,72,680), గిరిజనులు (3,99,061) జనాభా 16,53,463 మందిగా తేలింది. అగ్రకులాలు, ఎస్సీ–ఎస్టీ, ముస్లింలు, క్రైస్తవులను కూడి చూస్తే మొత్తం 32,13,083 మంది అయ్యారు. వీళ్ల మినహా మిగతా వాళ్లందరినీ బీసీలుగా పరిగణిస్తే వారు 43,41,515 మంది ఉన్నారు. అంటే దాదాపుగా 57 శాతం! అన్ని రాష్ట్రాల్లోనూ 90 శాతంపైగా కులాలు ప్రస్తుతం రిజర్వేషన్ల జాబితాలోనే ఉన్నాయి. కాబట్టి ఏ కోణం నుంచి చూసినా బీసీల జనాభా 50 శాతానికి దరిదాపుల్లో ఉండటం అనూహ్యం కాదు. తెలంగాణలో 249 కులాలను గుర్తిస్తే అందులో 18 మాత్రమే అగ్రకులాల జాబితాలో ఉన్నాయి. అంటే 7 నుంచి 8 శాతంలోపే ఉన్నాయి.

సర్వేల్లో ఆర్థికస్థితిపైన ఖచ్చితమైన సమాచారం సేకరించటమే చాలా కీలకం. కానీ దాపరికం అంతా దాంట్లోనే ఉంటోంది. ప్రతి కులంలో ఆర్థిక వ్యత్యాసాలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో సరైన సమాచారం చాలా అవసరం. బీసీలందరూ ఒకే స్థితిలో లేరు. ఆ కేటగిరీలో కొన్ని కులాలు విద్యా, ఉద్యోగ అవకాశాలను పొందటంలో చాలా ముందున్నాయి. ఉదాహరణకు బిహార్‌లో ఓబీసీ ఉద్యోగులు 6.21 లక్షలు ఉంటే మూడు ఓబీసీ కులాలు (యాదవ, కూర్మీ, కుశావహ) అందులో 83 శాతం ఉద్యోగాలను దక్కించుకున్నాయి. పక్కాగా సమాచార సేకరణ జరిపితే చాలా రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి కనపడొచ్చు. తెలంగాణలో కూడా విద్యా ప్రవేశాలు, ఉద్యోగాల విషయంలో ఊహించని దృశ్యం కనపడే అవకాశాన్ని కొట్టివేయలేం! గ్రూప్–1 ప్రధాన పరీక్షకు అర్హులుగా తేల్చటానికి ఆధారంగా తీసుకున్న జీవో 29పై ఇటీవల చాలా వివాదం చెలరేగింది. ఆ జీవోతో బీసీలకు అన్యాయం జరుగుతోందన్న వాదనను బలంగానే వినిపించారు. కానీ దాని ఆధారంగా పరీక్షకు అర్హత పొందిన వారిలో బీసీలు 57.1 శాతం ఉన్నారు. అంటే రిజర్వేషన్ల శాతానికి దాదాపు రెట్టింపు మంది అదనంగా అర్హత సాధించారు. ఎంబీబీఎస్ సీట్ల విషయంలోనూ కొంచెం తేడాలతో ఇదే పరిస్థితి నెలకొంది. మారుతున్న పరిణామాలకు ఇవి సూచికలు మాత్రమే. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి కులాలవారీ సమాచారం వస్తే వాస్తవం ఏమిటో మరింతగా స్పష్టమవుతుంది. బిహార్ పరిస్థితే తెలంగాణలో కూడా ఉందో లేదో అప్పుడే తేలుతుంది. బిహార్‌లో దాదాపుగా 1990ల నుంచి రాజకీయంగా ఓబీసీల ఆధిపత్యమే ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఆ పరిస్థితి లేదు. ఉదాహరణకు తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాల్లో బీసీలు 19 మందే గెలిచారు. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలకు గానూ 37గురు బీసీలే ఎన్నికయ్యారు.

> **ఒకనాడు బీసీలను ఉపేక్షించి అగ్ర–కింది కులాలు– మైనారిటీల త్రైపాక్షిక అండతో రాజకీయ ఆధిపత్యం నడిపిన కాంగ్రెస్ కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే అగ్నిపరీక్షను ఎదుర్కొంటుంది. అది కూడా బీసీల నుంచే. ఘనీభవించిన కుల అస్తిత్వాలను ఒక పట్టాన కరిగించలేం. ఎప్పటికైనా అది గడ్డు సమస్యే!**

పాలనలో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూడటం ఒక ప్రజాస్వామిక ఆదర్శం. భారత్‌లో మాత్రం అన్ని కులాలకు సముచిత ప్రాధాన్యం ఒక రాజకీయ ఆదర్శం. ఆర్థిక పరిస్థితులను లెక్కలోకి తీసుకోకపోతే ఈ ఆదర్శమూ నెరవేరదు. కులాల్లో అట్టడుగున ఉన్న వారికీ న్యాయమూ దక్కదు. కేవలం కులం చుట్టూ మాత్రమే రాజకీయాలు నడిపితే కొనసాగేది అసమానతలే! ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా ప్రతిబింబించని ఏ కుల ఎక్స్‌రే సంపూర్ణం కాదు! అసంపూర్ణ ఎక్స్‌రేలతో లభించే సామాజిక న్యాయమూ అంతంతే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ట్రంప్ గండంలో హరిత పరివర్తన

డోనాల్డ్ ట్రంప్ రెండో రాకడతో వాతావరణ మార్పు సంక్షోభంపై పోరు భవితవ్యం సందిగ్ధంలో పడింది. మరి రెండు నెలల్లో అమెరికా (హరిత గృహ వాయువుల ఉద్గారంలో చారిత్రకంగానూ, వర్తమానంలోనూ ప్రపంచ అగ్రగామి) అధ్యక్ష పదవీ బాధ్యతలను చేపట్టనున్న ట్రంప్ మహాశయుడు వాతావరణ మార్పు అనే విపత్కర పరిణామాన్ని సందేహిస్తున్న నాయకుడు. వాతావరణ సంక్షోభం అంతకంతకూ తీవ్రతరమవుతున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల వినియోగం కొనసాగితీరాలన్న విషయమై గట్టి పట్టుదలతో ఉన్న ప్రపంచ నేత. అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన వెన్వెంటనే ఇంధన ధరలు తగ్గిస్తానని, హరిత ఇంధన ప్రణాళికలను రద్దు చేస్తానని ట్రంప్ స్పష్టం చేశారు. ఇంధన పరిశ్రమ మళ్లీ 'డ్రిల్ బేబీ డ్రిల్' (2008 అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ నినాదమది. ఇంధన అవసరాలను తీర్చుకునేందుకు పెట్రోలియం, సహజ వాయువు నిక్షేపాలను మరింతగా ఉపయోగించుకోవాలన్న విధానానికి మద్దతుగా ఈ నినాదాన్ని రూపొందించారు. ట్రంప్ ఇటీవలి ఎన్నికలలో దాన్ని పదే పదే ఉపయోగించుకున్నారు) కాలానికి వెళ్లాలని ఆయన సూచిస్తున్నారు. ఏమిటి దీనర్థం? చమురు, సహజ వాయువు అన్వేషణకు ఫెడరల్ ల్యాండ్స్ (అమెరికా జాతీయ ప్రభుత్వం యాజమాన్యంలో ఉన్న భూములు)లో చమురు, సహజ వాయువు నిక్షేపాల అన్వేషణను గరిష్ఠంగా ముమ్మరం చేయడమే. శిలాజ ఇంధనాల పరిశ్రమలపై నియంత్రణలను సడలించాలని కూడా ట్రంప్ గట్టిగా ప్రతిపాదించారు. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ పాలనలోనూ అమెరికా శిలాజ ఇంధన చక్రవర్తిగా వెలుగొందుతోంది! మున్నెన్నడూ ఏ దేశమూ ఉత్పత్తి చేయనంత గరిష్ఠ పరిమాణంలో చమురును అమెరికా ఉత్పత్తి చేస్తోంది. రష్యా కంటే 40 శాతం అధికంగా చమురును అమెరికా ఉత్పత్తి చేస్తోంది. మళ్లీ శిలాజ ఇంధనాల ఉపయోగాన్ని తీవ్రతరం చేసుకోవాలన్న ట్రంప్ అభిలాష మన ధరిత్రి ఆరోగ్యానికి ఎటువంటి ఆపదగా పరిణమించనున్నదో మనం అర్థం చేసుకుతీరాలి.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

పునరుద్ధరణీయ ఇంధన వనరులు, విద్యుత్ వాహనాల విషయంలో బైడెన్ ప్రభుత్వ ప్రణాళికలను ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. అవి 'పరిశ్రమ వినాశనకారులు', 'ఉద్యోగాలను భారీగా నష్టపరిచే'వని ఆయన విమర్శించారు. అంతేకాకుండా 'చైనా అనుకూల', 'అమెరికా వ్యతిరేక' మైనవిగా ఆయన నిక్కచ్చిగా అభివర్ణించారు. మొత్తం మీద ఆయన గత కాలం వ్యాపార, పారిశ్రామిక రీతులకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నారు. ధరిత్రికి, మానవాళి మనుగడకు ముంచుకొస్తున్న పెనుముప్పును నిరోధించేందుకు ఉత్పత్తి కార్యకలాపాల హరిత పరివర్తన అనివార్యమనే భావననే ట్రంప్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నారు.



> **పర్యావరణ పరిరక్షణ రంగంలో కృషి చేస్తున్న వారు తమ లక్ష్య పరిపూర్తికి కొత్త ఆలోచనలు చేయాలి. అభివృద్ధిచెందుతున్న దేశాలలోనే కాకుండా పారిశ్రామిక సంపన్న దేశాలలో సైతం సమ్మిళిత హరిత పరివర్తన దిశగా నూతన విధానాలను అనుసరించాలి. ట్రంప్ ఎన్నిక సూచిస్తున్న సత్యమది. అది స్పష్టంగా ఉన్నది. ఉపేక్షిస్తే సమస్త మానవ కోటి భవితవ్యం ప్రమాదంలో పడుతుంది.**

ఈ నేపథ్యంలో వాతావరణ మార్పుపై ప్రపంచ దేశాల సమష్టి పోరుకు అమెరికా ఎలాంటి దోహదం చేయనున్నది అన్నదే ఇప్పుడు మనముందున్న ప్రశ్న. వాతావరణ మార్పు నెదుర్కోవడానికి ఉద్దేశించిన అంతర్జాతీయ ఒప్పందాల భవితవ్యమేమిటి? ఈ ప్రశ్నను మనం అడగవలసిన అవసరమున్నది. ఎందుకంటే 2024లో ట్రంప్ విజయం యాదృచ్ఛికమైనది కాదు. 2016లో ఆయన మొదటిసారి గెలిచినప్పుడు ఆయన దేనిని అంగీకరిస్తారు, దేనిని వ్యతిరేకిస్తారో అన్న విషయమై ప్రపంచ దేశాలకు గానీ, అసలు అమెరికా ప్రజలకు గానీ కచ్చితమైన అవగాహన లేదు. వాతావరణ మార్పు వాస్తవాన్ని నిరాకరించడంతో సహా వివిధ అంశాలపై తన స్పష్టమైన వైఖరి పట్ల సంపూర్ణ ఏకీభావంతోనే అమెరికా ఓటర్లు తనను గెలిపించారనే దృఢ విశ్వాసంతో ట్రంప్ మళ్లీ అధికార పగ్గాలను చేపట్టబోతున్నారు. ఈ దృష్ట్యా ఆయన నిర్ణయాలు, చర్యలు ఎలా ఉన్నా మనం ఆశ్చర్యపోనక్కరలేదు. మానవాళి మనుగడకు అంతకంతకూ పెరుగుతున్న ముప్పును నిరోధించే ప్రగతిశీల, ప్రభావదాయక చర్యలు చేపట్టేందుకు ప్రపంచం ఎలా ముందుకు సాగాలి? అన్నదే మన ముందున్న ప్రశ్న.

వాతావరణ మార్పును నిరోధించాలని ప్రపంచానికి చెప్పుతూనే భారీ పరిమాణంలో శిలాజ ఇంధనాలను ఉత్పత్తి చేస్తున్న అమెరికా నయవంచన ధోరణిని అటుంచితే వాతావరణ చర్య (క్లైమేట్ యాక్షన్)కు నిబద్ధత విషయంలో జోబైడెన్ తనకు ముందున్న అధ్యక్షుల కంటే భిన్నమైన పరిపాలకుడు అనడంలో సందేహం లేదు. 2030 సంవత్సరం నాటికి హరిత గృహ వాయువుల ఉద్గారాన్ని 2005 నాటి స్థాయికి 50 నుంచి 52 శాతం మేరకు తగ్గించాలనే లక్ష్యాన్ని బైడెన్ నిర్దేశించారు. 2035 నాటికి 100 శాతం కర్బన కాలుష్య రహిత విద్యుదుత్పత్తికి ఆయన నిబద్ధమయ్యారు. పర్యావరణంపై ప్రతికూల ప్రభావాలు సాధ్యమైనంత తక్కువగా ఉండే హరిత సాంకేతికతల అభివృద్ధికి పెట్టుబడులను ప్రోత్సహించేందుకు బైడెన్ చొరవతో కాంగ్రెస్ ఆమోదించిన ద్రవ్యోల్బణ తగ్గింపు చట్టం విశేష దోహదకారిగా ఉన్నది. హరిత గృహ వాయువు ఉద్గారాలను అరికట్టేందుకు అమెరికా చిత్తశుద్ధితో నిబద్ధమయితే ప్రపంచ దేశాలు అన్నీ అదే బాటలో పయనించడం అనివార్యమవుతుంది. అంతే కాకుండా వాతావరణ మార్పుపై మనం మరింత సమష్టిగా కార్యాచరణకు పూనుకునే అవకాశాలు మెరుగుపడతాయి. ఇంత మాత్రాన మనం సమస్య నుంచి పూర్తిగా బయటపడతామని నేను చెప్పబోవడం లేదు. బైడెన్ నేతృత్వంలో అమెరికా నిబద్ధత హరిత పరివర్తనకు ఒక సానుకూలతను సృష్టించిందనడంలో సందేహం లేదు.

వాతావరణ మార్పుపై 2015 పారిస్ ఒప్పందం, ఐక్యరాజ్యసమితి ఒడంబడిక మొదలైన అంతర్జాతీయ ఒప్పందాల నుంచి అమెరికాను ఉపసంహరించేందుకు ట్రంప్ నిర్ణయం తీసుకుంటారా అనేది ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్న. ఆయన తప్పకుండా అమెరికాను ఆ ఒప్పందాల నుంచి బయటపడేస్తారనే అత్యధికులు విశ్వసిస్తున్నారు. అదే జరిగితే కార్బన్–డై–ఆక్సైడ్, ఇతర హరిత గృహ వాయువుల ఉద్గారాలను తగ్గించేందుకు ప్రపంచ దేశాల ప్రయత్నాలకు తీవ్ర విఘాత మేర్పడుతుందనడంలో సందేహం లేదు. సదరు ఉద్గారాల ప్రతికూల ప్రభావాలను తగ్గించే, పర్యావరణ హితకరమైన పద్ధతులను అనుసరించేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగు ఆర్థిక సహాయమందించే లక్ష్యంతో ఒక అంతర్జాతీయ సహకార ఒప్పందాన్ని రూపొందించడం కష్టతరమవుతుంది. ఇదొక కఠోర వాస్తవం. దీనితో మనం తలపడాలి, మరో మార్గం లేదు.

కర్బన ఉద్గారాలు తక్కువగా ఉండే ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధిపరచుకోవడంలో ప్రపంచ దేశాలు చెప్పుకోదగిన పురోగతిని సాధించాయి. ఈ విషయంలో అవి మళ్లీ వెనక్కి వెళ్లడం అంత తేలికకాదు. బ్యాటరీలు, పునరుద్ధరణీయ ఇంధనంతో సహా హరిత సాంకేతికతల అభివృద్ధికి భారీ స్థాయిలో పెట్టుబడులు సమకూరుతున్నాయి. ఈ పర్యావరణ హిత నూతన ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధిపరచుకోవడంపై ఆసక్తి ఇతోధికమవుతోంది. ఏమైనా పర్యావరణ పరిరక్షణ రంగంలో కృషి చేస్తున్నవారు తమ లక్ష్య పరిపూర్తికి కొత్త ఆలోచనలు చేయాలి. వాతావరణ మార్పు నెదుర్కోవడంలో వ్యయప్రయాసలపై కచ్చితమైన అవగాహన కల్పించుకోవాలి. అభివృద్ధి చెందుతున్న దేశాలలోనే కాకుండా పారిశ్రామిక సంపన్న దేశాలలో సైతం సమ్మిళిత హరిత పరివర్తన దిశగా కొత్త విధానాలను అనుసరించాలి. ట్రంప్ ఎన్నిక సూచిస్తున్న సత్యమది. అది స్పష్టంగా ఉన్నది. ఉపేక్షిస్తే సమస్త మానవ కోటి భవితవ్యం ప్రమాదంలో పడుతుంది..

ఆహార సమృద్ధిలోనూ ఆకలి దప్పులా?

ప్రపంచం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలు, పెను సవాళ్లు, సంక్షోభాలను నిశితంగా పరిశీలించి పటిష్ఠ, సుస్థిర, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధిని సాధించి, పెంపొందించేందుకు జీ–20 కూటమి సభ్య దేశాల ప్రభుత్వాధినేతల శిఖరాగ్ర సదస్సు నవంబర్ 18, 19 తేదీలలో బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరిగింది. ఈ కూటమిలో 19 ప్రపంచ అగ్రగామి పారిశ్రామిక దేశాలు, ప్రపంచ ఆర్థిక శక్తులుగా ఆవిర్భవిస్తున్న దేశాలతో పాటు యూరోపియన్ యూనియన్, ఆఫ్రికన్ యూనియన్ భాగస్వాములుగా ఉన్నాయి. ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులు ఈ కూటమి దేశాలలోనే ఉన్నది. ప్రపంచ జీడీపీలో ఐదింట నాలుగో వంతుకు పైగా ఈ దేశాల వాటాగా ఉన్నది. సరే, జీ20 అగ్రనాయకులలో మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒకరని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

సుస్థిర అభివృద్ధి ఎజెండా ఊపిరిపోసుకున్న రియో డి జనీరో నగరంలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో న్యాయబద్ధమైన సమాజాల నిర్మాణం, సుస్థిర అభివృద్ధితో వర్ధిల్లే ధరిత్రి, అసమానతలపై సమగ్ర పోరాటానికి ప్రాధాన్యమివ్వడం పట్ల సభ్య దేశాల అధినేతలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. జీ20 బ్రెజీలియన్ ప్రెసిడెన్సీ ప్రాథమ్యాల ప్రాతిపదికన సుస్థిరాభివృద్ధి సాధనలో నిర్దిష్ట ఫలితాలు సాధించే దిశగా చేపట్టే చర్యలను రియో డి జనీరో నాయకుల ప్రకటన వెల్లడించింది. అవి: 1) సామాజిక సమ్మిళితత్వం, ఆకలి, పేదరికంపై పోరాటం; 2) ఇంధన పరివర్తన, వాతావరణ మార్పు నిరోధక కార్యాచరణ; 3) ప్రపంచ పాలనా సంస్థల్లో సంస్కరణలు.

'గాజా, లెబనాన్‌లో నెలకొన్న మానవతా సంక్షోభం' గురించి జీ20 నాయకుల ప్రకటన ప్రముఖంగా ప్రస్తావించింది. యుద్ధ బీభత్సంలో అల్లాడిపోతున్న ఆ పశ్చిమాసియా ప్రాంతాల ప్రజలకు మానవతాపూర్వక సహాయాన్ని మరింతగా అందించాలని, పౌరులను రక్షించేందుకు పటిష్ఠచర్యలు చేపట్టాలని ఆ ప్రకటన పిలుపునిచ్చింది పాలస్తీనియన్ల స్వయం నిర్ణయాధికార హక్కును సమర్థిస్తూ ఇజ్రాయెల్, పాలస్తీనియన్ రాజ్యం పక్కపక్కనే సహజీవనం నెరపేందుకు వీలుకల్పించే రెండు రాజ్యాల పరిష్కారం పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నామని జీ20 నాయకుల ప్రకటన పేర్కొంది. రష్యా లోతట్టు ప్రాంతాలపై దీర్ఘశ్రేణి క్షిపణి దాడులను నిర్వహించేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అనుమతినివ్వడం ప్రధాన చర్చనీయాంశమయింది. 'ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను అమెరికా పూర్తిగా సమర్థిస్తున్నది. ఈ సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల నాయకులు కూడా అమెరికా వైఖరిని గౌరవిస్తారని నేను భావిస్తున్నాన'ని బైడెన్ అన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ సదస్సుకు గైర్హాజర్ అవ్వడం గమనార్హం. ఆయనకు బదులుగా రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ సదస్సుకు హాజరయ్యారు. రష్యా పేరు ప్రస్తావించకుండా యుద్ధం కారణంగా ఉక్రెయిన్ ప్రజలు ఎదుర్కొంటున్న ఇక్కట్లను పేర్కొంటూ ఆ దేశంలో వీలైనంత త్వరలో శాంతిని నెలకొల్పాలని ఆ ప్రకటన విజ్ఞప్తి చేసింది.

జీ20 సదస్సు సన్నాహాలలో భాగంగా సభ్య దేశాల మంత్రుల బృందం ప్రపంచ సంపన్నుల ఆదాయంపై 2 శాతం పన్ను విధించాలన్న బ్రెజిల్ ప్రతిపాదనను చర్చించింది. సదరు పన్ను పరిధిలోకి ప్రపంచవ్యాప్తంగా 3000 మంది కుబేరులు వస్తారు. వారిలో 100 మంది లాటిన్ అమెరికా దేశాలకు చెందినవారు. గత జూలైలో రియోలో జరిగిన మంత్రుల సమావేశం సంపద, ఆదాయ అసమానతలు ఆర్థికాభివృద్ధిని, సామాజిక సామరస్యాన్ని కుంటుపరుస్తున్నాయని అంగీకరించారు. ఫ్రెంచ్ ఆర్థికవేత్త Gabrial Zucman గత ఏడాది కుబేరుల ఆదాయంపై 2 శాతం పన్ను విధించడం ద్వారా 25,000 కోట్ల డాలర్ల నిధులను అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సమకూర్చుకోవచ్చని ప్రతిపాదించారు.

> **ఆకలి నిర్మూలన లక్ష్యానికి జీ20 కూటమి నాయకుల రియో డి జనీరో ప్రకటన అగ్రప్రాధాన్యమిచ్చింది. రాజకీయ నిర్ణయాల కారణంగానే ఆకలి దప్పులు, పేదరికం మానవాళిని పీడిస్తున్నాయని బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ లూలా అన్నారు. ఏటా 600 కోట్ల టన్నుల ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్న ప్రపంచంలో అశేష ప్రజలు ఆకలి దప్పులతో అలమటించిపోవడం ఎంతమాత్రం అంగీకారయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. గ్లోబల్ అలయెన్స్ ఎగెనిస్ట్ హంగర్ అండ్ పావర్టీ పేరిట ఒక టాస్క్‌ఫోర్స్ నేర్పాటు చేయాలన్న బ్రెజిల్ నాయకత్వంలోని జీ20 ప్రతిపాదనను సభ్య దేశాలు ఆమోదించాయి.**




బ్రెజిల్ అధ్యక్షుడు లూలా అగ్రప్రాధాన్యమిచ్చిన ఆకలి నిర్మూలన లక్ష్యానికి జీ20 దేశాల నాయకుల ప్రకటన ఎనలేని ప్రాముఖ్యతనిచ్చింది. ఆకలి దప్పులు, పేదరికం ఆహార కొరత లేదా ప్రాకృతిక విపత్తుల ఫలితాలు కావని, రాజకీయ నిర్ణయాల కారణంగానే అవి మానవాళిని పీడిస్తున్నాయని లూలా అన్నారు. పేదరికంలో పుట్టి కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించి రాజకీయాలలోకి ప్రవేశించి అత్యున్నత పదవిని అధిష్ఠించిన లూలా ఏటా 600 కోట్ల టన్నుల ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్నా ప్రపంచంలో అశేష ప్రజలు ఆకలి దప్పులు, పేదరికంలో కొనసాగడం ఎంతమాత్రం అంగీకార యోగ్యం కాదని అన్నారు. ఆకలి దప్పులు లేని ప్రపంచాన్ని నిర్మించడం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ఒకటి. ఆ లక్ష్యాల పరిపూర్తికి గడువుగా నిర్దేశించుకున్న 2030 సంవత్సరం సమీపిస్తున్న తరుణమిది. అయినప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ప్రజలు ఆహార హక్కుకు నోచుకోలేకపోతున్నారు. ఆకలి, పేదరికం సమస్యలను రూపుమాపేందుకు బ్రెజిల్ నాయకత్వంలోని జీ20 గ్లోబల్ అలయెన్స్ ఎగెనిస్ట్ హంగర్ అండ్ పావర్టీ పేరిట ఒక టాస్క్‌ఫోర్స్ నేర్పాటుచేయాలన్న బ్రెజిల్ నాయకత్వంలోని జీ20 ప్రతిపాదనకు సభ్య దేశాలు అన్నీ అంగీకరించాయి. ఆకలి నిర్మూలనకు ఉద్దేశించిన ప్రజా విధానాలను అమలుపరిచేందుకు, సామాజిక సాంకేతికతలను అభివృద్ధిపరిచేందుకు అవసరమైన నిధులను సమీకరించడం ఈ టాస్క్‌ఫోర్స్ లక్ష్యంగా నిర్దేశించారు. సభ్య దేశాలే కాకుండా రాక్ ఫెల్లర్ ఫౌండేషన్, బిల్ అండ్ మెలిందా గేట్స్ ఫౌండేషన్ మొదలైన పౌర సమాజ సంస్థలు సైతం బ్రెజిల్ ప్రతిపాదనకు పూర్తి మద్దతునిచ్చాయి.

వాతావరణ మార్పుపై పారిస్ ఒడంబడికను ధ్రువపరిచిన 196 దేశాల సమావేశం (కాప్ 29) అజర్ బైజాన్‌లోని బాకు నగరంలో జరుగుతోంది. భూతాపాన్ని 1.5 శాతం సెంటీగ్రేడ్‌కు పరిమితం చేయడంతోపాటు, అందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని, ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు సమకూర్చడమే లక్ష్యంగా కాప్ 29 జరుగుతోంది. తమకు ఏటా లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నిధులు ఎవరు సమకూర్చాలి, ఎలా ఖర్చు పెట్టాలి అన్న విషయాలపై ఏకాభిప్రాయసాధనకై తీవ్ర చర్చలు జరుగుతున్నాయి.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సంస్కరణలను అమలుపరిచేందుకు జీ20 దేశాల నాయకులు వాగ్దానం చేశారు. 21వ శతాబ్ది ప్రపంచ వాస్తవాలు, అవసరాలకు అనుగుణంగా భద్రతా మండలిని మరింత ప్రాతినిధ్య, సమ్మిళిత, సమర్థ, ప్రభావశీల, ప్రజాస్వామిక, జవాబుదారీగా వ్యవహరించే సంస్థగా రూపొందించాల్సిన ఆవశ్యకతను వారు అంగీకరించారు. ప్రపంచ శాంతి, అంతర్జాతీయ భద్రతకు కాపాడే బాధ్యతలను నిర్వర్తిస్తున్న భద్రతా మండలిలో, 1945లో ఏర్పడిననాటి నుంచి ఇప్పటివరకు మౌలిక మార్పులు ఏవీ చోటుచేసుకోలేదు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసినప్పుడు అగ్ర రాజ్యాలుగా ఉన్న ఐదు దేశాలు అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్‌లు వీటో హక్కు కలిగి ఉండగా 10 దేశాలు రెండు సంవత్సరాలు చొప్పున భద్రతా మండలిలో సభ్యత్వాన్ని కలిగి ఉంటున్నాయి. ఐక్యరాజ్యసమితి ఏర్పడి ఎనిమిది దశాబ్దాలు గడిచిపోయినందున భద్రతా మండలిని విస్తరించాల్సిన అవసరమున్నదనే విషయాన్ని దాదాపుగా ప్రతి దేశమూ అంగీకరిస్తోంది. 21వ శతాబ్ది ప్రజాభిప్రాయాన్ని విన్పించేందుకు మరిన్ని దేశాలకు శాశ్వత ప్రాతినిధ్యం కల్పించాలని అనేక దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్ విషయమై నిర్దిష్టంగా ప్రతిస్పందించకపోయినప్పటికీ భద్రతా మండలిని విస్తరించాలని, ఆ విస్తరణలో ఇంతవరకు ప్రాతినిధ్యం లేని లేదా తక్కువ ప్రాతినిధ్యమున్న ఆసియా–పసిఫిక్, లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంతాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని జీ20 నాయకుల ప్రకటన పేర్కొంది. గత సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి ముందు భద్రతా మండలిలో ఆఫ్రికాదేశాలకు వీటో అధికారం లేకుండా శాశ్వత సభ్యత్వం, అభివృద్ధి చెందుతున్న ఒక దీవి దేశానికి ప్రప్రథమంగా తాత్కాలిక సభ్యత్వాన్ని భద్రతా మండలిలో కల్పించాలని అమెరికా ప్రతిపాదించింది. భద్రతా మండలిలో వీటో అధికారంతో కూడిన సభ్యత్వాన్ని బ్రెజిల్, జర్మనీ, ఇండియా, జపాన్ పరస్పర మద్దతుతో గట్టిగా కోరుతున్నాయి.



● రమేష్ చెన్నమనేని
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు





మిస్ మిసలు

మారిస్ స్టెల్లా కళాశాలలో గురువారం మిస్ బ్లాక్ పోటీలు ఉల్లాసంగా జరిగాయి. బ్లాక్ డ్రెస్సుల్లో విద్యార్థినులు ర్యాంప్‌వాక్ చేసి అందరినీ ఆకట్టుకున్నారు. మిస్ బ్లాక్ షో విజేతగా ఆషా ఎంపికైంది. ఇందులో భాగంగా ఏర్పాటుచేసిన రంగోలి పోటీలు ఆకట్టుకున్నాయి.

డ్రోన్ సిటీ

నగరానికి కొత్త డ్రోన్లు వచ్చాయ్

త్వరలో మరిన్ని రాక

- ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒకటి చొప్పున..
- ఇక అనుమానితుల కదలికలపై డ్రోన్ నిఘా
- మహిళా పోలీసులకు ప్రత్యేక శిక్షణ
- సచివాలయ పోలీసు సిబ్బందికి కూడా..

ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒక డ్రోన్ కేటాయించాలని భావించిన పోలీసు ఉన్నతాధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. అవసరమైన డ్రోన్లను సమకూరుస్తున్నారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు మొత్తం మూడు డ్రోన్లు ఉండగా, తాజాగా పది కొత్తవి వచ్చాయి. త్వరలో మరిన్ని తెప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



డ్రోన్ ఆపరేషన్‌పై మహిళా పోలీసులకు శిక్షణ



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కమిషనరేట్ పరిధిలో మొత్తం 28 పోలీసు స్టేషన్లు ఉండగా, అందులో నగరంలోనే 13 ఉన్నాయి. మిగిలిన 15 రూరల్ పరిధిలోకి వెళ్తాయి. మైలవరం సర్కిల్‌లో మూడు, తిరువూరు సర్కిల్‌లో నాలుగు, నందిగామ సర్కిల్‌లో నాలుగు ఉండగా, జగ్గయ్యపేట సర్కిల్‌లో నాలుగు పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఇలా మొత్తం అన్ని పోలీస్‌స్టేషన్లకు ఒక్కో డ్రోన్‌ను సమకూర్చే పనిలో పోలీసు ఉన్నతాధికారులు ఉన్నారు. వాటిని ఆపరేట్ చేయడానికి మహిళా పోలీసులతో పాటు సచివాలయాల్లోని మహిళా పోలీసులకు కూడా శిక్షణ ఇస్తున్నారు. మొదటి బ్యాచ్‌కు శిక్షణ పూర్తికావచ్చింది. వారిని డ్రోన్ పైలెట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ మహిళా పోలీసులు డ్రోన్లను ఎలా ఆపరేట్ చేస్తున్నారో కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీలు గౌతమీ షాలి, టి.తిరుమలేశ్వరరెడ్డి గురువారం పరిశీలించారు. పోలీసు శాఖలో మహిళా పోలీసులకు కొన్ని పరిమితులుంటాయి. వారిని కొన్ని విధుల్లో మాత్రమే ఉపయోగిస్తారు. ఇప్పుడు వారిని డ్రోన్ ఆపరేషన్‌కు కేటాయించడం ద్వారా పోలీసు స్టేషన్ నుంచే వివిధ ప్రాంతాల్లో నిఘా కొనసాగించవచ్చన్న భావనలో అధికారులున్నారు. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌ను రాష్ట్రంలోనే తొలి డ్రోన్ కమిషనరేట్‌గా

మిగతా 8లో..

ట్రైనింగ్ టార్గెట్

డ్రోన్ గాల్లోకి ఎగిరాక రిమోట్‌కు పని చెప్పకుండా కదలాలంటే ఏం చేయాలి. ఇలా అనేక కొత్త అంశాలను పోలీసులు తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం బందరు రోడ్డులోని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మహిళా పోలీసులకు, సచివాలయ మహిళా పోలీసులకు శిక్షణ ఇస్తున్నారు. వాళ్లందరికీ డ్రోన్లపై ప్రాథమిక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

దాళ్వాకు సాగునీరు రాదు

- జలాశయాల్లో తక్కువగా నీటి లభ్యత
- సాగులోని పంటలు, తాగునీటి అవసరాలకే సరిపడా నీరు
- కృష్ణా కలెక్టర్ బాలాజీ స్పష్టీకరణ

మచిలీపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో కృష్ణాడెల్టాలోని దాళ్వా పంటకు సాగునీరు విడుదల చేసేందుకు అవకాశం లేదని కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణాడెల్టా ప్రాంత రైతులు రబీ సీజన్‌లో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేయాలని కోరారు. ఈ నెల 11వ తేదీ వరకు శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి ప్రకాశం బ్యారేజీకి 290 టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. గతనెల నుంచి కృష్ణానదిలో నీటి లభ్యత తక్కువగా ఉందని పేర్కొన్నారు. జలాశయాల్లో 189 టీఎంసీల నీటి లభ్యత ఉండాల్సి ఉండగా, 114 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉందని తెలిపారు. ఈ నీటిని ప్రస్తుతం సాగులో ఉన్న వరిపంటను కాపాడేందుకు విడుదల చేయడంతో పాటు 2025, జూన్ వరకు తాగునీటి అవసరాల కోసం వినియోగించుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం 39 టీఎంసీల నీరు ఉందని, ఈ నీటిని 2025 ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు కోసం జూన్ మొదటి వారంలో విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

నృత్య రూపకం భళా



కూచిపూడి శ్రీసిద్ధేంద్ర యోగి కళావేదికపై గురువారం రాత్రి ప్రదర్శించిన శ్రీకృష్ణ పారిజాతం నృత్య రూపకం నాట్య పరిమళాలు వెదజల్లింది. 8లో



యథేచ్ఛగా మట్టి రవాణా

- రాత్రివేళల్లో గుట్టుగా ఇటుక బట్టీలకు తరలింపు
- మైలవరం మండలం పుల్లూరు గ్రామంలో టిప్పర్లను అడ్డుకున్న దళితవాడ వాసులు

6లో

పెద్ద ప్రమాదమే తప్పింది

- బెంజిసర్కిల్ సమీపంలో జారిపోయిన పైపులు
- వాహనాలు లేకపోవడంతో తప్పిన ప్రమాదం
- భారీగా స్తంభించిన ట్రాఫిక్

8లో



ఆర్టీసీలో సమ్మె సైరన్

సంఘాలు సమాయత్తం

విలీనానంతర సమస్యలపై అన్ని సంఘాలు ఆందోళన బాట

- విజయవాడ వేదికగా విస్తృతస్థాయి సమావేశాలు
- సమావేశాల తర్వాత ప్రాథమిక ఆందోళనలకు పిలుపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు సమ్మె సైరన్ మోగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వంలో విలీనానంతర అపరిష్కృత సమస్యలు, విలీనానికి ముందు లిఖితపూర్వక ఒప్పందాలను అమలు చేయకపోవటం, ప్రస్తుత సమస్యలపై ఉద్యమం చేసేందుకు సమాయత్తమవుతున్నాయి. విజయవాడ వేదికగా రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి అడుగులు వేస్తున్నాయి. ఐక్యంగా కాకపోయినా వేర్వేరుగా అన్ని సంఘాలు ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగానే ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఈ సమావేశాలనంతరం ప్రాథమిక ఆందోళనా కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. గుర్తింపు సంఘాలైన ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ)తో పాటు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఉద్యమ శంఖారావం మోగించే దిశగా కదిలాయి. తొలుత తమ డిమాండ్లను ఉన్నతాధికారుల ముందుంచాయి. ఇవన్నీ పరిష్కారానికి నోచుకోకపోవటంతో ఆందోళనల వైపు అడుగులు వేస్తున్నాయి.

డిమాండ్లు ఇవీ..

ఆర్టీసీ కార్మిక సంఘాల డిమాండ్లు రెండు కేటగిరీల్లో ఉన్నాయి. ఉద్యోగుల సమస్యలతో పాటు సంస్థను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన నిర్ణయాలను కూడా ఈ డిమాండ్లలో ఉంచారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 2017 పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, విలీనానంతరం ఇచ్చిన తొలి పీఆర్సీ బకాయిలను చెల్లించాలని, కొత్త నిరుపయోగ ఈహెచ్ఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత అపరిమిత వైద్యసేవల విధానాన్ని కొనసాగించాలని, రద్దు చేసిన ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీలను అమలు చేయాలన్నవే ప్రధాన డిమాండ్లు. ప్రస్తుతం నిలిపివేసిన నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు, ఇన్సెంటివ్‌లు, టీఏ బిల్లులు, ఇతర అలవెన్సులను, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను చెల్లించాలని కూడా కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రయాణికులు టికెట్ తీసుకోకపోతే డ్రైవర్లు, కండక్టర్లకు విధిస్తున్న జరిమానాలకు సంబంధించి 2019 సర్క్యులర్‌ను తిరిగి అమలు చేయటం కానీ, జీవో నెంబర్ 70, 71ను సవరించాలని కానీ డిమాండ్ చేస్తున్నారు. సంస్థాగతంగా ఖాళీ స్థానాల్లో సిబ్బందిని భర్తీ చేయాలని, స్క్రాప్‌కు వెళ్లే బస్సులను నిలుపుదల చేయాలని, డిమాండ్‌కు అనుగుణంగా 5 వేల కొత్త బస్సులు కొనాలని కోరుతున్నారు. ఈ డిమాండ్లకు సంబంధించి ఈయూ నేతలు పి.దామోదరరావు, జీవీ నర్సయ్య, ఎన్ఎంయూఏ నేతలు పీవీ రమణారెడ్డి, వైశ్రీనివాసరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతలు సీహెచ్ సుందరరావు, ఎన్.అయ్యప్పరెడ్డి.. ఉన్నతాధికారులకు పదేపదే మెమోరాండంలు సమర్పించారు. పరిష్కారం దొరక్కపోవటంతో ఉద్యమంవైపు అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గౌతంరెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో వైసీపీ నేత గౌతంరెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు తగినంత సమయం లేకపోవడంతో ఈనెల 26కి వాయిదా వేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది. గౌతంరెడ్డి విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశిస్తూ గత మధ్యంతర ఉత్తర్వులను అప్పటివరకు పొడిగించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఉత్తర్వులు ఇచ్చారు. ఫోర్జరీ పత్రాలతో తన భూమిని ఆక్రమించడమే కాకుండా, తనను చంపేందుకు ప్రయత్నించారంటూ గండూరి ఉమామహేశ్వరశాస్త్రి వైసీపీ నేత గౌతంరెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని గౌతంరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవలే విచారణ జరిగింది. గురువారం మరోసారి విచారణకు రాగా గౌతంరెడ్డి తరఫు న్యాయవాది వైవీ రవిప్రసాద్ స్పందిస్తూ.. కేసులో వాదనలు వినిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. విచారణను వాయిదా వేయాలని భావిస్తే మధ్యంతర ఉత్తర్వులను పొడిగించాలని అభ్యర్థించారు. అడ్వకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. పిటిషన్‌పై వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి పూర్తిస్థాయి విచారణ జరిపేందుకు సమయం లేనందున ఈనెల 26కి వాయిదా వేశారు.

ధాన్యం.. దయనీయం

కొనుగోళ్లలో ఈ క్రాప్ పంట పరిమితి తగ్గింపు

- ఒక రైతుకు 25 నుంచి 12 ఎకరాలకు కుదిస్తూ సాఫ్ట్‌వేర్‌లో మార్పు
- కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లిన ధాన్యం వెనక్కి పంపిన సిబ్బంది
- తీసుకెళ్లి ఏం చేసుకోవాలని రైతుల ఆగ్రహం
- జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసేందుకు యత్నం
- ఫోన్ ఎత్తకపోవడంపై మండిపడుతున్న అన్నదాతలు



ధాన్యం కొనుగోలులో ఈ క్రాప్ పంట పరిమితి తగ్గింపుతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. 25 ఎకరాల పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే కేవలం 12 ఎకరాలకే కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన ధాన్యం ఏం చేసుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసేందుకు ఫోన్ చేస్తే ఎత్తడంలేదని మండిపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 25 ఎకరాల పంట పరిమితిని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వ్యవసాయ శాఖ అధికారులు ధాన్యం దిగుబడిపై ఇచ్చిన అంచనా కంటే అధికంగా ఖరీఫ్‌లో ధాన్యం ఉత్పత్తి కావటంతో నిర్దేశించిన ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం పెరిగింది. దీంతో సివిల్ సప్లయిస్ ప్రొక్యూర్‌మెంట్ ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలను జిల్లా మేనేజర్లు అమలు పరుస్తున్నారు. ఈ క్రాప్‌లో నమోదైన దాని ప్రకారం 25 ఎకరాల వరకు పంట కొనుగోలు చేయాల్సి ఉంటే కేవలం 12 ఎకరాల పంటను మాత్రమే కొనుగోలు చేసేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. అయితే ఈ క్రాప్ పంటకు సంబంధించి 25 ఎకరాలు వరకు కొనుగోలు చేస్తారన్న ముందస్తు సమాచారంతో.. వరికోతలు జరిపి, నూర్చిన ధాన్యాన్ని ఆరబెట్టి, బస్తాల్లో నింపి, లారీల్లో ఎక్కించి, కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్లిన తర్వాత 12 ఎకరాల పంట వరకే కొనుగోలు చేయగలమని చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

12 ఎకరాల పంటకు మించి కొనలేం..

పామర్రు మండలం పెద్దమద్దాలి గ్రామానికి చెందిన రైతులు గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీల్లో ధాన్యాన్ని తీసుకెళ్లారు. సాఫ్ట్‌వేర్‌లో 12 ఎకరాలు మాత్రమే చూపిస్తోందని, అంతకుమించి కొనలేమని అక్కడి సిబ్బంది చెప్పడంతో రైతులు హతాశులయ్యారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు

మిగతా 8లో..



రాత్రి వేళల్లో మట్టి తరలిస్తున్న టిప్పర్లు, వాహనాలను అడ్డుకుంటున్న చిన్న దళితవాడ వాసులు

యథేచ్ఛగా మట్టి రవాణా!

- రాత్రివేళల్లో గుట్టుగా ఇటుక బట్టీలకు తరలింపు
- టిప్పర్లను అడ్డుకున్న దళితవాడ వాసులు
- ఫిర్యాదులపై స్పందించని అధికారులు.. పట్టుకున్న వాహనాలు మాయం!

మైలవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మైలవరం మండలం పుల్లూరు గ్రామ సమీపంలో తోటల్లో అక్రమంగా నిల్వ చేసిన మట్టిని భారీ టిప్పర్ల ద్వారా మైలవరం-కుంటముక్కల రోడ్డులో ఉన్న ఇటుక బట్టీలకు అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో పెద్దఎత్తున వాహనాలలో మట్టిని రవాణా చేయడంతో దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చిన్న దళితవాడ వాసులు టిప్పర్లను అడ్డుకుని రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. వాహనాలను రాజకీయ పలుకుబడితో బట్టీల నిర్వహకులు విడిపించుకుపోతున్నారని ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో అడ్డగోలు రవాణా ఏంటని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

గ్రామస్థులు పట్టించిన వాహనాలు మాయం

గ్రామస్థులు పట్టించిన టిప్పర్లను వదిలేయడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు చేయాల్సిన పనిని గ్రామస్థులు చేసినా వాహనాలను అధికారులు వదిలేయడం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ఉన్నతాధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాకు అడ్డు కట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టి రవాణాకు ఎలాంటి అనుమతుల్లేవు

- బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్

మట్టి రవాణాకు ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ నిల్వలు ఉంటే పరిశీలించి సీజ్ చేస్తాం.



రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణంపై రైతుల నుంచి అభ్యంతరాలు తెలుసుకుంటున్న అధికారులు

అండర్ బ్రిడ్జ్‌లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి

- అధికారులకు రైతుల విజ్ఞప్తి

జి.కొండూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చెర్వుమాధవరం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యుబీ) నిర్మాణం జరిగే స్థలాన్ని విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జ్ నిర్మాణం వల్ల కలిగే ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. విజయవాడ-సికింద్రాబాద్ రైలు మార్గంలో కొత్తగా మరో ట్రాక్ వస్తున్న నేపథ్యంలో చెర్వుమాధవరం రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా బ్రిడ్జ్ నిర్మాణం వల్ల కలిగే ఇబ్బందులను రైతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జ్ నిర్మాణ సమయంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. పలుచోట్ల డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షపునీరు బ్రిడ్జ్‌లోనే నిల్వ ఉండటం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదని, నిర్మాణ సమయంలోనే సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, రైల్వే అధికారులు, డీటీ విజయ్‌కుమార్, ఏవో ఎం.రాంకుమార్‌తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా

రావి ప్రమాణస్వీకారం నేడు



గుడివాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. విజయవాడ గురునానక్‌కాలనీ నాక్ కళ్యాణమండపంలో సాయంత్రం 4గంటలకు జరగనున్న ప్రమాణస్వీకార కార్యక్రమానికి మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు తదితరులు పాల్గొనున్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ అధిష్ఠానం ఎన్నారై వెనిగండ్ల రాముకు అవకాశం ఇచ్చింది. వెనిగండ్ల రాముకు రావి వెంకటేశ్వరరావు వెన్నంటి ఉండి పార్టీ విజయానికి కృషి చేశారు. భవిష్యత్తులో రావికి సముచిత స్థానం కల్పిస్తానని నాడు చంద్రబాబు హామీ యిచ్చారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్డీవో స్వాతి, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, హాజరైన అభ్యర్థులు

అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టులకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బందరు డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఆర్డీవో కె.స్వాతి, డ్వామా పీడీ సువర్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ అధికారి సురేంద్రబాబు, సీడీపీవోలు గ్లోరీ, సముద్రవేణి, సుధారాణిలు ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 67 పోస్టులు ఖాళీగా ఉండగా.. మచిలీపట్నం డివిజన్‌లో 3 మినీ అంగన్వాడీ, 17 హెల్పర్ల ఇంటర్వ్యూలకు 48 మంది హాజరయ్యారు. గుడివాడ డివిజన్‌లో 3 అంగన్వాడీ, 25 హెల్పర్, ఉయ్యూరు డివిజన్‌లో 3 మినీ అంగన్వాడీ, 2 అంగన్వాడీ కార్యకర్తలు, 15 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

నిర్లక్ష్యానికి నిదర్శనం!

- ఐదేళ్లుగా నిర్మాణానికి నోచని మత్స్యకార భవనం
- పిల్లర్ల దశలోనే పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- మత్స్యకారుల సంక్షేమం పట్టని వైసీపీ ప్రభుత్వం
- పిచ్చిమొక్కలకు ఆవాసంగా షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవనం



నాగాయలంకలో నిర్మాణ దశలో ఆగిపోయిన మత్స్యకారుల షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవనం

(నాగాయలంక, ఆంధ్రజ్యోతి)

2017లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కృష్ణా జిల్లా నాగాయలంక మత్స్యకారులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా రూ. కోటితో షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవనాన్ని మంజూరు చేసింది. ఈ భవనంలో మత్స్యకారులు తమ విలువైన వలలు భద్రపర్చుకోవడం, సభలు సమావేశాలతోపాటు తుపాను సమయాల్లో రక్షిత భవనంగా ఉపయోగపడుతుంది. చేపల సంతలకు వచ్చే మత్స్యకారులకు వసతిగా ఉండేలా అన్ని సదుపాయాలతో భవనాన్ని నాగాయలంక పడవల రేవులో దక్షిణ భాగంలో నిర్మించేందుకు రెవెన్యూ శాఖ స్థల సేకరణ చేసి మత్స్యశాఖకు అప్పగించింది. అన్ని అనుమతులతో భవనం నిర్మాణానికి సిద్ధం కాగా, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

2019 డిసెంబరు 20న అప్పటి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మత్స్యకారుల షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టరు నిర్మాణ పనులు ప్రారంభించి పిల్లర్లు వేసి వదిలేశాడు. నాటి నుంచి ఇప్పటి వరకు కాంట్రాక్టరు పనులను చేయలేదు. మరో కాంట్రాక్టర్‌కి నిర్మాణ పనులను అప్పగించడంలో అధికారులు కూడా పట్టించుకోలేదు. దాంతో నిర్మానం చుట్టూ పిచ్చి చెట్లు, ఇనుప చువ్వలు తుప్పుపట్టి భవన నాణ్యతను దెబ్బతీస్తున్నాయని మత్స్యకార నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనాన్ని పూర్తి చేయాలని మత్స్యకార నేతలు పలుమార్లు ఆందోళన చేసినా నాటి వైసీపీ పాలకుల్లో స్పందన లేదు. మండలంలోని మత్స్యకారులందరికీ బహుళ విధాలుగా ఉపయోగపడే ఈ భవనాన్ని కూటమి ప్రభుత్వంలోనైనా పూర్తి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

వైసీపీ కక్షపూరిత చర్య వల్లే..

- లకనం నాగాంజనేయులు, మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు



తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరు కావటం వల్లనే గత వైసీపీ ప్రభుత్వం ఈ షోర్ బేస్డ్ ఫెసిలిటీ భవన నిర్మాణాన్నినిలిపివేసింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

ప్రభుత్వం స్పందించాలి

నాగిడి తాతారావు, జిల్లా నాయకుడు



భవన నిర్మాణం ఆగిపోవటం వల్ల మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. తుపాన్లు, వరదల సమయంలో వలలు, వృత్తి పరికరాలు భద్రపర్చుకోవటానికి అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

నిధులు మురిగిపోయాయి

-మత్స్యశాఖ ఏడీ ఆర్.ప్రతిభ, అవనిగడ్డ

మత్స్యకారుల భవనాన్ని సకాలంలో కాంట్రాక్టర్ నిర్మించక పోవటంతో ఆ నిధులు మురిగిపోయాయి. మూడు నెలల క్రితం సదరు భవనానికి నిధులు కేటాయించాలని జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే భవనాన్ని పూర్తి చేస్తాం.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధారాణి

మత్స్య సంపద కాపాడుకుందాం

ఘంటసాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రపం చ మత్స్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సమన్వయ కర్త డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మత్స్యకారులకు గుర్తింపును అందించటం కోసం, మత్స్య పరిశ్రమకి ఉజ్వల భవిష్యత్తు ఉండాలనే ఆకాంక్షతో ప్రపంచ మత్స్య దినోత్సవం ప్రతి ఏటా నవంబరు 21న జరుపుకుంటారన్నారు. ప్రపంచంలోని మత్స్య సంపదను కాపాడుకునే చర్యలను మత్స్యశాస్త్రవేత్త జె.యశ్వంత్ కుమార్ వివరించారు. మత్స్య వనరు లు లక్షలాది మందికి ఉపాధిని అందిస్తుందన్నారు. మత్స్యకార సొసైటీ చెరువులలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రేవతి, డాక్టర్ మంజువాణి, కృష్ణవేణి, డాక్టర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు : ఏపీటీఎఫ్

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు, విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై జిల్లా, రాష్ట్ర స్థాయి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్.చిరంజీవి తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్‌కు గురువారం సచివాలయంలో నోటీసు అందజేశారు. 11వ పీఆర్సీ, ఐదు డీఏలు, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఐఆర్ 30శాతం ప్రకటించాలని కోరారు. పాఠశాలల్లో టీచర్లపై పెరిగిపోతున్న బోధనేతర పనులు, యాప్‌ల భారం తగ్గించాలన్నారు. ఈ సమస్యలపై డిసెంబరు 20, 21 తేదీల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేస్తామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే జనవరిలో రాష్ట్రస్థాయి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నోటీసులో పేర్కొన్నారు.



గరిశపూడి వద్ద రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

గ్రామీణాభివృద్ధికి కృషి

- ఎంపీ వల్లభనేని బాలశౌరి

కృత్తివెన్ను, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గరిశపూడి వద్ద నుంచి బలరామమూర్తి దిబ్బ వరకు రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు గురవారం శంకుస్థాపన చేశారు. అలాగే చినగొల్లపాలెం గ్రామంలో కెనరా బ్యాంకు సాయం రూ.40 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని హామి ఇచ్చారు. జనసేన నేత బండి రామకృష్ణ, పంచకర్ల సురేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దాళ్వాకు నీరిచ్చి ఆదుకోండి

జిల్లా శివారు ప్రాంతంలో ఖరీఫ్ తీరని నష్టాన్ని కలిగించినందున రెండో పంటకు నీరిచ్చి పుణ్యం కట్టుకోవాలంటూ రైతులు కృత్తివెన్ను సెంటర్‌లో ఎంపీ, ఎమ్మెల్యే కార్లను వారి తమ గోడును వెళ్లగక్కారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరు రెండో పంటకు నీరివ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లి, చర్చిస్తానని ఎంపీ తెలిపారు.

మచిలీపట్నంలో స్టేడియం నిర్మించి తీరుతాం

- ఎంపీ వల్లభనేని బాలశౌరి
- రాష్ట్రస్థాయి బాక్సింగ్ ఓవరాల్ చాంప్ విశాఖ

మచిలీపట్నం టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో స్టేడియం నిర్మించి తీరుతామని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. గత మూడు రోజులుగా జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి 38వ బాక్సింగ్ పోటీలు గురువారం రాత్రి ముగిసాయి. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ సభలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వ



సభలో మాట్లాడుతున్న బందరు ఎంపీ బాలశౌరి



హయాంలో నాటి పాలకులు మచిలీపట్నంలో స్టేడియం నిర్మాణానికి అడుగడుగునా అడ్డు తగిలారన్నారు. కేంద్ర నిధులతో రెండేళ్లలో మచిలీపట్నంలో స్టేడియం నిర్మించి తీరుతామన్నారు. విద్యార్థుల చదువు, క్రీడలకు తగిన ప్రాధాన్యతను కూటమి ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ, క్రీడల వల్ల మానసిక, శారీరక వికాసం కలుగుతుందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ మాట్లాడుతూ, క్రీడాకారులకు తన వంతు సాయం అందిస్తామన్నారు. ఎన్నారై సతీష్ మాట్లాడుతూ, చైనా కన్నా భారతదేశ జనాభా పెరిగిందని, అయితే చైనాతో పాటు అంతర్జాతీయ క్రీడల్లో భారతదేశం పోటీ పడలేకపోతున్నదన్నారు. ఒలింపిక్ క్రీడల్లో భారతీయులు పోటీ పడేందుకు బాల్యం నుంచి శిక్షణ అవసరమన్నారు. డీఈవో రామారావు మాట్లాడుతూ, మూడు రోజులుగా రాష్ట్రంలోని 500 మంది క్రీడాకారులకు భోజన వసతి సదుపాయాలు కల్పించడంలో జాగ్రత్త వహించిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు టి.అజయ్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, జాతీయ క్రీడాకారిణి రమ్య తదితరులు పాల్గొన్నారు.

విశాఖ క్రీడాకారులదే విజయం...



ఎంపీ నుంచి షీల్డ్ అందుకుంటున్న విశాఖ జట్టు

విశాఖ క్రీడాకారులు మూడు కేటగిరిల్లో జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచి తమ ప్రతిభను చాటుకున్నారు. అండర్ 14 బాలుర కేటగిరిల్లో విశాఖ జట్టు విన్నర్స్‌గా, విజయనగరం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అండర్ 17 బాలుర పోటీల్లో విశాఖ జట్టు విన్నర్స్‌గా, శ్రీకాకుళం జట్టు రన్నర్స్‌గా నిలిచారు. అండర్ 17 బాలికల పోటీల్లో విశాఖ జట్టు ప్రథమ స్థానంలో, నెల్లూరు జట్టు రన్నర్స్‌గా నిలిచింది.

అసెంబ్లీ వేదికగా

ఇరిగేషన్ సమస్యలు పరిష్కరించాలి

* యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖకు సంబంధించి ప్రధాన సమస్యలకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అసెంబ్లీ వేదికగా కోరారు. 1276 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బ్రహ్మయ్యలింగయ్య చెరువు రిజర్వాయర్‌గా చేసేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించినా ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ సొమ్ముతో పాటు మట్టినీ దోచేశారని విమర్శించారు. బ్రహ్మయ్యలింగయ్య చెరువును రిజర్వాయర్‌గా మార్చి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు. పోలవరం, ఏలూరు కాలువను అనుసంధానం చేయాలని, రామవరప్పాడు, ఎనికేపాడు, జక్కులనెక్కలం ప్రాంతాల్లో ఏలూరు కాలువపై వంతెనలను నిర్మించాలని కోరారు. గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలకు ప్రహరీ, రెయినింగ్ పాడైపోయాయని వాటి మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు.

పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ సమస్యపై..

* బొండా ఉమామహేశ్వరరావు



అజిత్‌సింగ్‌నగర్ : సెంట్రల్ నియోజకవర్గంలో నాలుగు దశాబ్దాలుగా వేలాది ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం లేదని, పేదల ఇళ్లకు రిజిస్ట్రేషన్ కల్పించేలా అధికారులను ఆదేశించాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. మధురానగర్ తుంగం రామల వీధి, పాయకాపురంలోని దేవినేని గాంధీపురం, ఎల్‌బీఎస్‌నగర్, పటేల్‌నగర్, పాకిస్థాన్ కాలనీ, అజిత్‌సింగ్‌నగర్‌లోని నందమూరినగర్ ప్రాంతాల్లో సుమారు నాలుగువేల ఇళ్లకు రిజిస్ట్రేషన్ సౌకర్యం లేదన్నారు. రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేందుకు 2019లో టీడీపీ ప్రభుత్వం జీవో 74ను తీసుకువచ్చిందని, అనంతరం ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ మరుగున పడిందన్నారు. ఇప్పటికైనా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

శిథిల వంతెనలకు నిధులు కేటాయించండి

* వర్లకుమార్ రాజా



పామర్రు : జగన్ ఐదేళ్ల అరాచక పాలనతో విసిగి పోయిన ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గద్దెనెక్కించి.. రాష్ట్రాన్ని తిరిగి గాడిన పెట్టే బాధ్యతలు అప్పగించారని.. ఆ బాధ్యత నెరవేర్చాలిన అవసరం తమపై ఉందని పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అనేక చోట్ల శిథిలావస్థకు చేరిన వంతెనల వల్ల అటు ప్రజలు, ఇటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. ప్రమాదకరంగా ఉన్న వంతెనల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్‌శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. పట్టణంలో దశాబ్ద కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న డంపింగ్ యార్డుకు స్థలం మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

విద్యా సుమాలు విరబూయిస్తా

- పదిలో నూరుశాతం ఫలితాలకు కృషి
- వంద రోజుల ప్రణాళికకు రూపకల్పన
- డీఈవో పీవీజే రామారావు



కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పీవీజే రామారావు వరుసగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మీవో కార్యాలయాలు, పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా రామారావును 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది.

? కృష్ణాలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారు

● జిల్లాలో వివిధ డివిజన్లలోని ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. అధిక శాతం ఉపాధ్యాయుల్లో నైపుణ్యం, పట్టుదల కలిగిన వారున్నారు. ఈ ఏడాది విద్యా ప్రమాణాలు పెంచేలా ప్రధానోపాధ్యాయులకు సూచనలిచ్చాం.

? పదో తరగతి విద్యార్థులకు తీసుకునే ప్రత్యేక కార్యక్రమాలు ఏమిటి?

● పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్టులు నిర్వహిస్తున్నాం. వంద రోజుల ప్రణాళిక రూపొందించాం. ఉదయం గంట, సాయంత్రం గంట అదనంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం.

? వెనుకబడిన విద్యార్థుల కోసం ఏ కార్యక్రమాలు చేపడుతున్నారు?

● వెనుకబడిన విద్యార్థులను ఆయా సబ్జెక్టు టీచర్లు దత్తత తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. విద్యార్థులకు స్టడీ మెటీరీయల్ అందిస్తున్నాం. విద్యావేత్తలతో ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తాం. గతేడాది 90.5 శాతం ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాది నూరుశాతం ఫలితాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నాం. టాప్ 5లో జిల్లాను తప్పనిసరిగా ఉంచుతాం.

? విద్యార్థుల గుణాత్మకతను ఎలా బేరీజు వేస్తారు?

● జిల్లాలో ఎంపిక చేసిన 124 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు గణితంలో పరీక్షలు నిర్వహించి వారి స్థాయిని తెలుసుకుంటాం.

? పోటీ పరీక్షలకు ఏ విధమైన తర్ఫీదు ఇస్తున్నారు?

● విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించాం.

? మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారు?

● మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు జరిపేందుకు ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు ఇచ్చాం. ముందుగా భోజనాన్ని రుచి చూడాలని చెప్పాం. భోజనంలో నాణ్యత పాటించాల్సిందే.. అలసత్వం చూపే ఉపాధ్యాయులకు ఎంఈవోలు, డీవైఈవోలు మార్గదర్శకత్వం వహిస్తారు.

(మచిలీపట్నం టౌన్, ఆంధ్రజ్యోతి)



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 580

లయోలాలో ప్రపంచ టెలివిజన్ దినోత్సవం

భారతీనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టెలివిజన్ రంగంలో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని లయోలా కళాశాల డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి తెలిపారు. ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో శుక్రవారం ప్రపంచ టెలివిజన్ దినోత్సవ సందర్భంగా టెలివిజన్ ప్రాముఖ్యతపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జోజిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో జరిగే ఎన్నో విషయాలను మన కళ్ల ముందు చూపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.మహేష్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సిస్టర్ క్యాండీ డి కూనా, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాణిగారితోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటినెన్స్ కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, కృష్ణలంక విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు.

రాణిగారితోట, బాపనయ్య నగర్, చలసానినగర్, పాత, కొత్త శాంపిల్ బిల్డింగ్ ఏరియా, సంగీత అపార్ట్‌మెంట్, పేర్ని బద్రీనాథ్ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.









నాగార్జున నగర్ కాలనీ మెయిన్ రోడ్లో, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ మెయిన్ రోడ్లో

పూడికతో నిండిన డ్రెయినేజీలు

దుర్వాసనతో శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, నాగార్జున నగర్‌వాసుల పాట్లు

(భారతీనగర్, ఆంధ్రజ్యోతి)

పూడికతో నిండిన ప్రధాన డ్రెయినేజీలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ మెయిన్‌రోడ్డు, నాగార్జున నగర్‌లోని మెయిన్‌రోడ్డు, కరెన్సీనగర్ మెయిన్ రోడ్లో ఉన్న ప్రధాన డ్రెయినేజీలు పూడికతో నిండిపోయాయి. వీటిని తొలగించడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహించడంతో మురుగు నీరు పారుదల లేదు. రోజుల తరబడి మురుగునీరు పారుదల లేక నిల్వ వుండి దుర్వాసన వస్తోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలకు ఆవాస కేంద్రాలుగా మారయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టీసీఎస్‌లో పీబీ సిద్ధార్థ విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు తదితరులు

మొగల్రాజపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ టీసీఎస్‌లో 52 మంది విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందారని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా దేశవ్యాప్తంగా నిర్వహించిన టీసీఎస్ నేషనల్ క్వాలిఫైయర్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన ఎన్టీయార్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, జిల్లాల విద్యార్థులకు తమ ప్రాంగణంలో ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. ఇంటర్వ్యూల ఫలితాలు గురువారం విడుదల చేయగా అత్యధికంగా తమ విద్యార్థులు 52 మంది ఉపాధి అవకాశాలు పొందారని తెలిపారు. డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు సమస్యా పరిష్కారం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 52 మంది విద్యార్థులకు సిద్ధార్థ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ సూరెడ్డి వెంకటేశ్వరరావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్ జంపాల, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

టీడీపీలో సభ్యత్వ నమోదు చేసుకోండి



టీడీపీ సభ్యత్వ నమోదు తీసుకుంటున్న కార్యకర్త

కృష్ణలంక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీలో సభ్యత్వ నమోదు తీసుకోవడం ద్వారా పెద్దమొత్తంలో ప్రమాద బీమా పరిహారాలు పొందవచ్చని కృష్ణలంక 20వ డివిజన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి చింతా వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం కృష్ణలంక సర్వీసురోడ్డులో ఎం హోటల్ సెంటర్ వద్ద టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటి వరకు సభ్యత్వం లేని వారు కొత్తగా సభ్యత్వం తీసుకోవడం, పాతవారు సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడపా శివ, పులమోలు లక్ష్మి, చింతపల్లి వంశీ పాల్గొన్నారు.

అర్థశాస్త్రంతో ఉపాధి మెండు

● ఏఎన్‌యూ ప్రొఫెసర్ సీఎస్ఎన్ రాజు



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ సీఎస్ఎన్ రాజు

లబ్బీపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అర్థశాస్త్రం చదవడం వలన అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆచార్య నాగార్జున యునివర్సిటీ ప్రొఫెసర్ సీఎస్ఎన్ రాజు తెలిపారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో గురువారం కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రవాహ్-2కే 24 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జాతీయంగా, అంతర్జాతీయంగా ఫైనాన్షియల్, బ్యాంకింగ్ సెక్టార్లలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, ప్రత్యేకంగా మహిళలు అర్థశాస్త్ర విభాగంలో అనేక రకాలైన ఉన్నత పదవులను అధిరోహించిన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అర్థశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అకాడమి ఎండీ ప్రొఫెసర్ ఎం.విజయ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

లబ్బీపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సాయిమేథ కోచింగ్ సెంటర్‌లో ఈసెట్, గేట్, డీఆర్‌డీవో, బీఎస్ఎన్ఎల్ జేఈఈ, ఏపీపీఎస్సీ, యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, రైల్వే డిఫెన్స్ వంటి కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎలక్ట్రికల్ సబ్ ఇంజనీర్, ప్రొఫెసర్ డాక్టర్ ఐ.ఎల్.జే. భక్తసింగ్ అర్థమెటిక్, రీజనింగ్, మెంటల్ ఎబిలిటి, జనరల్ ఇంగ్లీషు, జనరల్ స్టడీస్, జనరల్ సైన్స్, కరెంట్ అఫైర్స్ తదితర అంశాలను వివరించారు. సాయి మేథ విజయవాడ సెంటర్ డైరెక్టర్ మజ్జిగ బాలకృష్ణ పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన అవసరం

- డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

పటమట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మధుమేహ రోగులకు ఆ వ్యాధిపై అవగాహన అవసరం అని ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ కె. వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్‌హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన మధుమేహం అనే అంశంపై ప్రసంగించారు.

ఆయన మాట్లాడుతూ మధుమేహ వ్యాధి రెండు రకాలన్నారు. స్థూలకాయం ఉన్న వాళ్లలో, శారీరకశ్రమ లేని వాళ్లలో, స్ట్రెస్‌కు గురయ్యే వాళ్లలో మధుమేహ వ్యాధి ఎక్కువగా కనబడుతుందన్నారు. మధుమేహం ఉన్న వాళ్లు ఆహారం, అలవాట్లు, వ్యాయామం విషయంలో తప్పకుండా శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి జాగ్రతలను వివరించారు. డాక్టర్ మారు పాల్గొన్నారు.

కరెంటు బావి స్థలాన్ని రీ సర్వే చేయిస్తాం

ఎమ్మెల్యే గద్దె



కరెంటు బావి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

మొగల్రాజపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం ఏడో డివిజన్‌లో కరెంటు బావి స్థలాన్ని మరొక సారి సర్వే చేయించి అక్కడ ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు.

గురువారం ఆయన 7వ డివిజన్‌లో పర్యటిస్తూ కరెంటు బావి స్థలంలో వీఎంసీ నిర్మిస్తున్న ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలించారు. స్థానిక నాయకులు స్థలం తగ్గిందని, ప్రహరీ లోపలికి కడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన వీఎంసీ అధికారులతో మాట్లాడారు. మరొకసారి అధికారులు స్థలాన్ని రీ సర్వే చేయించి పూర్తి స్థలం గుర్తించే వరకు ప్రహరీ నిర్మాణం నిలిపివేయాలని సూచించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఖాళీ స్థలంలో ఆక్రమణలు జరగకుండా ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు ఇక్కడ స్థానికుల కోరిక మేరకు కమ్యూనిటీ హాలు నిర్మించాలనే ఆలోచన ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి గురుప్రసాద్, నాగుమోతు రాజా, పడాల గంగాధర్, అన్నే వసంత రాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులపై ఫైనాన్స్ కంపెనీల వేధింపులు ఆపాలి

● సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ డిమాండ్

గవర్నర్‌పేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వెంటనే ఆటో కార్మికులపై ఫైనాన్స్ కంపెనీల వేధింపులు ఆపేలా చర్యలు తీసుకోవాలని సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. స్థానిక శ్రీశ్రీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూనియన్ నగర గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను నెలబెట్టుకోవాలని కోరారు. వరదల్లో నష్టపోయిన ఆటో కార్మికులకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించాలని కోరారు. ట్రాన్స్‌పోర్టు రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ విధానాలు మారాలని కోరారు. వరదల్లో సర్వస్వం కోల్పోయిన కార్మికులు కిస్తీలు కట్టలేక, ఆటో ఫైనాన్సర్ల వేధింపులు భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయని, ప్రభుత్వం కల్పించుకుని మూడు నెలల పాటు మారిటోరియం ప్రకటించాలని కోరారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. దుర్గారావు, నగర నాయకులు రూబేన్, హనుమంతరావు, రాఘవ, కాశేశ్వరరావు, రామకృష్ణ, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మెట్ట దామోదర్‌ను సత్కరిస్తున్న కళాకారులు

జాతీయ అవార్డు గ్రహీత దామోదర్‌కు ఘన సత్కారం

ధర్నాచౌక్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గరుడ జాతీయ ఉత్తమ నటుడు అవార్డు గ్రహీత, సీనియర్ రంగస్థల నటుడు మెట్ట దామోదర్‌ను కళాకారులు ఘనంగా సత్కరించారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఈ కార్యక్రమం గురువారం సాయంత్రం జరిగింది. శ్రీసాయి హృదయ కళానాట్య మండలి, గుమ్మడి జయరాజ్ కళాపీఠం, శ్రీ మంగమ్మతల్లి కళానాట్య మండలి ఆధ్వర్యంలో ఇటీవల తిరుపతిలో ఈ అవార్డును ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా చింతామణి నాటకంలోని భవానీ సన్నివేశం, సత్య హరిశ్చంద్ర నాటకంలోని వారణాసి సన్నివేశాలను ప్రదర్శించిన తుంగ శ్రీనివాసనాయుడు, లక్ష్మీశ్రీ వి చరణ్‌బాబు, అడివినెక్కలం శంకర్‌లు ఆహూతులను అలరించారు. ఆగురు త్రినాథ నాయుడు, గుమ్మడి జీవన్‌కుమార్, మోడీ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నంది అవార్డు గ్రహీత డాక్టర్ పీవీఎస్ కృష్ణ, అంతర్జాతీయ జానపద కళాకారులు దామోదర గణపతిరావు, గుమ్మడి విజయ్‌కుమార్, నిమ్మగడ్డ ఏసుపాదం, జగ్గంపూడి సదాశివరావు, గొడ్డళ్ల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థిని వర్ధినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పి.అశోక్

వైద్య విద్యార్థినికి అభినందనలు

ప్రభుత్వాసుపత్రి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చర్మ వ్యాధులకు సంబంధించిన వివిధ రుగ్మతలు, గోళ్ల వ్యాధులు అనే అంశంపై సమర్పించిన పరిశోధనకు మొదటి స్థానం పొందిన సిద్ధార్థ వైద్య కళాశాల పీజీ వైద్య విద్యార్థిని వర్ధిని రితికను సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ పి.అశోక్‌లు ప్రత్యేకంగా అభినందించారు. చెన్నైలో ఈనెల 15 నుంచి 17 వరకు నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల చర్మవ్యాధుల వైద్య నిపుణుల సమీక్షా సమావేశంలో విజయవాడ సర్వజనాసుపత్రి, సిద్ధార్థ వైద్య కళాశాల చర్మవ్యాధుల వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డి.వాణి ఆధ్వర్యంలో వర్ధిని రితిక పరిశోధన పత్రం సమర్పించారు.

కంప్యూటర్లు బహూకరణ

మొగల్రాజపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం బోయపాటి శివరామకృష్ణయ్య పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు గురువారం కంప్యూటర్లు బహూకరించారు. ఈ సందర్భంగా ఐడీబీఐ జోనల్ హెడ్ వాసుదేవన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లల్ని చదివిస్తున్నారని, మంచి భవిష్యత్ కోసం బాగా చదివి వృద్ధిలోకి రావాలని సూచించారు. అనంతరం వాసుదేవన్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణేష్‌కు కంప్యూటర్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఐడీబీఐ రీజనల్ హెడ్ సాయికృష్ణ, బ్రాంచ్ మేనేజర్ అప్పలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓహ్..పెద్ద ప్రమాదమే తప్పింది..!

● విజయవాడలో రోడ్డుపై జారిపోయిన అల్యూమినియం పైపులు



విజయవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్క్రూబ్రిడ్జి, బెంజ్‌సర్కిల్ మధ్య జాతీయ రహదారిపై త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. గూడ్స్‌వ్యాన్ డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో దానిపైనున్న అల్యూమినియం పైపులు ఒక్కసారిగా ముందుకు దూసుకొచ్చి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ వాహనాలు లేకపోవడంతో పెద్దగండం తప్పింది. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. గుడివాడకు చెందిన ఒక వ్యక్తి ఇంటీరియర్ డెకరేషన్‌లో సీలింగ్‌కు బిగించే అల్యూమినియం పైపులను గుంటూరు నుంచి తీసుకెళ్తున్నారు. గూడ్స్‌వ్యాన్‌పై ఈ పైపులను పెట్టి కట్టారు. వ్యాన్ స్క్రూబ్రిడ్జి దాటిన తర్వాత బెంజ్‌సర్కిల్ కూడలిలోకి వస్తోంది. ఈ వ్యాన్‌కు ముందు ప్రయాణిస్తున్న రెండు కారులు ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. డ్రైవర్లిద్దరూ కార్లను నడిరోడ్డుపై ఆపేశారు. వాటి వెనుక గూడ్స్‌వ్యాన్ వస్తోంది. ముందు రెండు కార్లు హఠాత్తుగా ఆపడంతో వ్యాన్ డ్రైవర్ అకస్మాత్తుగా రెండుసార్లు బ్రేకులు వేశాడు. వ్యాన్ వస్తున్న ప్రదేశంలో రోడ్డు పల్లానికి ఉంది. దీనితో వ్యాన్‌పై ఉన్న పైపులు ఒక్కసారిగా ముందుకు దూసుకు వచ్చి రోడ్డుపై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా ట్రాఫిక్ మొత్తం ఆగిపోయింది. ముందుభాగంలో వాహనాలు, మనుషులు లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బెంజ్‌సర్కిల్ వైపు వాహనాలను ఫ్లై ఓవర్ మీదకు మళ్లించారు. పైపులను రోడ్డు మధ్య నుంచి ఒకపక్కకు చేర్చి ఆగిపోయిన వాహనాలను దారి ఇచ్చారు.



అదరహో..!

అలరించిన శ్రీ కృష్ణపారిజాతం కూచిపూడి నృత్య రూపకం

కూచిపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రవాస భారతీయురాలు, పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన్నసత్యం శిష్యురాలు డాక్టర్ శుభ మరువాడ నృత్య దర్శకత్వంలో కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి కళావేదికపై గురువారం సాయంత్రం ప్రదర్శించిన శ్రీ కృష్ణపారిజాతం కూచిపూడి నృత్య రూపకం నాట్య పరిమళాలు వెదజల్లి రసజ్ఞులైన ప్రేక్షకులను రంజింపజేసింది. శ్రీకృష్ణుడిగా ప్రణుష రెడ్డి, సత్యభామగా అంబికా సిద్దాబత్తుల, రుక్మిణిగా ప్రణవి, నారదుడిగా సంధ్య చూపిన హావభావాలు మంత్రముగ్ధుల్ని చేశాయి. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్ నాట్య శిల్పారామం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన సాగింది. ప్రముఖ నాట్యాచార్యుడు డాక్టర్ చింతా రవి బాలకృష్ణతోపాటు పలువురు యువ కళాకారులు పాల్గొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెదపూడి శాఖ మేనేజర్ సిహెచ్.పరమేష్ జ్యోతి వెలిగించి సభ ప్రారంభించారు. అతిథులకు, కళాకారులకు నిర్వాహకులు మెమొంటోలు అందించి సత్కరించారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం: మంత్రి అచ్చెన్న

విజయవాడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆక్వాసాగులో దేశానికి రాష్ట్రం ఒక హబ్‌గా నిలుస్తోందని మత్స్య శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. రాష్ట్రంలో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక హార్బర్, ఒక జెట్టీ, ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఉండేలా చర్యలు తీసుకుంటే మత్స్యకారులకు మేలు కలుగుతుందన్నారు. మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి అవకాశాల కోసం సుస్థిరమైన మత్స్య రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన ప్రపంచ మత్స్య దినోత్సవంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి, భద్రత కోసం మత్స్యరంగంలో ఎదురవుతున్న క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలను కనుగొనడానికి ప్రతి ఏటా ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని జరుపుతున్నామన్నారు. రాష్ట్రంలో 1,020 కిలోమీటర్ల తీర ప్రాంతం, 2.26 లక్షల హెక్టార్ల ఆక్వా సాగు ఉందన్నారు. దేశంలో 75 శాతం కంటే ఎక్కువ రొయ్యలు మన రాష్ట్రం నుంచే ఎగుమతి అవుతున్నాయన్నారు.

మత్స్యకార వృత్తిని భవిష్యత్తు తరాలకు అందించాలి: కొల్లు

మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మత్స్యకార వృత్తిని భవిష్యత్తు తరాలకు అందించాలన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వాలు అనేక సబ్సిడీలు అందజేస్తున్నాయని, అయితే ఆయా నిధులు, పథకాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్లో రూ.750 కోట్లను కేటాయించడం మత్స్యకారుల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. మెరైన్ ఫిషింగ్, ఇన్‌ల్యాండ్ ఫిషింగ్ కోసం టీడీపీ పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. దేశంలో తొలిసారిగా మత్స్యకారులకు 50ఏళ్లకే పింఛను సదుపాయాన్ని తీసుకొచ్చామన్నారు. మత్స్యకార వృత్తిని అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు నిత్యం పరితపిస్తుంటారని పేర్కొన్నారు. వలలు, పడవలు, ఐస్ బాక్సులు సహా అనేక పరికరాలను సబ్సిడీతో అందించారన్నారు. జీవో 217తో మత్స్యకార వృత్తిని నాశనం చేసేందుకు జగన్ ప్రయత్నించాడని దుయ్యబట్టారు. కూటమి అధికారంలోకి రాగానే ఆ జీవోను రద్దు చేశామని తెలిపారు.

సీడ్, ఫీడ్, పంటపై జే ట్యాక్స్ వసూలు

మత్స్యకారుల జీవనాన్ని దెబ్బ తీసేలా జగన్ వ్యవహరించారని, కేసులు పెట్టి మత్స్యకారులను ఇబ్బంది పెట్టాలని ప్రయత్నించారన్నారు. ఫిష్ ఆంధ్ర పేరుతో మోసం చేశారని విమర్శించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, సబ్సిడీలు, ఎన్ఎఫ్‌డీబీ, మత్స్యశాఖలను జగన్ నాశనం చేశాడన్నారు. సీడ్, ఫీడ్, పంటపై జే ట్యాక్స్ వసూలు చేసి మత్స్యకారులను ముంచేశారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉన్నా అన్ని పథకాలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని మంత్రి కొల్లు పేర్కొన్నారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేలా ప్రత్యేక కార్యక్రమాలకు త్వరలోనే శ్రీకారం చుడతామని ప్రకటించారు. ప్రతి మత్స్యకారుడిని ఆర్థికంగా బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటామని రవీంద్ర హామీ ఇచ్చారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, అగ్నికుల క్షత్రియ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్ పాల్గొన్నారు.

టూరిజానికి నిధుల కేటాయింపు హర్షణీయం: ఆర్వీ స్వామి

ఆటోనగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో టూరిజం రంగానికి తగిన ప్రాముఖ్యతనిస్తూ సరిపడ నిధులను కేటాయించడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్వీ స్వామి అన్నారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును ముఖ్యమంత్రి కార్యాలయంలో కలిసి పుష్ప గుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్వీ స్వామి

గ్రంథాలయం సజీవ నది: డాక్టర్ ప్రభాకర్

విజయవాడ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయం సజీవ నది అని, అది అందరి మనోదాహర్తిని తీరుస్తుందని, పుస్తకపఠనం వల్ల వికాసం కలుగుతుందని, బహుగ్రంథకర్త, ప్రభుత్వ అధికారి (ఓఎస్‌డీ) డాక్టర్ ఎం.ప్రభాకర్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నేతృత్వంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో తన తాతగారు, వయొలిన్ విద్వాంసుడు పెద్ద జమాలప్పగారి వద్ద పుట్టపర్తి నారాయణాచార్యులు సంగీతం నేర్చుకొన్నారన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాపోషకులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ నో మోర్ టియర్స్ కవితా సంపుటి ద్వారా ఎం.ప్రభాకర్ పరిచయం అయ్యారని, రాజన్న కవి (వసుచరిత్ర కర్త భట్టుమూర్తి పాత్రధారి) మేనల్లుడిగా ఎం.ప్రభాకర్ సుప్రసిద్ధులన్నారు. ప్రభాకర్ తాత పెద్ద జమాలప్ప 4 తీగల ఫిడేలును 7 తీగలుగా మార్చి ధ్వనిని పెంచి అనేక కచేరీలు చేసి కడప జిల్లా ప్రొద్దుటూరుతో పాటు దక్షిణ భారతదేశమంతటా వాయులీనాన్ని విస్తరింపజేశారన్నారు. సహాయ కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ ఇటీవల విద్యార్థుల్లో కొందరు రచనల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య సభకు స్వాగతం పలికారు.



ప్రసంగిస్తున్న సాహితీవేత్త ప్రభాకర్

వాగ్దానాలను అమలు చేయాలి

● రైతు నేతల డిమాండ్

కృష్ణలంక, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాల మేరకు తక్షణమే సాగు సాయం అందించాలని తదితర డిమాండ్ల సాధనకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోయిన రైతులు కౌలురైతులు తీసుకొన్న ఖరీఫ్ పంట రుణాలను మాఫీ చేయాలని, తక్షణమే కౌలురైతుల రక్షణ, సంక్షేమానికి సమగ్రమైన కౌలు చట్టం తీసుకురావాలని అందులో కోరారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ 2024 ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతు కుటుంబానికి రూ.20వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించిన కూటమి నేతలు గద్దెనెక్కిన 6 నెలల తర్వాత కూడా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వాల పాలనలో ప్రతి రైతు కుటుంబం రూ.2.45 లక్షల అప్పుల్లో కూరుకుపోయిందని ప్రతిరోజు ఏదో ఒక మూల రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారని, ఇందులో 90 శాతం కౌలు రైతులేనన్నారు. ఆత్మహత్యల నుంచి రైతులను రక్షించాలంటే కేరళ తరహాలో 'రుణ ఉపశమన చట్టం' తీసుకురావాలని డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘం నేతలు చెరుకూరి సుబ్బారావు, పరుచూరి అజయ్, పత్రి హరికృష్ణ, ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు మల్నీడు యలమందరావు, ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుడ్డి రమేష్ పాల్గొన్నారు.

డ్రోన్ సిటీ

(5వ పేజీ తరువాయి)

మార్చాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే మహిళా పోలీసులకు డ్రోన్ల సాంకేతిక అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. అనుమానిత వ్యక్తులను గానీ, వాహనాలను గానీ ట్రాక్ చేయాలనుకున్నప్పుడు ఈ టార్గెట్‌ను ఫిక్స్ చేస్తారు. ఈ టార్గెట్‌ను ఎలా ఫిక్స్ చేయాలి, ఎలా ట్రాక్ చేయాలి.. అనే విషయాలపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇస్తున్నారు. ఉదాహరణకు నగరంలోని పోలీసు కంట్రోల్‌రూమ్ కూడలి నుంచి ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కదులుతున్నప్పుడు అతడి వెనుక వైపున డ్రోన్ ఎగురవేస్తారు. రిమోట్‌లో అతడు వెళ్తున్న వాహనం మార్గాన్ని డ్రాగ్ చేస్తారు. దీంతో డ్రోన్ ఆ వాహనం వెనుక కదులుతుంది. ఇలా కిలోమీటరు వరకు వెళ్తుంది. డ్రోన్ ఆపరేట్ చేస్తున్న ఆపరేటర్ ఆ వాహనం వెనుక వెళ్తూ ఉంటే అది వేగంగా కదులుతుంది. దీంతోపాటు డ్రోన్ ఏయే కోణాల్లో ఎగరాలి, ఏయే మార్గాల్లో వెళ్లాలి.. అనే అంశానికి పాయింట్ ఆఫ్ వేస్ అనే ఆప్షన్ ఉంది. దీన్ని రిమోట్‌లో స్క్రీన్ ఎంపిక చేసుకుని డ్రోన్ ఏయే మూలలకు వెళ్లాలో పాయింట్లను ఫిక్స్ చేసుకోవచ్చు. తర్వాత డ్రోన్ గాల్లోకి ఎగరగానే ఆయా పాయింట్లలో దానికదే వెళ్తుంది. దీనివల్ల ఆపరేటర్ రిమోట్ స్క్రీన్‌పై కనిపిస్తున్న దృశ్యాలపై దృష్టి కేంద్రీకరించే అవకాశం ఉంటుంది. డ్రోన్‌కు సంబంధించి సాంకేతికంగా ముడిపడి ఉన్న అన్ని అంశాలపైనా మహిళా పోలీసులకు శిక్షణ ఇస్తున్నారు. అనంతరం వారికి పరీక్ష పెడతారు. ఉత్తీర్ణులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు.

ధాన్యం.. దయనీయం

(5వ పేజీ తరువాయి)

చేయకపోతే తమ పరిస్థితి ఏమిటని లబోదిబోమన్నారు. ఇది తమ ఒక్క కేంద్రం పరిధిలోనిది కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఇలాగే ఉందని సిబ్బంది సమాధానం చెప్పడంతో రైతులు ఆందోళన చెందారు. ధాన్యం లారీల్లోకి ఎక్కించి కేంద్రాల దగ్గరకు తీసుకొచ్చాక.. ఎలా వెనక్కి తీసుకువెళ్లేది అంటూ బావురుమన్నారు. లాభం లేదని కొంతమంది రైతులు జిల్లా సివిల్ సప్లయిస్ డీఎంకు ఫోన్ చేశారు. డీఎం ఫోన్ ఎత్తకపోవడంతో రైతుల్లో మరింత ఆందోళన నెలకొంది. ఈ క్రాప్ పంట పరిమితి తగ్గింపుపై రైతులు సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడిపై వాస్తవ నివేదిక ఇవ్వలేదా?

ధాన్యం దిగుబడిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి వాస్తవ ప్రాతిపదికన నివేదిక ఇవ్వలేదని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం సివిల్ సప్లయిస్‌కు చిన్నదైపోయింది. దీంతో ఈ క్రాప్‌లో నమోదైన 25 ఎకరాలు కాకుండా 12 ఎకరాలని సవరించుకున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారో, లేదో కూడా స్పష్టత లేదు. ఒకవేళ ముందే చెప్పి ఉంటే.. ప్రభుత్వం రైతులకు అనుకూలంగానే నిర్ణయం తీసుకుని ఉండేది. ప్రభుత్వానికి చెప్పకుండా కొనుగోళ్ల పరిమితిని తగ్గించటం వల్ల రైతుల్లో ఆందోళన నెలకొంది. తమకు నిర్దేశించిన లక్ష్యం మేరకు ముందుగా కొనుగోళ్లు జరిపి, ఆ తర్వాత రైతుల నుంచి డిమాండ్ ఉందని చెప్పాలని సివిల్ సప్లయిస్ అధికారులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. అప్పటి వరకు రైతులు ధాన్యాన్ని ఉంచుకోలేరు. అప్పులు తిరిగి చెల్లించాలంటే పండించిన ధాన్యాన్ని రైతులు వెంటనే అమ్ముకోవాలి. లేదంటే వారు మరింత ఇబ్బందులకు గురవుతారు. ఈ విషయంపై సివిల్ సప్లయిస్ అధికారులు పునరాలోచించి తక్షణం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.

మిల్లర్ల మాయాజాలం

ఉమ్మడి కృష్ణా జిల్లాలో రైస్ మిల్లర్ల మాయాజాలం ఈ ఖరీఫ్ సీజన్‌లో కూడా నడుస్తోంది. ప్రభుత్వ గిట్టుబాటు ధరలను ఎక్కడా కూడా మిల్లర్లు అమలు చేయటంలేదు. మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి రైతులను నష్టపరుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం 1061 రకానికి మద్దతు ధరగా రూ.1,760 నిర్ణయించింది. ఎరుపులు కేటగిరీకి సంబంధించి మాత్రం రూ.1,710 మద్దతు ధరను ప్రకటించింది. ఈ మద్దతు ధర మిల్లర్ల దగ్గర చెల్లటం లేదు. తేమశాతాన్ని ప్రాతిపదికగా తీసుకోవాల్సిన మిల్లర్లు అందరికీ ఒకటే విధానాన్ని అమలు చేస్తున్నారు. తేమశాతం పేరుతో 1061 రకానికి రూ.1,500, ఎరుపులు రకానికి రూ.1,450 చొప్పున నిర్దేశిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర కంటే కూడా రూ.260 తగ్గిస్తున్నారు. ఈ తగ్గించిన నగదు కూడా రైతులు ముందే మిల్లర్లకు చెల్లించాలి. ఎందుకంటే.. ప్రభుత్వం మద్దతు ధర ప్రాతిపదికన మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఖాతాకు ఆ మొత్తం డబ్బును జమ చేస్తుంది. వీటిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ క్రాప్‌లో 12 ఎకరాలకు మాత్రమే పరిమితం చేయటంతో మిగిలిన ధాన్యాన్ని రైతు అత్యవసరంగా అమ్ముకోవాలంటే మిల్లర్లే దిక్కు. మద్దతు ధర విషయంలోనే ఇలా ఉంటే.. రైతుల ఆర్థిక అవసరాల ప్రాతిపదికగా చూస్తే పరిస్థితి మరింత దారుణంగా మారనుంది. ప్రభుత్వం ఈ రెండు అంశాలపై దృష్టి సారిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

వీలైనంత త్వరగా బెయిల్ పిటిషన్

విచారించండి

● హైకోర్టులో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ అభ్యర్థన

● పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులకు కోర్టు ఆదేశం

● విచారణ వారం రోజులకు వాయిదా

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సినీనటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌పై నమోదు చేసిన కేసులో పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. జెత్వానీ కేసులో విద్యాసాగర్ బెయిల్ పిటిషన్‌ను విజయవాడ కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ఆయన బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి స్పందిస్తూ.. పిటిషనర్ గత 63 రోజులుగా జైలులోనే ఉన్నారని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపాలని అభ్యర్థించారు. ఈలోపు కౌంటర్ దాఖలు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. పిటిషన్ మొదటిసారి విచారణకు వచ్చిందన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన న్యాయమూర్తి విచారణను వారం రోజులకు వాయిదా వేశారు.

నేడు దుర్గా బ్యాంకు బాధితుల సమావేశం

భవానీపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యాధరపురం చెరువు సెంటర్‌లో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు అల్లూరి సీతారామరాజు గ్రంథాలయం సమీపంలో దుర్గా- కోపరేటివ్ అర్బన్ బ్యాంకు బాధితుల సమావేశం నిర్వహిస్తున్నట్టు సంఘం నేత జింకా చక్రధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాధరపురం బ్యాంకు బ్రాంచి పరిధిలోని డిపాజిటర్లు సకాలంలో హాజరు కావాలని, రాబోయే కార్యాచరణపై చర్చించనున్నట్టు ఆయన తెలిపారు.

4న ఒలింపిక్ అసోసియేషన్ సమావేశం

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలోని ఐలాపురం హోటల్‌లో డిసెంబర్ 4న 11 గంటలకు ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ అత్యవసర ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఏపీవోఏ అధ్యక్షుడు ఆర్‌కే పురుషోత్తమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాఖండ్‌లో జరిగే 38వ జాతీయ క్రీడలకు చెఫ్ డీ మిషన్ అపాయింట్‌మెంట్, క్రీడలకు కిట్‌లు, యూనిఫామ్స్, ప్రిపరేషన్ ఆఫ్ ది క్వాలిఫైడ్ అథ్లెట్స్, టీమ్ కోచ్‌ల ఎంపిక తదితర అంశాలపై చర్చించనున్నట్టు వివరించారు.

దుర్గగుడిలో సహస్ర దీపాలంకరణ

వన్‌టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం 20వ రోజైన గురువారం దుర్గగుడిలో యథావిధిగా సాయంత్ర వేళ గంగాపార్వతీ మల్లేశ్వరుల ఉత్సవ మూర్తుల ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవలను సభక్తిపూర్వకంగా నిర్వహించారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణ దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న అధికారులు



దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను గురువారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు అధికారులు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

కృష్ణాజిల్లా కూచిపూడికి చెందిన అభినయ నాట్య అకాడమీ గురువు కె.వి.జ్యోతి ఆధ్వర్యంలోని 20 మంది కళాకారుల బృందం గురువారం దుర్గగుడి కళావేదికపై కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. పలు కీర్తనలకు చక్కటి నృత్యం చేసి ఆహూతులను అలరించారు. వారి అభినయానికి ప్రేక్షకుల నుంచి హర్షధ్వానాలు అందుకున్నారు. ఈవో కె.ఎస్.రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు కళాకారులకు సర్టిఫికెట్లు అందచేసి అభినందించారు.

ఘాట్‌రోడ్డులో రాకపోకలకు అనుమతి

కొండ పటిష్ఠ పనులు అమలు జరుగుతున్న సందర్భంగా రెండు రోజుల పాటు నిలిపివేసిన ఘాట్ రోడ్డులో రాకపోకలను శుక్రవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్టు ఈవో కె.ఎస్.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల రద్దీని బట్టి యథావిధిగా వాహనాల రాకపోకలకు అనుమతిస్తామన్నారు.

'హైకోర్టు బెంచ్'తో కూటమి హామీ అమలు: మంత్రి సవిత

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం చేయడంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్‌కు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో పలువురు మాట్లాడారు. మంత్రి సవిత మాట్లాడుతూ 'సీమ ప్రజల మనోభావాలకు పెద్దపీట వేస్తూ కూటమి ప్రభుత్వం తీర్మానం చేసింది. ఎన్నికల హామీలను సీఎం ఒక్కొక్కటీ అమలు చేస్తున్నారు. సీమ ప్రజలకు జగన్ అన్ని విధాలా అన్యాయం చేసి, రాయలసీమ ద్రోహిగా నిలిచారు. కొరియాలో ఉండే కియాను సీమకు తెచ్చిన ఘనత చంద్రబాబుదే. మడకశిరలో కల్యాణి స్ట్రాటిజిక్ సిస్టమ్ లిమిటెడ్ ఏర్పాటు కానుంది. స్వర్ణాంధ్ర 2047లో రాయలసీమను రతనాల సీమగా తీర్చిదిద్దనున్నారు' అని చెప్పారు.

సీమ ప్రజల తరఫున సీఎంకు కృతజ్ఞతలు : మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం చేయడంపై రాయలసీమ ప్రజల తరఫున మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం రాయలసీమకు చేసిందేమీ లేదు. గత ముఖ్యమంత్రి సీమ ప్రజల మనోభావాలను పట్టించుకోలేదు. జిల్లాలు, జోన్లను విభజించి, ప్రజల మధ్య ప్రాంతీయ విద్వేషాలు రగిలించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీమకు మంచి రోజులొచ్చాయి. సీమ ప్రజల అభీష్టానికి అనుగుణంగా సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు.

సీమ అభివృద్ధిపై సీఎం దృష్టి: ఎమ్మెస్ రాజు

అధికార వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలన్న సంకల్పంతోనే సీఎం చంద్రబాబు ముందుకు వెళ్తున్నారని టీడీపీ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు చెప్పారు. సీమ ప్రజల మనోభావాలను గౌరవించి, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. సీమ బిడ్డ అయినా జగన్ సీమకు చేసిందేమీ లేదని విమర్శించారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరించమన్నారు: పీడీఎఫ్

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తారా? ప్రైవేటీకరిస్తారా? అని ప్రశ్నించగా, ప్రైవేటీకరణ చేసే ఉద్దేశం లేదని శాసన మండలిలో రాష్ట్ర మంత్రి వివరణ ఇచ్చారని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్లా వెంకటేశ్వరరావు చెప్పారు. ప్రైవేటీకరణ అంశంలో కేంద్రం మొదటి దోషి కాగా, గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలూ ఇందులో ప్రత్యక్ష, పరోక్షంగా భాగస్వాములేనని ఆయన ఆరోపించారు.

24న ఎన్టీఆర్ జిల్లా క్యారమ్స్ పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం డీ2 బ్లాక్‌లోని క్యారమ్స్ అసోసియేషన్ హాల్లో ఎన్టీఆర్ జిల్లా క్యారమ్ పోటీలు పురుషులు, స్త్రీలకు సింగిల్స్, వెటరన్ పురుషులు, స్త్రీలకు సింగిల్స్ విభాగాల్లో ఈ నెల 24న ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు బి వెంకయ్య, ఎస్‌కే అజ్మతుల్లాలు ఒక ప్రకటనలో తెలిపారు. వెటరన్ విభాగాల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా 50 ఏళ్లు పైబడిన వారై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 23న సాయంత్రం 5 గంటలు కల్లా 9492121727, 9491122634 నెంబర్లలో సంప్రదించాలన్నారు. వచ్చే నెల 7,8న చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి క్యారమ్ ర్యాంకింగ్ పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 25న సాయంత్రం 5 గంటల్లోగా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.



తూనికుంట్ల శ్రీనివాసు, చిట్టా అమర సుధీర్ దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

చిట్టా, తూనికుంట్ల ముందుచూపుతోనే

కేబీఎన్ అభివృద్ధి

వన్‌టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి చిట్టా అమర సుధీర్ ముందుచూపుతోనే కేబీఎన్ కళాశాల, పొట్టిశ్రీరాములు ఇంజనీరింగ్ కళాశాలలు రాష్ట్రంలోనే ఉన్నతస్థాయిలో ఉన్నాయని హిందూ హైస్కూల్స్ కమిటీ జనరల్ సెక్రటరీ, కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య అన్నారు. సెంట్రల్ అమెరికా వర్శిటీ నుంచి తూనికుంట్ల శ్రీనివాస్‌కు, కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్శిటీ నుంచి చిట్టా అమర సుధీర్‌కు ఇటీవల గౌరవ డాక్టరేట్లు అందిన సందర్భంగా వారిద్దరికీ గురువారం కళాశాలలో సన్మానం నిర్వహించారు. ఇద్దరినీ దంపతసమేతంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారిద్దరూ విద్యాభివృద్ధికి చేస్తున్న సేవ ఎంతో ప్రశంసనీయమైనదని కొనియాడారు. కమిటీ అధ్యక్షుడు పి.శేషయ్య మాట్లాడుతూ అనేక సమస్యలతో కేబీఎన్ కళాశాలను శ్రీనివాసు తన నాయకత్వ పటిమతో పరిష్కరించారని నాక్ ఏ డబుల్ ప్లస్ స్థాయికి కళాశాలను తీసుకువచ్చారని కొనియాడారు. కేబీఎన్ కళాశాల అధ్యక్షుడు ఉసిరిక ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అకుంఠిత దీక్ష, నిరంతర ప్రణాళిక, ముందుచూపుతో సుధీర్, శ్రీనివాసులు ఆయా కళాశాలలను తీర్చిదిద్దారని, అందుకే వారికి డాక్టరేట్ వరించిందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హైస్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు పాల్గొన్నారు.

యాభై ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం



విలక్షణ నటుడు డాక్టర్ మోహన్‌బాబుది ఐదు దశాబ్దాల సుదీర్ఘ సినీ ప్రయాణం. 'స్వర్గం.. నరకం' చిత్రంతో నటుడిగా ఎంట్రీ ఇచ్చిన ఆయన నేటితో 49 వసంతాలు పూర్తి చేసుకుని 50వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నారు. హీరోగా, విలన్‌గా ఆయన రూటే సపరేటు. సొంతంగా చిత్ర నిర్మాణసంస్థను నెలకొల్పి మోహన్‌బాబు నిర్మించిన 75 చిత్రాలు దాదాపు అన్నీ ఘన విజయం సాధించాయి. అలాగే విద్యారంగంలోనూ ఆయన విశేషమైన సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన కన్నప్ప చిత్రంలో మహాదేవ శాస్త్రిగా నటిస్తున్నారు. ఈ చిత్ర నిర్మాణం ఆయన కెరీర్‌లో మరో మైలు రాయి అని చెప్పాలి. ఈ చారిత్రక ఘట్టాన్ని ఆయన తనయుడు విష్ణు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది నవంబర్ వరకూ ప్రతి నెలా ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఇఫీలో అక్కినేని ఫ్యామిలీ సందడి



త్వరలో పెళ్లి పీటలెక్కనున్న అక్కినేని నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల గోవాలో జరుగుతున్న భారత అంతర్జాతీయ చిత్రోత్సవం(ఇఫీ)లో సందడి చేశారు. అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఆయన నటించిన అజరామర చిత్రాలను ఈ చిత్రోత్సవంలో ప్రదర్శించనున్నారు. ఈ నేపథ్యంలో అక్కినేని నాగార్జున, అమల దంపతులు బుధవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాగచైతన్య శోభితా గురువారం జంటగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వీరంతా కలసి రెడ్‌కార్పెట్‌పై ఫొటోలకు పోజులిస్తూ ప్రత్యేకాకర్షణగా నిలిచారు.



ఆ ప్రచారంలో నిజం లేదు

ఏ.ఆర్. రెహమాన్ దంపతులు ఇటీవలే పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించడం.. ఇది జరిగిన కొద్ది గంటలకే రెహమాన్ టీమ్‌లో కీలక సభ్యురాలైన మోహిని దేవి కూడా తన భర్త నుంచి విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఈ జంటల విడాకులకు ఏదో సంబంధం ఉందంటూ ప్రచారం జరిగింది. అయితే వీటిపై సైరా బాను తరఫు న్యాయవాది వందనా షా స్పందించారు. ఈ ప్రచారంలో నిజం లేదని స్పష్టతనిచ్చారు. "పరస్పర అంగీకారంతోనే రెహమాన్, సైరా ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. వైవాహిక జీవితానికి స్వస్తి పలకడం ఎంతో బాధతో కూడుకున్న విషయం. ప్రస్తుతం వారిద్దరూ బాధలో ఉన్నారు. వివాహ బంధంలో సైరా ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. వారు విడిపోవడానికి కారణాలు ఉన్నాయి. వాటిని బహిర్గతం చేసే స్వేచ్ఛ నాకు లేదు. కలిసున్నా.. విడిపోయినా.. ఉన్నతమైన జీవితాన్ని కొనసాగించాలని ఇరువురూ భావిస్తున్నారు" అని వందనా షా తెలిపారు.











నితీశ్ కుమార్ అరంగేట్రం
ప్రతీకారం కోసం ఆస్ట్రేలియా
నేటి నుంచి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ

కంగారెత్తిస్తారా!

తొలి టెస్టు-ఉదయం 7.50 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



కమిన్స్
బుమ్రా

సొంత గడ్డపై కివీస్ చేతిలో వైట్‌వాష్.. అటు చూస్తే జట్టులో కీలక ఆటగాళ్ల గాయాల బెడద.. దీనికి తోడు స్టార్ బ్యాటర్ల ఫామ్ లేమి. ఇన్ని సవాళ్ల మధ్య భారత జట్టు ఆస్ట్రేలియా గడ్డపై సుదీర్ఘ టెస్టు సిరీస్ ఆడబోతోంది. అయితే చివరి రెండు పర్యాయాలు ఇక్కడి ప్రతికూలతలను అధిగమిస్తూ టీమిండియా జయ కేతనం ఎగురవేయగలిగింది. కానీ ఈసారి అలాంటి అద్భుతాన్నే సాధించగలదా? అంటే కచ్చితంగా అవునూ.. అని చెప్పలేని పరిస్థితి. ఆత్మవిశ్వాసం అడుగంటిన భారత జట్టు అటు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ బెర్త్‌ను కూడా దృష్టిలో ఉంచుకుని ఆడాల్సి ఉంది. మరోవైపు భారత్ బలహీనతలను సొమ్ము చేసుకుంటూ ఈసారి ఎలాగైనా సిరీస్‌ను ఖాతాలో వేసుకోవాలని ఆతిథ్య ఆస్ట్రేలియా ఎదురుచూస్తోంది.

పెర్త్: క్రికెట్ ప్రేమికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీకి వేళయ్యింది. భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య నేటి నుంచే ఐదు టెస్టుల సిరీస్ ఆరంభం కానుంది. దీంట్లో భాగంగా పెర్త్‌లోని ఓప్టస్ స్టేడియంలో తొలి టెస్టు జరుగబోతోంది. 2018-19, 2020-21లలో ఇక్కడ జరిగిన నాలుగు టెస్టుల సిరీస్‌లను టీమిండియా గెలుచుకోవడం విశేషం. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ ఈ టెస్టుకు అందుబాటులో ఉండడం లేదు. దీంతో పేసర్ బుమ్రా ఆధ్వర్యంలో భారత జట్టు పెర్త్ మ్యాచ్‌లో ఆడనుంది. హ్యాట్రిక్ సిరీస్‌ను అందుకోవడంపై భారత జట్టుకు ప్రస్తుతం ఆలోచన లేకున్నా మొదట తొలి టెస్టును ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. అదే జరిగితే ఆత్మవిశ్వాసం రెట్టింపవుతుంది. అటు భారత్ చేతిలో వరుసగా రెండు టెస్టు సిరీస్‌లను కోల్పోయిన ఆసీస్ ఆ ఓటములకు చెక్ పెట్టాలనుకుంటోంది. ఈసారి కాస్త బలహీనంగా కనిపిస్తున్న ప్రత్యర్థిపై సంపూర్ణ ఆధిపత్యం చూపాలనే ఆత్రుతలో ఉంది. డబ్ల్యూటీసీ పాయింట్లలో తొలి రెండు స్థానాల్లో ఉన్న ఆసీస్, భారత్‌లకు ఈ సిరీస్ కీలకం కానుంది. అలాగే ఫైనల్ బెర్త్ ఆశిస్తున్న ఇతర జట్లు కూడా సిరీస్‌ను ఆసక్తిగా గమనిస్తుంటాయి.

విరాట్‌పై ఒత్తిడి


కోహ్లి

రోహిత్, గిల్ అందుబాటులో లేకపోవడంతో తొలి టెస్టు బరిలో నిలిచే భారత జట్టుపై ఆసక్తి నెలకొంది. ఓపెనర్ జైస్వాల్ ఆసీస్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. అతడికి జతగా రాహుల్ ఆడడం ఖాయమే. ఇక ఇటీవల ఆసీస్ 'ఏ'పై రాణించిన దేవ్‌దత్ పడిక్కళ్‌ను వన్‌డౌన్‌లో ఆడించే అవకాశం ఉంది. మిడిలార్డర్‌లో ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ అరంగేట్రం చేయవచ్చని సమాచారం. కోచ్ గంభీర్ అతడిని నాలుగో పేసర్‌గా వినియోగించుకోవాలనుకుంటున్నాడు. అలాగే ఇటీవల ఫామ్ కోల్పోయిన పేసర్ సిరాజ్‌కు ఆసీస్‌లో చక్కటి రికార్డే ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అతడిని కొనసాగిస్తారా? లేక పక్కనబెడతారా? వేచి చూడాల్సిందే. సిరాజ్ లేదా ఆకాశ్ స్థానంలో మరో పేసర్ హర్షిత్ రాణాను తీసుకునే అవకాశం లేకపోలేదు. అశ్విన్ ఏకైక స్పిన్నర్‌గా ఆడడం ఖాయమే. ఇక బ్యాటింగ్‌లో విరాట్ ఎలా ఆడనున్నాడన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. కివీస్‌తో సిరీస్‌లో అతడి సగటు కేవలం 15.50 మాత్రమే. కానీ పెర్త్‌లో మాత్రం నాలుగు ఇన్నింగ్స్‌లో ఓ సెంచరీ, హాఫ్ సెంచరీతో విరాట్‌కు మెరుగైన రికార్డే ఉంది. అందుకే ప్రస్తుత వైఫల్యాన్ని అధిగమిస్తూ మరోసారి ఇక్కడ చెలరేగాలని ప్రతీ అభిమాని కోరుకుంటున్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రాహుల్, పడిక్కళ్, విరాట్, పంత్, జురెల్, నితీశ్, అశ్విన్, బుమ్రా (కెప్టెన్), హర్షిత్/ప్రసిద్ధ్, సిరాజ్/ఆకాశ్.
ఆసీస్: ఖవాజా, మెక్‌స్వీనే, లబుషేన్, స్మిత్, హెడ్, మిచెల్ మార్ష్, క్యారీ, ప్యాట్ కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, లియోన్, హాజెల్‌వుడ్.

పిచ్, వాతావరణం

ఇక్కడి పిచ్‌పై చక్కటి బౌన్స్ లభిస్తుందని ఇప్పటికే క్యూరేటర్ తెలిపాడు. దీంతో పేసర్లు లాభపడనుండగా, బ్యాటర్లకు కష్టాలు తప్పవు. శుక్రవారం ఉదయం వర్షం కురిసే అవకాశం ఉంది. ఓప్టస్ మైదానంలో సెకండ్ బ్యాటింగ్ చేసిన జట్టు గెలిచిన దాఖలాలు లేవు. అయితే వాతావరణ పరిస్థితులను బట్టి టాస్ నెగ్గిన జట్టు ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

ఆధిపత్యం కోసం..

ఎనిమిది నెలల తర్వాత టెస్టు ఫార్మాట్‌లో ఆడనున్న ఆసీస్ జట్టు ఈసారి ఎలాగైనా భారత్‌పై ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటోంది. అంతేకాకుండా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే తమకు మిగిలిన ఏడు టెస్టుల్లో ఐదు గెలవాలి. అందుకే స్వదేశంలో వీలైనన్ని విజయాలు సాధిస్తే ఎలాంటి ఒత్తిడీ ఉండదనే ఆలోచనలో ఉంది. వార్నర్ వీడ్కోలు తర్వాత ఓపెనర్ సమస్య వెంటాడుతోంది. స్మిత్‌ను పరీక్షించినా విఫలమయ్యాడు. అందుకే ఖవాజాకు జతగా ఈసారి మెక్‌స్వీనేతో అరంగేట్రం చేయించనున్నారు. మిగతా బ్యాటర్లకు అపార అనుభవం ఉండడంతో భారత జట్టులోని యువ బౌలర్లపై ఒత్తిడి పెరగనుంది. పేసర్లు స్టార్క్, కమిన్స్, హాజెల్‌వుడ్‌లతో పాటు స్పిన్నర్ లియోన్ ప్రత్యర్థి బ్యాటర్లకు సవాల్ విసరనున్నాడు.



స్మిత్

రెండు రోజుల్లో పెర్త్‌కు రోహిత్



కెప్టెన్ రోహిత్ శర్మ ఈనెల 24న భారత జట్టులో చేరనున్నాడు. భార్య రెండో ప్రసవంతో స్వదేశంలోనే ఉండిపోయిన రోహిత్ తొలి టెస్టుకు దూరమయ్యాడు. వచ్చే నెల 6 నుంచి జరిగే అడిలైడ్ టెస్టుకు ముందు జట్టుతో కలుస్తాడని భావించారు. కానీ తాజా టెస్టు జరుగుతున్న సమయంలోనే ఆసీస్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్న తను 23న ముంబై నుంచి బయలుదేరనున్నాడు.

కెప్టెన్సీ ఓ బాధ్యత: బుమ్రా

జట్టుకు కెప్టెన్సీ వహించడాన్ని ఓ పదవిలా కాకుండా బాధ్యతగా తీసుకుంటానని పేసర్ బుమ్రా తెలిపాడు. 'కెప్టెన్సీ ఓ గౌరవం. నాకంటూ సొంత శైలి ఉంది. పేసర్లు జట్టు కెప్టెన్‌గా ఉండాలని నేనెప్పుడూ చెబుతుంటాను. ఎందుకంటే మైదానంలో వారి వ్యూహాలు భిన్నంగా ఉంటాయి. ఇక కివీస్‌తో వైట్‌వాష్ ప్రభావం ఇక్కడ ఏమాత్రం ఉండదు. గెలిచినా, ఓడినా మరో సిరీస్‌ను మొదటి నుంచే ఆరంభించాల్సి ఉంటుంది. భారత్‌లోని పరిస్థితులను ఇక్కడితో పోల్చలేం. మా తుది జట్టుపై ఇప్పటికే స్పష్టతతో ఉన్నాం' అని బుమ్రా చెప్పాడు.

గంభీర్.. ప్రశాంతంగా ఉండు: రవిశాస్త్రి



ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టు కోచ్ గంభీర్ ప్రశాంతంగా ఉండాలని మాజీ కోచ్ రవిశాస్త్రి సూచించాడు. కివీస్‌తో 0-3 ఓటమితో గంభీర్‌పై ఒత్తిడి నెలకొన్న విషయం తెలిసిందే. 'బయటి విషయాల్ని ఏవిధంగానూ ప్రభావితం చేయనివ్వద్దు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి, అనేక సంస్కృతుల నుంచి జట్టులోకి వచ్చిన ఆటగాళ్లను సరిగా అర్థం చేసుకోండి. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు' అని గంభీర్‌కు రవిశాస్త్రి హితవు పలికాడు.

నితీశ్ రాణిస్తాడు..: కమిన్స్

యువ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌పై ఆసీస్ కెప్టెన్ కమిన్స్ ప్రశంసల వర్షం కురిపించాడు. అతడు ప్రతిభావంతుడైన కుర్రాడని, ఆసీస్ గడ్డపై బంతిని స్వింగ్ చేయగలడని చెప్పాడు. ఐపీఎల్‌లో నితీశ్‌తో ఆడడాన్ని ఆస్వాదించినట్టు ఆ జట్టు కెప్టెన్ కూడా అయిన కమిన్స్ తెలిపాడు. అయితే ఆ టోర్నీలో అతడికి పెద్దగా బౌలింగ్ చేసే అవకాశం రాలేదని గుర్తు చేశాడు.

క్వార్టర్స్‌లో లక్ష్యసేన్

రెండో రౌండ్‌లో సింధు ఓటమి
చైనా మాస్టర్స్

షెన్‌జెన్ (చైనా): లక్ష్యసేన్, స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్/చిరాగ్ చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. అయితే పీవీ సింధు రెండో రౌండ్‌లోనే వెనుదిరిగింది. గురువారం జరిగిన రౌండ్-16లో లక్ష్యసేన్ 21-16, 21-18తో జమ్కే. (డెన్మార్క్)ని చిత్తు చేశాడు. ఇక సాత్విక్/చిరాగ్ 21-19, 21-15తో జేర్/ఫ్రెడరిక్ (డెన్మార్క్)పై నెగ్గారు. సింధు 21-16, 17-21, 21-23తోయో జియా మిన్ (సింగపూర్) చేతిలో ఓడింది. అనుపమ 7-21, 14-21తో నిదారియా (జపాన్) చేతిలో, మాళవిక 9-21, 9-21తో కటిదాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో చిత్తయ్యారు. మహిళల డబుల్స్ రెండో రౌండ్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 16-11, 11-21తో చైనా జంట లియు/షువా చేతిలో ఓటమి చవిచూసింది. మిక్స్‌డ్ డబుల్స్ రౌండ్-16లో సుమిత్ రెడ్డి/సిక్కి రెడ్డి జోడీ ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చింది.

జూ. సెహ్వాగ్ 'డబుల్'



షిల్లాంగ్ (మేఘాలయ): భారత జట్టు మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ కూచ్ బిహార్ టోర్నీలో అజేయ ద్విశతకంతో అదరగొట్టాడు. మేఘాలయ జట్టుతో ఇక్కడ జరుగుతున్న నాలుగు రోజుల మ్యాచ్‌లో ఢిల్లీ మొదటి ఇన్నింగ్స్‌లో 200 పరుగుల (229 బంతులు, 34 ఫోర్లు, 2 సిక్సర్లు)తో చెలరేగాడు. దాంతో గురువారం, రెండో రోజు ఆఖరికి ఢిల్లీ మొదటి ఇన్నింగ్స్‌లో 468/2తో భారీ స్కోరు చేసింది. మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 260 పరుగులు చేసింది.

పాక్ పర్యటనకు ఐసీసీ ప్రతినిధులు?

దుబాయ్: భద్రతా కారణాల రీత్యా పాకిస్థాన్‌లో పర్యటించేందుకు భారత జట్టు నిరాకరించడంతో.. చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ అనిశ్చితిలో పడింది. హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించాలని బీసీసీఐ పట్టుబడుతుండగా.. ఆతిథ్య హక్కులు సొంతం చేసుకొన్న పాక్ ససేమిరా అంటోంది. తీవ్ర వివాదం రేగుతున్న వేళ టోర్నీ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పాక్‌లో ఐసీసీ ప్రతినిధులు పర్యటించనున్నారన్న వార్త చక్కర్లుకొడుతోంది. వచ్చే వారం వీరి టూర్ ఉండే అవకాశం ఉందట. కాగా, చాంపియన్స్ ట్రోఫీకి సంబంధించి పాక్ క్రికెట్ బోర్డు, బీసీసీఐ మధ్య చర్చలు జరగవచ్చునన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి.

టైటాన్స్ హ్యాట్రిక్

నోయిడా: ప్రొ. కబడ్డీ తాజా సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు విజయాల హ్యాట్రిక్ కొట్టింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 31-29తో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. టైటాన్స్ కెప్టెన్ విజయ్ మాలిక్ 14 పాయింట్లతో అదరగొట్టాడు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 32-26తో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది.

హైదరాబాద్‌లో అసెండైన్ ఏఐ స్టూడియో
1,000 మందికి ఉద్యోగాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ సేవల రంగంలో కార్యకలాపాలు సాగించే అసెండైన్ కంపెనీ హైదరాబాద్‌లో తన కృత్రిమ మేధ (ఏఐ) స్టూడియోను ప్రారంభించింది. ఈ కేంద్రంలో పని చేసేందుకు కంపెనీ ఇప్పటికే 350 మంది ఇంజినీర్ల నియామకాలు పూర్తి చేసింది. వీరిలో 60 మంది క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా చేరిన గ్రాడ్యుయేట్లు. వచ్చే ఏడాది చివరికి ఉద్యోగుల సంఖ్య 1,000 మందికి చేరుతుందని కంపెనీ సీఈఓ కార్తిక్ కృష్ణమూర్తి చెప్పారు. హైదరాబాద్‌లోని ఏఐ స్టూడియో ద్వారా దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ గేమింగ్, లైఫ్ సైన్సెస్, బీఎఫ్ఎస్ఐ కంపెనీలకు సేవలందిస్తామని తెలిపారు. గచ్చిబౌలి ప్రాంతంలో 5,000 ఎస్ఎఫ్‌టీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా పార్మా కంపెనీల నిర్వహణలోనూ ఆయా కంపెనీల ఉద్యోగులకు వర్చువల్ శిక్షణ ఇస్తామని కృష్ణమూర్తి తెలిపారు. ఏఐతో ఉద్యోగాలకు పెద్దగా వచ్చే ముప్పేమీ లేదన్నారు. ఈ సరికొత్త టెక్నాలజీతో ఉత్పాదకత పెరిగి కంపెనీలకు ఖర్చులు తగ్గుతాయన్నారు.

మంగోల్ రిఫైనరీకి మేఘా యంత్రాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) మరో ఘనత సాధించింది. మంగోలియాలో తొలిసారిగా నిర్మిస్తున్న మంగోల్ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టుకు అవసరమైన కీలక యంత్ర పరికరాలను సరఫరా చేస్తోంది. ఇందులో భాగంగా గురువారం ఈ రిఫైనరీకి అవసరమైన ప్రెజర్ వెసల్‌ను పంపించింది. జీడిమెట్లలోని కంపెనీ ప్లాంటులో జరిగిన ఈ కార్యక్రమానికి మంగోల్ రిఫైనరీ సీఈఓ డాక్టర్ అల్టాంట్ సెట్‌సెగ్ డషడవ, ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ (ఈఐఎల్) జనరల్ మేనేజర్ వికల్ప్ పలివాల్‌తో సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. మంగోల్ రిఫైనరీ ప్రాజెక్టుకు చెందిన నాలుగు ప్యాకేజీల్లో మూడు ప్యాకేజీలను మేఘా ఇంజినీరింగ్ కంపెనీ అమలు చేస్తోంది. కంపెనీ ఈ తరహా ప్రెజర్ వెసల్స్‌ను విదేశాలకు ఎగుమతి చేయడం ఇదే మొదటిసారి. ఈ అత్యాధునిక ప్రెజర్ వెసల్ తయారీ కోసం కంపెనీ ఉద్యోగులు ఎంతో నైపుణ్యం, నిబద్ధతతో పని చేశారని ఎంఈఐఎల్ డైరెక్టర్ పీ దొరయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

పబ్లిక్ ఇష్యూలకు సెక్యూరిటీ డిపాజిట్ రద్దు

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూలకు వచ్చే కంపెనీలకు సెబీ మరో వెసులుబాటు కల్పించింది. ఈ కంపెనీలు ఐపీఓలు, రైట్స్ ఇష్యూల ద్వారా సేకరించే నిధుల్లో ఒక శాతాన్ని తప్పనిసరిగా ముందుగానే స్టాక్ ఎక్స్ఛేంజిల వద్ద డిపాజిట్ చేయాలన్న నిబంధనను తొలగించింది. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని తెలిపింది. ఏఎస్‌బీఏ, యూపీఐ చెల్లింపులు, అలాట్ అయిన షేర్లు తప్పనిసరిగా డీమ్యాట్ ఖాతాల్లోనే జమ చేయడం వంటి సంస్కరణల నేపథ్యంలో, మారిన మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. దీనికి సంబంధించి సెబీ ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఒక చర్చా పత్రం విడుదల చేసింది. దానిపై వచ్చిన సలహాలు, సూచనలతో ఈ తాజా నిర్ణయం తీసుకుంది.

అమెజాన్ బిజినెస్ వాల్యూ డేస్ షురూ

న్యూఢిల్లీ: బిజినెస్ టు బిజినెస్ (బీ2బీ) ప్లాట్‌ఫాం అమెజాన్ బిజినెస్ మళ్లీ 'బిజినెస్ వాల్యూ డేస్' ప్రారంభించింది. గురువారం ప్రారంభమైన ఈ అమ్మకాలు వచ్చే నెల ఆరవ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ సమయంలో తమ బీ2బీ ప్లాట్‌ఫాం ద్వారా కొనే వస్తువుల గరిష్ఠ ధరపై 70 శాతం వరకు డిస్కౌంట్ లభిస్తుందని అమెజాన్ బిజినెస్ తెలిపింది. దీనికి తోడు బిజినెస్ కస్టమర్లకు రూ.9,999 వరకు క్యాష్‌బాక్ కూడా లభిస్తుంది. ఈ 16 రోజుల బిజినెస్ వాల్యూ డేస్ కోసం 16 లక్షల మందికిపైగా అమ్మకందారులు 19 కోట్లకుపైగా వస్తువులను అమ్మకానికి పెట్టినట్టు తెలిపింది.

ధరల అదుపుతోనే స్థిరమైన వృద్ధి

» ఆర్‌బీఐ గవర్నర్

ముంబై: సుస్థిర ఆర్థిక వృద్ధి కావాలంటే ధరల పెరుగుదలకు చెక్ పెట్టక తప్పదని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేశారు. దీని వలన ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో పాటు, పెట్టుబడులకు అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. వివిధ దేశాల కేంద్ర బ్యాంకర్లతో ముంబైలో జరిగిన 'గ్లోబల్ సౌత్' సదస్సులో ఆయన ఈ విషయాలు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆరు శాతానికిపైగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణాన్ని నాలుగు శాతానికి తగ్గించడమే ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) లక్ష్యమన్నారు. ప్రస్తుత సంక్షుభిత పరిస్థితుల్లో సుస్థిర అభివృద్ధి, ఆర్థిక, ద్రవ్య స్థిరీకరణ వర్ధమాన దేశాలకు పెద్ద సవాల్‌గా మారిందని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు.

అదానీ సుడిలో మార్కెట్ మునక

ఈక్విటీ మార్కెట్ నష్టం రూ.5.27 లక్షల కోట్లు.. అదానీ గ్రూప్ వాటా రూ.2.24 లక్షల కోట్లు

- కుప్పకూలిన అదానీ షేర్లు
- అదానీ ఎంటర్‌ప్రైజెస్ నష్టం 23%
- మరో 10 కంపెనీల షేర్లదీ అదే గతి
- హిండెన్‌బర్గ్ వివాదం తర్వాత ఇదే అతిపెద్ద ఫాల్



ముంబై: గౌతమ్ అదానీపై అమెరికాలో లంచం అభియోగాలు నమోదైన నేపథ్యంలో అదానీ గ్రూప్‌లోని 11 లిస్టెడ్ కంపెనీల షేర్లు గురువారం కుప్పకూలాయి. గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ఏకంగా 22.61 శాతం క్షీణించగా.. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 20 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 18.80 శాతం పతనమయ్యాయి. పలు కంపెనీల షేర్లు ఇంట్రాడేలో లోయర్ సర్క్యూట్‌ను సైతం తాకాయి. అమ్మకాల హోరులో అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ సంపద ఒక్కరోజే రూ.2.24 లక్షల కోట్లు తగ్గి రూ.12.06 లక్షల కోట్ల స్థాయికి పడిపోయింది. 2023 జనవరిలో అదానీ అవకతవకలపై హిండెన్‌బర్గ్ నివేదిక విడుదల చేసినప్పుడు తరిగిపోయిన గ్రూప్ సంపదతో పోలిస్తే ఇది రెండు రెట్లకు పైగా అధికం. అదానీ గ్రూప్ మార్కెట్ క్యాప్ ఏడాది గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు రూ.7.5 లక్షల కోట్ల మేర తరిగిపోయింది. తాజా వివాదం నేపథ్యంలో అదానీ గ్రూప్ స్టాక్స్ మున్ముందు మరింత క్షీణించే అవకాశాలున్నాయని, రిటైల్ మదుపరులు కొంతకాలం పాటు ఈ షేర్లకు దూరంగా ఉండటమే మేలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

రూ.లక్ష కోట్లు తగ్గిన అదానీ వ్యక్తిగత సంపద

గ్రూప్ కంపెనీల షేర్ల పతనంతో గౌతమ్ అదానీ వ్యక్తిగత సంపద కూడా భారీగా క్షీణించింది. ఫోర్బ్స్ బిలియనీర్ల రియల్‌టైం జాబితా ప్రకారం.. అదానీ ఆస్తి ఏకంగా 17.34 శాతం లేదా 1,210 కోట్ల డాలర్లు (సుమారు రూ.1.02 లక్షల కోట్లు)తగ్గి 5,770 కోట్ల డాలర్లకు (రూ.4.87 లక్షల కోట్లు) పడిపోయింది. దాంతో అదానీ రిచ్ లిస్ట్‌లో 25వ స్థానానికి జారుకున్నారు.

జీక్యూజీ రాజీవ్ జైన్‌కూ షాక్!

హిండెన్‌బర్గ్ వివాదం అనంతర కాలంలో అదానీ గ్రూప్ కంపెనీల్లో భారీగా వాటాలు కొనుగోలు చేసిన ప్రవాస భారతీయుడు రాజీవ్ జైన్‌కు చెందిన జీక్యూజీ పార్ట్‌నర్స్‌కూ తాజా ఆరోపణలతో గట్టి షాక్ తగిలింది. అదానీ కంపెనీల్లోని జీక్యూజీ పెట్టుబడుల విలువ భారీగా తరిగిపోవడంతో పాటు ఆస్ట్రేలియాలోని ఏఎస్ఎక్స్‌లో లిస్టయిన జీక్యూజీ షేరు గురువారం ఉదయం 26 శాతం పతనమైంది.

గ్రూప్ పరపతికి దెబ్బ: మూడీస్

అమెరికాలో గౌతమ్ అదానీపై లంచం కేసు నమోదు కావడం గ్రూప్ కంపెనీల పరపతిని దెబ్బతీయనుందని అంతర్జాతీయ సంస్థ మూడీస్ రేటింగ్స్ అంటోంది. ఈ నేపథ్యంలో అదానీ కంపెనీల పరపతి సామర్థ్యాన్ని మదింపు చేసేందుకు గ్రూప్ పాలన ప్రమాణాలను సైతం దృష్టిలో పెట్టుకోనున్నట్లు రేటింగ్ ఏజెన్సీ పేర్కొంది.

అదానీ గ్రీన్ 5,070 కోట్ల బాండ్ల జారీ రద్దు

తాజా పరిణామాల నేపథ్యంలో అదానీ గ్రూప్‌నకు చెందిన పునరుత్పాదక ఇంధన సంస్థ అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ 60 కోట్ల డాలర్ల (సుమారు రూ.5,070 కోట్లు) విలువైన బాండ్ల జారీ ప్రక్రియను రద్దు చేసుకుంది. అదానీపై అభియోగాలు నమోదైన కొద్ది గంటలకు ముందు యూఎస్ మార్కెట్లో కంపెనీ 20 ఏళ్ల కాలపరిమితితో కూడిన గ్రీన్ బాండ్లను విక్రయించింది. ఇన్వెస్టర్ల నుంచి కూడా భారీ స్పందన లభించింది. ఇష్యూ సైజుకు 3 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. కానీ, తాజా ఆరోపణల నేపథ్యంలో బాండ్ల ఇష్యూను రద్దు చేసుకున్నట్లు కంపెనీ ప్రకటించింది.

423 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

అదానీ గ్రూప్ షేర్లు కుప్పకూలడంతో స్టాక్ మార్కెట్ సూచీలు కూడా కుదేలయ్యాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ, అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు మార్కెట్‌ను మరింత కుంగదీశాయి. సెన్సెక్స్ ఒక దశలో 775.65 పాయింట్లు పతనమై 76,802.73 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 422.59 పాయింట్ల నష్టంతో 77,155.79 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 168.60 పాయింట్లు కోల్పోయి 23,349.90 వద్ద ముగిసింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.27 లక్షల కోట్లు తగ్గి రూ.425.39 లక్షల కోట్లకు (5.04 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. అందులో రూ.2.24 లక్షల కోట్ల సంపద తరుగుదల అదానీ గ్రూప్ కంపెనీలదే కావడం గమనార్హం. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ షేరు 13.53 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది.

ఎల్ఐసీకి 8,700 కోట్ల నష్టం

అదానీ షేర్ల పతనంతో ఈ గ్రూప్ కంపెనీల్లో పెద్దమొత్తంలో పెట్టుబడులు కలిగి ఉన్న ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ కూడా భారీగా నష్టపోవాల్సి వచ్చింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్ సహా గ్రూప్‌లోని ఏడు కంపెనీల షేర్లలో ఎల్ఐసీ పెట్టుబడుల విలువ ఒక్కరోజే రూ.8,683 కోట్లు తరిగిపోయింది.

కంపెనీ	నష్టం(రూ.కోట్లు)
అదానీ ఎంటర్‌ప్రైజెస్	2,962
అదానీ పోర్ట్స్	2,959
అదానీ గ్రీన్ ఎనర్జీ	570
అదానీ ఎనర్జీ సొల్యూషన్స్	716
అదానీ టోటల్ గ్యాస్	463
అంబుజా సిమెంట్స్	191
ఏసీసీ	822

రామోజీ ఫౌండేషన్ నుంచి ఐఎస్‌బీకి రూ.30 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐఎస్‌బీ హైదరాబాద్ క్యాంపస్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి రామోజీ ఫౌండేషన్ నుంచి రూ.30 కోట్లు విరాళంగా అందింది. సీఎస్ఆర్ నిధుల నుంచి రామోజీ ఫౌండేషన్ ఈ విరాళం అందించింది. క్యాంపస్‌లో నిర్మిస్తున్న ఎగ్జిక్యూటివ్ సెంటర్‌లో భాగంగా 430 సీట్లు గల ఆడిటోరియం నిర్మాణానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు ఐఎస్‌బీ ప్రకటించింది.

కోటి కస్టమర్లను కోల్పోయిన ప్రైవేట్ టెల్కోలు

న్యూఢిల్లీ: సెప్టెంబరు నెలలో ప్రైవేట్ రంగంలోని రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కంపెనీలు ఉమ్మడిగా కోటి మంది కస్టమర్లను కోల్పోగా ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్ మాత్రం కొత్తగా 8.5 లక్షల మంది మొబైల్ వినియోగదారులను సాధించింది. రిలయన్స్ జియో అత్యధికంగా 79.69 లక్షల మంది కస్టమర్లను కోల్పోగా వొడాఫోన్ ఐడియా 15.53 లక్షలు, భారతి ఎయిర్‌టెల్ 14.34 లక్షల మంది కస్టమర్లను నష్టపోయాయి. బీఎస్ఎన్ఎల్ అదనంగా 8.5 లక్షల మంది కస్టమర్లను సాధించడంతో సంస్థ కస్టమర్ల సంఖ్య 9.18 కోట్లకు చేరింది.

బిజినెస్

ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి

భారత కరెన్సీ విలువ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 8 పైసలు క్షీణించి 84.50 వద్ద ముగిసింది. రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధం భీకర రూపం దాలుస్తుండటంతో అంతర్జాతీయంగా డాలర్‌కు డిమాండ్ పెరిగిందని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. రాబోయే కాలంలో రూపాయి మరింత బలహీనపడవచ్చని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ, కరెన్సీ విభాగం వైస్ ప్రెసిడెంట్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేదీ అన్నారు. డాలర్- రూపాయి మారకం విలువ 84.35-84.65 శ్రేణిలో కదలాడవచ్చన్నారు.

పసిడి మళ్లీ కొండెక్కుతోంది..

దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఎగబాకుతున్నాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర మరో రూ.1,400 పెరుగుదలతో రూ.79,300కు చేరుకుంది. కిలో వెండి మాత్రం ఏ మార్పు లేకుండా రూ.93,000 ధర పలికింది. రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తలు పెరిగిన నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ఈ విలువైన లోహానికి డిమాండ్ పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 0.74 శాతం పెరిగి 2,695 డాలర్లకు చేరుకోగా.. సిల్వర్ 31.53 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓకు 93% బిడ్లు

- ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఐపీఓకు రెండో రోజు నాటికి 93 శాతం సబ్‌స్క్రిప్షన్ లభించింది. రిటైల్ మదుపరుల కోసం కేటాయించిన షేర్లకు మాత్రం 2.38 రెట్ల బిడ్లు లభించాయి.
- వాహన పరికరాల తయారీ సంస్థ బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ ఐపీఓ ద్వారా రూ.2,150 కోట్ల సమీకరణకు అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,950 ▲	71,450 ▲	1,00,000 ▼
ముంబై	76,930 ▲	70,470 ▲	90,320 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ			
హైదరాబాద్	565	విజయవాడ	580
వరంగల్	567	గోదావరి	580
చిత్తూరు	593	విశాఖపట్నం	565
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	103
కరీంనగర్	105	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	87
కర్నూలు	105	నెల్లూరు	87
విశాఖపట్నం	115	అనంతపురం	87
గోదావరి	113		

చింతన

ధ్యాన మర్మం

మనుగడ కోసం మాత్రమే మనసును ఉపయోగించుకోవడం, కర్మలను పరిమితంగా ఆచరించడం... ఇలా సరళమైన జీవనం గడపడమే నిజమైన ధ్యానం. ధ్యానం అంటే ఏదీ చేయకపోవడం (నాన్ డూయింగ్). కేవలం ఉండడం (బీయింగ్). ఏ ఆలోచనా లేకుండా... నువ్వు నువ్వుగా ఉండే అస్తిత్వ స్థితి. ఇక్కడ ఏమీ చేయకపోవడం అంటే నిష్క్రియా పరత్వమో, బద్ధకంగా కూర్చోవడమో కాదని గ్రహించాలి. ఆలోచనను, క్రియను అవసరమైన చోట ఉపయోగించుకొని, కేవలం మనుగడ కోసం మాత్రమే మనసును వాడుకొని, విగిలిన సమయం అంతా వాటితో ఏమాత్రం ప్రమేయం లేని స్థితిలో ఉండగలగడమే ధ్యానం.

ఎవరి ప్రవృత్తిని బట్టి వాళ్ళు ఎక్కువగానో, తక్కువగానో పనులు చేస్తూ ఉంటారు. అవసరమైన కర్మను ఆచరించాలని, కానీ దాని ఫలితం మీద మనకు ఎటువంటి అధికారమూ లేదనీ భగవద్గీత ఉపదేశం. అయితే కర్మలు చేసుకుంటూ పోతూ... ఏ ఆసక్తీ లేకుండా ఉండడం అంత సులభమైన విషయం కాదు. అలాగే పనులు పెరిగిన కొద్దీ జీవితంలో ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయి. 'కర్మల దొంతరే జీవితమా? అసలు కర్మలే చేయకపోతే? లేదా తక్కువగా చేస్తే?' అనే ప్రశ్నలు తలెత్తుతాయి. మితంగా, మనుగడ కోసమే కర్మలు చేయడం ధ్యానంలోని అసలు కీలకం.

మిత కర్మ

మనం ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటాం. ఒకవేళ శరీరంతో ఏదీ చేయకపోయినా... మనసు ఆలోచిస్తూనే ఉంటుంది. ఆలోచనలు కర్మగా పరిణమిస్తాయి. కర్మలు అనుభవాలకు దారి తీస్తాయి. జ్ఞాపకాలుగా స్థిరపడతాయి. తిరిగి ఆలోచనలను ప్రేరేపిస్తాయి. కానీ పరిమితంగా పనులు చేసినప్పుడు... ఆలోచనల ఉత్పత్తి తగ్గిపోతుంది. మనో వ్యాపారం నెమ్మదిస్తుంది. వర్తమానంలో జీవించే అవకాశం ఉంటుంది. మితాహారం (పరిమితంగా తినడం), మిత భాషణం (అవసరమైనప్పుడే మాట్లాడడం) లాంటి సుగుణాల గురించి మనకు తెలుసు. వీటికి కొనసాగింపుగా ధ్యానాన్ని 'మిత చలనం' లేదా 'మిత కర్మ'గా చూడవచ్చు. అంటే అవసరమైన పనులు తప్పితే ఇంకేమీ చేయకపోవడం. భగవాన్ రమణ మహర్షికి తెలుగు బాగా తెలుసట. అప్పుడప్పుడు ఆయన తననుతాను 'పనిలేనివాడు' అని కాస్త వ్యంగ్యంగా అభివర్ణించుకొనేవారట. ఇది మనం అనుకొనే బద్ధకమో, సోమరితనమో కాదు. అహం పూర్తిగా నశించిన యోగులు ఉండే నిశ్చల ఆధ్యాత్మిక స్థితి. 'నేను, నా శరీరం, నా మనసు' అనే ఆలోచన పూర్తిగా అంతరించిన ఆత్మజ్ఞానులు ప్రత్యేకంగా ఏ క్రియలు చేయాల్సిన అవసరం లేదు. చేసేవాడే (కర్త) లేనప్పుడు ఇక పని (కర్మ) ఎక్కడిదీ?


ప్రకృతిపై భారం

అందరూ ప్రతి నిత్యం ఏదో ఒక పని చేస్తూనే ఉండాలి. ఏదో ఒక సంపద సృష్టి జరుగుతూనే ఉండాలి అనేది నేటి ఆర్థిక వ్యవస్థ మూల సూత్రం. అయితే, సాధారణంగా మనం ఏదైనా పని చేస్తున్నాం అంటే... ఏదో ఒక దాన్ని వినియోగిస్తున్నట్టు లేదా ఏదో ఒక దాన్ని ఉత్పత్తి చేస్తున్నట్టు. వీటిలో ఏది చేసినా ప్రకృతి మీద ఏదో విధమైన ప్రభావం ఉన్నట్టే, ఎంతో కొంత భారం పడుతున్నట్టే. కరోనా సమయంలో మనమందరం అనవసరమైన పనులు, ప్రయాణాలు మానుకోవలసి వచ్చినప్పుడు వాతావరణం ఎంత తేటపడిందో మనకు తెలుసు. కాలుష్యంతో నిండిన యమున లాంటి నదులు కూడా ఆ సమయంలో నిర్మలమైపోయాయి. ఇలా మిత కర్మ ఫలాలను తాత్కాలికంగానైనా చవిచూశాం. ప్రాచీన కాలంలో ఋషులు, మునులు ఏ అనవసర చలనం లేకుండా... అలా ధ్యానంలో ఉండిపోవడంలోని ఆంతర్యం, ప్రయోజనం... దీన్ని పరిశీలించినప్పుడు మనకు బోధపడుతుంది.

సరళ జీవనం

'ఇంకా పని చేయాలి, మరింత డబ్బు కూడబెట్టాలి, పిల్లలకు మరిన్ని ఆస్తులు, విలాసాలు సమకూర్చాలి' అనే ఆలోచన ఆధునిక కాలంలో ఎక్కువయింది. ఇన్ని పనులు చేసి, ఇంత కాలుష్యాన్ని పెంచి, ప్రకృతిమాతను ఇంత క్షోభ పెట్టి... మనం తృప్తిగా, ఆనందంగా ఉన్నామా? అంటే ఏదీ లేదు. మన డొల్ల జీవితాలలోని వెలితిని ఎలా పూడ్చుకోవాలో తెలియక... మళ్ళీ ఇంకేవో పనులు చేయడం, ఇంకా సంపదను సృష్టించడం, మరిన్ని వస్తువులను కొనడం లాంటివి చేస్తూనే ఉన్నాం. ఈ విషయవలయం నుంచి బయటపడకుండా... రోజూ ధ్యాన సాధన పేరుతో కాసేపు కళ్ళు మూసుకొని కూర్చోవడం వల్ల ఫలితం శూన్యం. ఈ యాంత్రిక జీవన శైలిని వదిలి, పరిమితంగా కర్మలను ఆచరిస్తూ, సరళమైన జీవనం గడపడమే నిజమైన ధ్యానం.

• ఈదర రవికిరణ్



సహజయోగ



వన భోజనాలు ఎందుకంటే...

ఆస్తులు, విలాసవంతమైన వస్తువులను సంపదగా చాలామంది భావిస్తూ ఉంటారు. కానీ సంపదకు మన పూర్వీకుల నిర్వచనం వేరు. వారు ఆ రోజుల్లోనే సంపదకు నిజమైన అర్థమేమిటనేది తెలుసుకున్నారు. తెలుసుకోవడమే కాకుండా... దాన్ని మన అనుభవంలోకి తీసుకురావడం కోసం అనేక ఆచారాలను, సంప్రదాయాలను ఏర్పరిచారు. దైనందిన జీవితంలో మనం వాటికి అలవాటు పడేలా చేశారు. ఆ విధంగా ఏర్పాటు చేసినవే కార్తిక మాస వనభోజనాలు. ప్రకృతి సంపదతో అలరారే వనంలో బంధుమిత్రుల కలయిక, అక్కడే వంటలు, ఆటలు, పాటలు, భోజనాలు, ఎటువంటి అరమరికలు లేని ఆహ్లాదకరమైన సామూహిక ఆనందం... కార్తీక మాసంలో వన సమారాధనలు ఉంటే గుర్తుకువచ్చేవి ఇవే. కానీ బయటకు సరదాగా కనిపించే ఈ వన భోజనాల వెనుక లోతైన ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఉన్నాయని తన ప్రవచనాలలో శ్రీ మాతాజీ నిర్మలాదేవి పేర్కొన్నారు అవేమిటో తెలుసుకుందాం.

ఆరోగ్యప్రదాయిని...

కార్తీక మాసంలో ఉసిరిచెట్టు కింద వనభోజనాలు చేస్తారు. ఉసిరి మన ఆరోగ్యానికి సంజీవని లాంటిది. ఈ కాలంలోనే ఉసిరి కాయలు బాగా కాస్తాయి. 'సి' విటమిన్ పుష్కలంగా ఉండే ఉసిరిని మనం రోజూ ఏదో ఒక రూపంలో తినాలి. ఇది మన జీర్ణ శక్తిని పెంచుతుంది. శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది. ఈ చెట్టు గాలి కూడా చాలా మంచిది. ఉసిరిలో ఒక్క ఉప్పదనం తప్ప మిగిలిన ఆరు రుచులూ ఉంటాయి. దీనిలో ఆమ్ల గుణం అంటే పులుపు ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే దీన్ని 'ఆమలకము' లేదా 'ఆమ్ల' అంటారు. కార్తీక మాసంలో ఉసిరికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంలో ఆరోగ్య రహస్యం దాగి ఉంది. ఈ నెల నుంచే శీతాకాలం మొదలవుతుంది. దగ్గు, జలుబుతో పాటు చలి కారణంగా ఇతర వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉంది. ఉసిరిని తినడం, ఉసిరి చెట్టు నీడన ఉండడం వల్ల ఆ దోషాల నివారణ జరుగుతుంది. వృద్ధాప్యాన్ని దరి చేరనివ్వని ఔషధ మొక్కలలో ఉసిరిని మించినది లేదని 'చరక సంహిత' పేర్కొంది.

సామాజిక బంధాలు పెరుగుతాయి...

వన భోజనాల వల్ల సమకూరే ప్రధానమైన ప్రయోజనం... సామూహిక జీవనం. సామూహిక జీవనాన్ని మానవులకు అలవాటు చేయడానికే శ్రీకృష్ణుడు భూమి మీద అవతరించాడంటారు పెద్దలు. ఆయన దైవికమైన తన వాక్చాతుర్యంతో... గోపాలునిగా, స్నేహితుడిగా తన చుట్టూ ఉన్నవారికి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగించాడు. ఒంటరిగా జీవించే వ్యక్తుల కన్నా... అందరితో కలిసి జీవించే వ్యక్తుల్లో అహంకారం, నిరాశ, నిస్పృహలు తక్కువగా ఉంటాయి. అహంకారం.. ఆధ్యాత్మిక పురోగతికి అతి పెద్ద అవరోధం. దాన్ని అధిగమించడానికి తేలికైన మార్గం.. అందరితో కలిసి హాయిగా నవ్వుకోవడం. వ్యక్తుల మధ్య ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే... వన భోజనాల వల్ల అవి తొలగిపోతాయి. సామరస్యం ఏర్పడుతుంది. ఒకరికోసం అందరూ... అందరికోసం ఒక్కరూ... ఇలా కలిసి సహకరించుకోవడం వల్ల వారి మధ్య ప్రేమపూరితమైన వాతావరణం ఏర్పడుతుంది. అహంకారాలు కరిగిపోతాయి. హృదయం విశాలం అవుతుంది. అలాంటి వాతావరణంలో పెరిగే పిల్లల మీద మంచి ప్రభావాన్ని చూపుతుంది. వారిలో సానుకూల దృక్పథం ఏర్పడడానికి దోహదపడుతుంది. అలాంటి పిల్లలు చక్కటి భద్రతా భావన కలిగి ఉంటారు. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం వారికి అలవడుతుంది. మానవుల సూక్ష్మ శరీరంలో... గొంతు భాగంలో ఉండే విశుద్ధ చక్రం... ఆకాశతత్వాన్ని కలిగి ఉంటుంది. సామూహిక జీవనం కలిగి ఉన్న వ్యక్తులలో అది చక్కగా అభివృద్ధి చెందుతుంది. దీనివల్ల సంభాషణా చాతుర్యం అలవడుతుంది. అందరితో సత్సంబంధాలు పెంచుకోగలుగుతాం.

ప్రకృతితో పరిచయం...

ఉద్యానవనంలోనైనా, వ్యవసాయ క్షేత్రంలోనైనా తిరుగుతున్నప్పుడు... అక్కడ ఉన్న మొక్కలు, చెట్లు, పువ్వులు మనల్ని పలకరిస్తున్నట్టు మమేకం అయిపోతాం. ఆ ఆనందం మరెక్కడా రాదు. పువ్వులను చూడండి... అవి ఎన్నో రంగుల మేళవింపు. ప్రతి చెట్టూ భిన్నమైన ఆకృతిలో ఉంటుంది. వీటిలో భగవంతుడికి ప్రీతిపాత్రమైనవి, అలంకారాలకు ఉపయోగించేవి ఉంటాయి. వాటిని, ఫలాలను, కూరగాయలను మన మనుగడ కోసమే భగవంతుడు సృష్టించాడు. వాటి గురించి, వాటి ప్రయోజనాల గురించి పిల్లలకు పరిచయం చెయ్యడానికి వన భోజనాలు చక్కటి అవకాశం. పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు, మనిషి స్వచ్ఛమైన గాలిని పీల్చుకొని ఆరోగ్యంగా జీవించడానికి చెట్లు ఎలా సహకరిస్తాయో, వాటిని ప్రేమగా ఎలా పెంచుకోవాలో పిల్లలకు అవగాహన కల్పించాలి. వన భోజనాలు ఆటపాటల కోసం, వినోదం కోసం, పిక్నిక్ లాంటి కాలక్షేపం కోసమే కాకుండా... పిల్లలకు విజ్ఞాన యాత్రలా, పెద్దలకు ఆధ్యాత్మిక యాత్రలా... వెరసి సామాజిక బంధాలను పెంచుకొనే ఒక మార్గంగా ఉండాలి.

పురాణ కథల్లో...

సూత మహాముని తన తోటి మునులతో కలిసి... ఉసిరిచెట్టు కింద వనభోజనాలు చేసినట్టు, ద్వాపర యుగంలో గోపాలురితో కలిసి శ్రీకృష్ణుడు వనభోజనాలకు వెళ్ళినట్టు పురాణాలలో ఉంది. గోవర్ధన పూజ జరపడం ద్వారా... దేవతల కన్నా మన చుట్టూ ఉన్న ప్రకృతిని ఆరాధించడం ముఖ్యమనే సందేశాన్ని శ్రీకృష్ణుడు ఇచ్చాడు. అలాగే గోవర్ధన గిరిని పైకి ఎత్తి... ఈ ప్రకృతి మనకు గొడుగులా ఏ విధంగా రక్షణను ఇస్తుందో చూపించాడు. ఈ గోవర్ధన పూజ కూడా కార్తీకమాసంలోని తొలిరోజున వస్తుంది.

కుండలినీ జాగృతి కోసం...

మన ప్రాచీన ఋషులు ఏర్పాటు చేసిన సంప్రదాయాలన్నీ మన సూక్ష్మ శరీరంలో కుండలినీ శక్తిని జాగృతం చేసుకోవడానికి ఉద్దేశించినవే. ఇలా జాగృతం చేసుకోవడానికి మనకు అందుబాటులో ఉన్న మార్గం సహజయోగ. ఈ సహజయోగ పద్ధతిలో ధ్యానం చేస్తూ... కుండలినీ శక్తిని, మన సూక్ష్మ శరీరంలో ఉన్న శక్తి కేంద్రాలను లేదా చక్రాలను అనుభూతి చెందినప్పుడు... మన సంప్రదాయాల వెనుక ఉన్న అసలైన అంతరార్థం మనకు బోధపడుతుంది. నుదుటిపై కుంకుమను ధరించడాన్ని ఉదాహరణగా తీసుకుంటే... అలా ధరించినప్పుడు మన సూక్ష్మ శరీరంలోని ఆజ్ఞాచక్రం చల్లబడుతుంది. అంతర్గత ప్రశాంతతను అనుభూతి చెందుతాం. అంతేకాదు... ఇది ఆజ్ఞా చక్రానికి రక్షణ కూడా కల్పిస్తుంది. కార్తిక మాసంలో చేసే వన భోజనాలు కూడా అలాంటి ఒక సంప్రదాయమే. 'సహజయోగ' అనే పదంలోనే సహజత్వం ఉంది. ఈ యోగాన్ని పొందడం సహజత్వానికి... అంటే ప్రకృతికి దగ్గరగా ఉండేవారికి చాలా సులభం. ఎందుకంటే మన లోపల ఉన్న షట్చక్రాలు... పంచభూతాల తత్త్వాలతో చాలా వేగంగా స్పందిస్తాయి. కృత్రిమమైన జీవనానికి అలవాటు పడినవారికి ఈ యోగం సిద్ధించడం చాలా కష్టమవుతుంది. కాబట్టి కనీసం ఏడాదికి ఒకసారి కార్తీక మాస వన భోజనాల ద్వారానైనా ప్రకృతి ఒడిలో సేదతీరితే... మనకు మనంగా ఏర్పరచుకున్న కృత్రిమమైన అవరోధాల నుంచి కొంతయినా విముక్తి పొందగలం.

డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



సద్బోధ

గురువు పుష్పంలా ఉండాలి...

హిమాలయాల్లో ఒక సాధువు ఉండేవాడు. అతను మహాత్మునిగా పేరు పొందాడు. ఎందరో ఆయనను దర్శించుకొనేవారు. వారిలో చాలామంది "మాకు దీక్ష ఇచ్చి ఉద్ధరించండి. ఈ జన్మాంతం మీకు శిష్యులుగా ఉంటాం" అని అభ్యర్థించేవారు. అలాంటివారిలో కొందరు రాజులు కూడా ఉండేవారు. కానీ ఆయన ఎవరికీ దీక్ష ఇచ్చేవాడు కాదు. అలా ఎన్నో సంవత్సరాలు గడిచాయి. సాధారణంగా గురువుల్లో ఎక్కువమంది తమ శిష్యుల సంఖ్య పెంచుకోవడానికీ, పేరు ప్రఖ్యాతులు పొందడానికి ప్రయత్నిస్తారు. ఆయన అలాంటివేవీ పట్టించుకోడు. దీంతో అసలైన జ్ఞానులు ఇలాగే ఉంటారని జనం ఆయనను మరింత ఎక్కువగా గౌరవించారు.

ఆయన ఎవరినీ శిష్యులుగా స్వీకరించలేదు కానీ... ఒక అనాథ బాలుణ్ణి పెంచుకొనేవాడు. ఒక రోజు ఆ బాలుణ్ణి పిలిచి "నువ్వు త్వరగా ఊర్లోకి వెళ్ళు. "గురువుగారు ఈ సాయంత్రమే దేహత్యాగం చేస్తారు. కాబట్టి మీరందరూ ఆలస్యం చేయకుండా రండి. ఆయన దీక్ష ఇస్తారు" అని పిలుచుకొని రా" అని చెప్పాడు.

ఇది విని ఆ బాలుడికి ఆశ్చర్యం కలిగింది. రాజులకు, పండితులకు, ధనికులకు సైతం దీక్ష ఇవ్వడానికి ఆయన నిరాకరించిన సంగతి అతనికి గుర్తుంది. కాబట్టి "అయ్యా! ఎలాంటి అర్హతలు ఉన్నవారిని పిలుచుకురమ్మంటారు?" అని అడిగాడు.

"ఎవరైనా పరవాలేదు. రావడానికి ఎవరు సిద్ధపడితే వారిని తీసుకురా. వెళ్ళు, వెళ్ళు అని గురువు త్వరపెట్టాడు.

ఆ బాలుడు సమీప గ్రామాలకు వెళ్ళి, కనిపించిన ప్రతి వారికీ ఈ విషయం చెప్పాడు. ఆ మధ్యాహ్నానికల్లా 13 మందిని వెంటబెట్టుకొని... గురువు ఆశ్రమానికి తీసుకువచ్చాడు. వారిలో ఒకడు జీవితం మీద విరక్తితో ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నాడు. మరొకడు దొంగ, ఇంకొకడు తాగుబోతు... అందరూ అలాంటివాళ్ళే. వారిని చూసి గురువు కోపంతో తనను కొడతాడేమోనని ఆ బాలుడు భయపడ్డాడు. కానీ 'ఎవరైనా పరవాలేదని ఆయనే చెప్పారు కదా!' అని ధైర్యాన్ని తెచ్చిపెట్టుకున్నాడు. వారిని తెచ్చిన సంగతి గురువుకు చెప్పగానే ఆయన "వాళ్ళను నా దగ్గరకు పిలుచుకురా. సూర్యాస్తమయం లోపల దీక్ష ఇవ్వాలి, ఎక్కువ సమయం లేదు" అని తొందరపెట్టాడు. తరువాత వాళ్ళందరికీ దీక్ష ఇచ్చాడు.




దీనికి వారు ఆశ్చర్యపోయారు. "గురువర్యా! మీరు ఇన్నేళ్ళూ ఎంతమంది బతిమాలినా దీక్ష ఇవ్వలేదు. శిష్యులుగా స్వీకరించలేదు. వాళ్ళందరికీ మీ శిష్యులయ్యే అర్హత లేదా? మాలో ఏ అర్హత చూశారు?" అని ప్రశ్నించారు.

అప్పుడు ఆయన నవ్వి "ఇన్నేళ్ళు నాకు దీక్ష ఇచ్చే అర్హత లేదు కాబట్టి ఇవ్వలేదు. ఈ రోజు ఉదయమే నాకు జ్ఞానోదయం అయింది. గురువు పుష్పంలా ఉండాలి. పొద్దున్నే వికసించి, సాయంత్రానికి వాడిపోయే పుష్పం లాంటివాణ్ణి నేను. ఒక పువ్వు 'నా సుగంధాన్ని పీల్చే అర్హత మీకుందా?' అని ప్రశ్నించకుండా... దాని దగ్గరకు వెళ్ళిన ప్రతి ఒక్కరికీ సుగంధాన్ని పంచుతుంది. అలాగే మీలో ఏ అర్హతా లేకపోయినా... జ్ఞానోదయం ద్వారా నాకు లభించిన దాన్ని మీకు పంచి, నా బరువు దించుకొని, ఈ లోకాన్ని వదిలి వెళ్ళాలని అనుకుంటున్నాను" అన్నాడు. ఆ తరువాత నేల మీద పడుక్కుని, ప్రశాంతంగా కన్ను మూశాడు.

• రాచమడుగు శ్రీనివాసులు

ఆలయ దర్శనం

అష్ట సోమేశ్వర ఆలయాలు



పవిత్రమైన కార్తీక మాసం సందర్భంగా తెలుగు ప్రాంతాల్లోని భక్తులు విరివిగా సందర్శించుకొనే క్షేత్రాల్లో అష్ట సోమేశ్వరాలయాలు విశిష్టమైనవి. రుద్రరూపుడైన ద్రాక్షారామంలో కొలువైన భీమేశ్వరుణ్ణి శాంతింపజేయడం కోసం... ఆ క్షేత్రానికి ఎనిమిది దిక్కుల్లో శివలింగ ప్రతిష్ఠ జరిగిందనీ, అవే అష్ట సోమేశ్వర ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయనీ స్థలపురాణాలు చెబుతున్నాయి. ఈ అష్ట లింగాలతోపాటు ద్రాక్షారామ భీమేశ్వరుణ్ణి దర్శించుకుంటే... శివానుగ్రహంతో పాటు చంద్రగ్రహ దోష నివారణ కూడా జరుగుతుందనేది భక్తుల విశ్వాసం. అలాగే వివిధ నక్షత్ర దోషాల నివారణకు కూడా ఈ ఆలయాల్లో పూజలు నిర్వహిస్తారు.



వాయవ్యం... సోమేశ్వరం

ద్రాక్షారామానికి 14 కిలోమీటర్ల దూరంలోని సోమేశ్వరంలో శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వర లింగం ఉంది. చంద్రుడు శివునికోసం తపస్సు చేసి, లింగ ప్రతిష్ఠ చేసిన ప్రదేశం కాబట్టి దీనికి 'సోమేశ్వరం' అనే పేరు వచ్చిందని స్థలపురాణం చెబుతోంది. ఈ ఆలయంలో శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ పర్వతవర్ధనీ సమేత బ్రహ్మేశ్వరస్వామి ఆలయాలతో పాటు సూర్యనారాయణుడు, కాలభైరవస్వామిని, క్షేత్రపాలకుడైన హనుమంతుణ్ణి దర్శించుకోవచ్చు. ఒకే పీఠంపై శివలింగం, బాలాత్రిపురసుందరీదేవి కొలువై ఉండడం విశేషం.




ఉత్తరం... వెల్ల

వశిష్ఠ మహర్షి ప్రతిష్ఠించినదిగా పురాణాలు పేర్కొంటున్న శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వర లింగం ద్రాక్షారామానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని వెల్ల గ్రామంలో ఉంది. ఈ ఆలయంలో సోమేశ్వర ఆలయం, క్షేత్రపాలకుడైన శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ఒకే ప్రాంగణంలో ఉంటాయి. ఇక్కడ కొలువైన నవగ్రహాలు, సీతారామస్వామి, శ్రీవేంకటేశ్వర స్వామి తదితర దేవతా మూర్తులను కూడా దర్శించుకోవచ్చు. ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున సోమేశ్వరుడికి, వేణుగోపాలునికి ఒకేసారి కళ్యాణోత్సవాలు నిర్వహిస్తారు.



ఈశాన్యం... పెనుమళ్ళ

ద్రాక్షారామానికి 10 కిలోమీటర్ల దూరంలోని పెనుమళ్ళలో... ఆత్రేయనదీ సాగర సంగమ తీరంలో శ్రీ పార్వతీ సమేత సోమేశ్వర ఆలయం ఉంది. ఈ ఆలయంలోని లింగాన్ని జమదగ్ని మహర్షి ప్రతిష్ఠించాడని చెబుతారు. శ్రీరాముడు క్షేత్రపాలకుడిగా ఉంటాడు. ఇక్కడి రావి చెట్టుని సంతానప్రాప్తి కోసం, వివిధ దోషాల నివారణ కోసం నాగప్రతిమలను భక్తులు పూజిస్తారు.





పడమర... వెంటూరు

తుల్యా నదీ సాగర సంగమం దగ్గర... వెంటూరులో శ్రీ పార్వతీ సమేత సోమేశ్వరుడు కొలువుతీరి ఉన్నాడు. ఈ ఆలయం ద్రాక్షారామానికి దాదాపు 14 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడి లింగం విశ్వామిత్ర ప్రతిష్ఠితం కాగా... క్షేత్రపాలకుడైన శ్రీదేవీ భూదేవీ సమేత కేశవ స్వామి ఆలయం, శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉన్నాయి. గణపతి, నందీశ్వరుడు తదితర దేవతా మూర్తులను కూడా ఈ ప్రాంగణంలో దర్శించుకోవచ్చు.



తూర్పు... కోలంక

ద్రాక్షారామానికి సుమారు 13 కిలోమీటర్ల దూరంలో... ఆత్రేయ నదికి సమీపంలోని కోలంకలో శ్రీ ఉమాసమేత సోమేశ్వరస్వామి వారి ఆలయం ఉంది. దీనితో పాటు క్షేత్రపాలకుడైన కేశవస్వామి గుడి కూడా అదే ప్రాంగణంలో ఉంది. ఈ ఆలయంలోని లింగాన్ని సూర్యుడు ప్రతిష్ఠించాడని చెబుతారు.

నైరుతి... కోరుమిల్లి

ద్రాక్షారామానికి 21కిలోమీటర్ల దూరంలో... పవిత్ర గోదావరీ తీరాన కోరుమిల్లిలో శ్రీ రాజరాజేశ్వరీ సమేత సోమేశ్వర స్వామి ఆలయం ఉంది. ఈ లింగాన్ని భరద్వాజ మహర్షి ప్రతిష్ఠించాడు. క్షేత్రపాలకుడైన శ్రీదేవీ భూదేవీ సమేత జనార్దన స్వామితో పాటు లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు కూడా ఈ ప్రాంగణంలో ఉన్నాయి. పశ్చిమ దిశగా ఉండే ఈ ఆలయంలోకి పశ్చిమ, తూర్పు ద్వారాల నుంచి ప్రవేశాలు ఉండడం విశేషం.





దక్షిణం... కోటిపల్లి

గౌతమీ నదీ తీరాన... ద్రాక్షారామానికి 11 కిలోమీటర్ల దూరంలోని కోటిపల్లిలో శ్రీ రాజరాజేశ్వరీ సమేత ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం ఉంది. క్షేత్రపాలకుడు శ్రీ సిద్ధి జనార్దన స్వామి. ఇక్కడ తెప్పోత్సవంతో సహా శివ కేశవులకు ఇద్దరికీ ఒకేసారి ఉత్సవాలు జరపడం విశేషం. ఈ లింగాన్ని అత్రి మహాముని ప్రతిష్ఠించాడని స్థల పురాణం చెబుతోంది.



ఆగ్నేయం... దంగేరు

దంగేరు శ్రీ ఉమా సోమేశ్వర స్వామి ఆలయం ద్రాక్షారామానికి 11 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీన్ని కశ్యప మహర్షి ప్రతిష్ఠించాడని ప్రతీతి. శ్రీ వేణుగోపాలస్వామి క్షేత్రపాలకుడైన ఈ ఆలయ ప్రాంగణంలో పలు దేవతామూర్తులు కొలువుతీరి ఉంటారు.

అక్రమాల దందా!

అమెరికాలోని పెట్టుబడిదారుల నుంచి అదానీ గ్రీన్ సంస్థ 17.5 కోట్ల డాలర్లు సేకరించింది. 'మేం అత్యంత పారదర్శక విధానాలు పాటిస్తాం. లంచాలు ఇవ్వడం, అవినీతిని ప్రోత్సహించడం వంటి చర్యలకు బహుదూరం' అని హామీ ఇచ్చింది. కానీ... ఇందుకు భిన్నంగా భారత్‌లో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలకు వందలకోట్ల రూపాయల లంచాలు ఇచ్చి ఒప్పందాలు కుదుర్చుకుంది.

2016లో అదానీ గ్రీన్‌కు ఒకే ఒక్క విద్యుదుత్పత్తి ప్లాంటు... అదీ 20 మెగావాట్ల సామర్థ్యంతో ఉండేది. 2018నాటికి రెండువేల మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించాలని అదానీ గ్రూప్ లక్ష్యంగా పెట్టుకుంది. 2020లో సెకీతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచంలోనే అత్యంత భారీ సౌర విద్యుత్తు టెండరు తమకు దక్కిందని, 2025 నాటికి 25వేల మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని అదానీ గ్రీన్ సంస్థ 2020 జూన్ 9న ఒక ప్రకటన విడుదల చేసింది.

సెకీ టెండరు దక్కినప్పటికీ... విద్యుత్ కొనుగోలుకు రాష్ట్రాల డిస్కమ్‌లు ముందుకు రాకపోవడంతో అదానీపై ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో... 'ఇన్‌సెంటివ్స్' (లంచాలు) ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలను 'మోటివేట్' చేయాలని 2020 చివర్లో అదానీ గ్రీన్ నిర్ణయించుకుంది. ఆ అవసరాన్ని, దానిని అమలు చేస్తున్న క్రమాన్ని అజూర్ పవర్ ప్రతినిధులకు సాగర్ అదానీ పలుమార్లు వివరించారు. లంచాల పంపిణీకి అంతర్గతంగా పలు రికార్డులు నిర్వహించారు.

లంచాలు పని చేయడం మొదలైంది కాబోలు! 'అడ్డంకులన్నీ తొలగిపోయాయి' అని 2021 మార్చిలో అదానీ గ్రీన్ ఒక ప్రకటన జారీ చేసింది.

\- అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ కమిషన్ (సెక్)



ఆమ్యామ్యాల అదానీ జగన్

జగన్ అదానీ లంచాల కహానీ



ముడుపుల గుట్టు.. రట్టు చేసిన అమెరికా

న్యూయార్క్ కోర్టులో కేసు

(మొదటి పేజీ తరువాయి)

అప్పట్లో అదానీ గ్రూప్ దక్కించింది. దీని ప్రకారం... రాష్ట్రాల డిస్కమ్‌లు 'సెకీ'తో ఒప్పందం చేసుకుంటే... అదానీ ప్లాంట్ల ద్వారా సౌర విద్యుత్తును సరఫరా చేస్తారు. అయితే... అదానీ కోట్ చేసిన ధరను చూసి డిస్కమ్‌లు బెంబేలెత్తాయి. ఒక్క ప్రభుత్వం కూడా సెకీతో ఒప్పందానికి ముందుకు రాలేదు. అవి కుదిరితే తప్ప ప్లాంట్లు ఏర్పాటు చేయలేరు. సొమ్ములు సంపాదించలేరు. ప్లాంట్ల ఏర్పాటు పేరుతో అప్పటికే భారీగా అప్పులు తెచ్చి, పెట్టుబడులు సమీకరించిన నేపథ్యంలో 'అదానీ'పై ఒత్తిడి బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో అదానీ గ్రూప్ 'లంచాల యాత్ర' మొదలుపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వాల్లోని కీలక వ్యక్తులను కలిసి లంచాలు ఆఫర్ చేసినట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి. ఇందులో... జగన్ జమానాలో జరిగిన సంఘటనల గురించి మరింత వివరంగా వెల్లడించాయి. "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌ను అదానీ పలుమార్లు స్వయంగా కలిశారు. 2021లో ఆగస్టు 7న జగన్‌తో అదానీ భేటీ అయ్యారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదరకపోవడంపై చర్చించారు. లంచాలు ఆఫర్ చేశారు. ఆ తర్వాత సెప్టెంబరు 12, నవంబరు 20 తేదీల్లోనూ వీరు సమావేశమయ్యారు" అని అమెరికా దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. జగన్‌తో అదానీ సమావేశాల తర్వాత ఒప్పందాలు ఖాయమైనట్లు అదానీ గ్రూప్ కంపెనీల్లో అంతర్గత సందేశాలు షేర్ చేసుకున్నారని అమెరికా స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ కమిషన్(ఎస్ఈసీ) కూడా తన దర్యాప్తులో ధ్రువీకరించింది. ఎఫ్‌బీఐ నేరుగా జగన్ పేరు/చీఫ్ మినిస్టర్ అనే పదాలు వాడకుండా... 'భారతీయ పౌరుడు' అని తెలిపింది. ప్రభుత్వంలోని ఆ కీలక వ్యక్తి, అదానీ తరచూ ఫోన్లో మాట్లాడుకున్నట్లు తన దగ్గర ఆధారాలు ఉన్నాయని పేర్కొంది. ఎస్ఈసీ మాత్రం ఏ మాత్రం మొహమాటానికి పోకుండా అదానీ కలిసింది ముఖ్యమంత్రినేనని, ఆ తర్వాతే కీలక నిర్ణయాలు ముందుకు వెళ్లినట్లు ఆధారాలు ఉన్నాయని పేర్కొంది. అదానీ పునరుత్పాదక విద్యుత్ సంస్థలైన అదానీ గ్రీన్, అజ్యూర్‌ల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను ఉటంకించింది. దాంతో రూ.1750 కోట్ల లంచం జగన్‌కే ముట్టిందని చెప్పకనే చెప్పింది.

కేసులు వీరిపైనే...

ఎఫ్‌బీఐ దర్యాప్తు ఆధారంగా అదానీ, మరో ఏడుగురు సహచరులపై ఐదు రకాల నేరారోపణలు చేస్తూ అమెరికా న్యాయశాఖ ఇటీవల అమెరికా న్యాయశాఖ న్యూయార్క్ న్యాయస్థానంలో అభియోగాలు నమోదు చేసింది. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో సీల్డ్ కవర్‌లో ఉంచిన అభియోగాలను బుధవారం పోలింగ్ ముగిశాక బహిర్గతం చేసింది. లంచాలు ఇవ్వడం, స్టాక్ మార్కెట్లో మోసానికి పాల్పడటం అనేవి వాటిలో ప్రధాన అభియోగాలు. ఈ అభియోగాల మీద కోర్టు గౌతమ్ అదానీ, ఆయన తమ్ముడి కుమారుడు సాగర్ అదానీల మీద అరెస్టు వారెంటు కూడా జారీ చేసింది. మరో పక్క అమెరికా స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ కమిషన్(ఎస్ఈసీ) కూడా గౌతమ్ అదానీ బృందం మీద దర్యాప్తు చేసి న్యూయార్క్‌లోని మరో కోర్టులో అభియోగాలు నమోదు చేసింది. రెండు కేసుల్లోనూ అదానీ,



ఆయన తమ్ముడి కుమారుడు, అదానీ గ్రీన్ ఎనర్జీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాగర్ అదానీ, అదానీ గ్రీన్ మాజీ సీఈవో రంజిత్ గుప్తా, ప్రస్తుత సీఈవో వినీత్ ఎస్.జైన్, అజూర్ పవర్ ప్రధాన వాటాదారు(53%) అయిన కెనడా పెన్షన్ ఫండ్ సీడీపీక్యూ అధికారి సిరిల్ క్యాబెన్స్, ఆ ఫండ్ భారతీయ ఉద్యోగులు సౌరభ్ అగర్వాల్, దీపక్ మల్హోత్రా, అజూర్ పవర్ మాజీ సీఈవో రూపేశ్ అగర్వాల్ మొత్తం ఎనిమిది మంది నిందితులుగా ఉన్నారు. వీరంతా విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. న్యాయశాఖది క్రిమినల్ కేసు కాగా, ఎస్ఈసీది సివిల్ కేసు. ఎస్ఈసీ కేసు నిరూపణ అయితే నిందితులను అమెరికా స్టాక్ మార్కెట్లలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండా, అమెరికా కంపెనీల్లో ఎలాంటి పదవులు చేపట్టకుండా నిలువరించడమే కాకుండా భారీగా జరిమానా విధిస్తారు. ముడుపులకు సంబంధించి, ఎవరికి ఎంత ఇచ్చారు, ప్రతిఫలంగా ఏం కాంట్రాక్టు పొందారు అనే ఆధారాలు సాగర్ అదానీ ఫోన్లో తమకు లభించాయని ఎఫ్‌బీఐ చెబుతోంది. ఆధారాలను ట్యాంపరింగ్ చేసే ప్రయత్నం చేయడం పైనా వీరిపై కేసులు నమోదయ్యాయి. అమెరికాతో వ్యాపార సంబంధం ఉన్న ఏ సంస్థ అయినా విదేశాల్లో అవినీతికి పాల్పడితే ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ ప్రకారం అమెరికాలో అది నేరమే. దీనికింద ఎఫ్‌బీఐ కేసు నమోదు చేసింది. 2021 సెప్టెంబరులో అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థ ప్రపంచవ్యాప్తంగా రూ.6,300 కోట్లు సమీకరించింది. అందులో, రూ.1500 కోట్లు అమెరికా నుంచి సమీకరించారు. భారతదేశంలో లంచాలు ఇచ్చి సంపాదించిన కాంట్రాక్టులను చూపిస్తూ అమెరికా గడ్డ నుంచి నిధులు సమీకరించారు కాబట్టి తాము దర్యాప్తు చేశామని ఎస్ఈసీ ప్రకటించింది. ఇవన్నీ ఆరోపణలు మాత్రమేనని అదానీ గ్రూప్ అంటోంది. వాటిని, ఎదుర్కొంటామని ప్రకటించింది. ఎఫ్‌బీఐ, ఎస్ఈసీ అభియోగాలు బయటకు రావడంతో కేసులు బయటకు రావడంతో స్టాక్ మార్కెట్లు కుప్ప కూలాయి. అదానీ కంపెనీల షేర్లు ఏకంగా 20 శాతం(2.24 లక్షల కోట్లు) నష్టపోయాయి. ఇతర షేర్ల మీద కూడా దీని ప్రభావం పడింది.

కేంద్ర ప్రభుత్వ సంస్థను అడ్డంగా పెట్టుకొని భారతదేశంలోని తన సౌరశక్తి ప్రాజెక్టుకు అమెరికా బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి వందల కోట్ల డాలర్లు సేకరించిన అదానీ, విద్యుత్‌ను అమ్ముకొనే కాంట్రాక్టులు సాధించుకొనే క్రమంలో లంచాలు చెల్లించిన విషయాన్ని దాచడాన్ని అమెరికా నేరంగా భావిస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని పారదర్శకంగా జరిగినట్లు చూపించుకొనేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)ని నామమాత్రంగా మధ్యలో ఉంచారని, రాష్ట్ర విద్యుత్ సంస్థలు సెకీతో, సెకీ అదానీ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పైకి కనిపిస్తున్నా నిజానికి రాష్ట్రాల విద్యుత్ సంస్థలతో మాట్లాడి, లంచాలిచ్చి ఒప్పందాలను ఖరారు చేసింది అదానీయేనని ఎఫ్‌బీఐ గుర్తించింది. గౌతమ్ అదానీ తమ్ముడి కుమారుడు సాగర్ అదానీ ఫోన్లో రాష్ట్రాల వారీగా లంచాలకు సంబంధించిన సమాచారం లభించినట్లు ఎస్ఈసీ అభియోగ పత్రంలో పేర్కొంది. సెకీని అవినీతికి అవకాశంగా వాడుకోవడం వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాల మీద నీలినీడలు అలముకొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఐదు రాష్ట్రాలతో ఒప్పందాలు

అదానీ గ్రూప్ 2020-2024 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, జమ్మూ కశ్మీరు రాష్ట్ర ప్రభుత్వాలతో సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వాలు సౌర విద్యుత్‌ను ప్రోత్సహించే ముసుగులో ముడుపులు తీసుకొని 20 ఏళ్ల వరకు అదానీ గ్రూప్ దగ్గరే విద్యుత్ కొనే విధంగా డిస్కమ్‌లతో ఒప్పందాలు చేయించాయన్నది అభియోగం. ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,750 కోట్ల ముడుపులకు బదులుగా ఏడు గిగావాట్ల సౌర విద్యుత్‌ను 26 ఏళ్ల పాటు కొనేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారన్నది అభియోగం. దాంతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యధిక సౌర విద్యుత్ కొంటున్న రాష్ట్రంగా మారింది. స్టాక్ మార్కెట్ లావాదేవీలను తారుమారు చేశారని హిండెన్ బర్గ్ నివేదికలో వెల్లడించిన తర్వాత అదానీపై ఇంత పెద్ద ఎత్తున ఆరోపణలు రావడం గమనార్హం.

రాజకీయ దుమారం

ఆరోపణలన్నీ నిరాధారమైనవని అదానీ గ్రూప్ ఖండించినప్పటికీ వివాదం చినికి చినికి గాలివానగా మారింది. అదానీని అరెస్టు చేయాలని కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్షాలన్నీ డిమాండ్ చేయగా, సోమవారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాలు స్తంభించిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. మోదీ-అదానీల మధ్య అవినీతి బంధం ఉందని ఎప్పటి నుంచో ఆరోపిస్తున్న కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ ఈ కుంభకోణంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) దర్యాప్తుకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. వీళ్లిద్దరి బంధం దేశానికి తీరని నష్టం చేస్తోందని మండిపడ్డారు. మోదీ అదానీకి జవాబుదారీతనం లేకుండా చేశారని, దేశంలో ఏ దర్యాప్తు కూడా అదానీ విషయంలో నిజాలు బయటపెట్టే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు.

'హయ్యర్ అఫిషియల్' ఎవరు?

ఆంధ్రప్రదేశ్‌లో 2019 మే నుంచి 2024 జూన్ వరకు ఉన్నతస్థానంలో ఉన్న హయ్యర్ అఫిషియల్‌కు అదానీ 'లంచం ప్రామిస్ చేశారు' అని అమెరికా దర్యాప్తు సంస్థలు తెలిపాయి. ఇది... పూర్తిగా జగన్ జమానా! దీంతో... ఆ 'హయ్యర్ అఫిషియల్' ఎవరనే చర్చ మొదలైంది. ఆ ఐదేళ్లలో ముగ్గురు సీనియర్ అధికారులు విద్యుత్ శాఖ బాధ్యతలు నిర్వహించారు. పూర్తిగా ఐదేళ్లు ఎవరూ లేరు. అయితే.. 'అఫిషియల్' అంటే అధికారంలో ఉన్నవారు అనే అర్థమని, ఐఏఎస్ అధికారులు కారని చెబుతున్నారు. ఆ ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించింది జగనే! డిస్కమ్‌ల నిర్ణయాలను సీఎం ఎలా ప్రభావితం చేశారో కూడా అమెరికా దర్యాప్తు సంస్థలు వివరించాయి. పైగా... నివేదికలో పలు మార్లు 'చీఫ్ మినిస్టర్' అని నేరుగానే ప్రస్తావించాయి. దీంతో... ఆ హయ్యర్ అఫిషియల్ మరెవరో కాదు, నాటి ముఖ్యమంత్రి జగనే అని ముక్తాయిస్తున్నారు.

అమెరికాతో అట్లుంటది

అదానీ గ్రీన్ ఎనర్జీ లంచాలు ఇవ్వడం కోసం... 'సౌర విద్యుత్తు ప్రాజెక్టు' పేరుతో అమెరికాలోని బ్యాంకులు, అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి 1500 కోట్ల పెట్టుబడులు సేకరించింది. అమెరికాలో పెట్టుబడులు సేకరించిన కంపెనీలు ఆ దేశంలోని 'ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ)' కిందకు వస్తాయి. ఈ చట్టం ప్రకారం ఏ దేశంలో లంచం ఇచ్చినా నేరం అవుతుంది. అదానీ ఈ నిధుల నుంచే కోట్లాది రూపాయలు లంచాలు ఇచ్చింది. అమెరికాలో ఈ చట్టం కిందే అదానీపై కేసు నమోదు చేశారు.

ఆంధ్రాలో లంచమిస్తే.. అక్కడ కేసులు

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లంచం ఎవరు ఇచ్చినా, ఎవరికిచ్చినా, ఎక్కడ ఇచ్చినా తప్పే. ఇచ్చినట్టు తేలితే కేసు పెట్టాల్సిందే. విచారణ జరగాల్సిందే. శిక్ష పడాల్సిందే. అయితే.. ఈ కేసు విషయంలో వచ్చే ప్రశ్న ఏంటంటే.. భారతీయుడైన అదానీ భారతదేశంలో సౌర విద్యుత్తు ఒప్పందాలకు సంబంధించి ఇక్కడి అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు లంచాలు ఇస్తే అమెరికాలో కేసు ఎందుకు నమోదైంది? ఆ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే ముందు ఈ విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో పార్టీలుగా ఉన్న కంపెనీల గురించి, ఆ ఒప్పందాల గురించి సవివరంగా తెలుసుకోవాలి. న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు తమ నేరారోపణ పత్రాల్లో పేర్కొన్న వివరాల ప్రకారం.. గౌతమ్ అదానీకి చెందిన గ్రీన్ ఎనర్జీ కంపెనీ, మారిషస్‌కు చెందిన అజూరే పవర్ కంపెనీ.. సెకీతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. వీటిలో అజూరే పవర్ కంపెనీ 2023దాకా న్యూయార్క్ స్టాక్ ఎక్ఛేంజ్‌లో లిస్టెడ్ కంపెనీగా ఉండేది. సెకీ నుంచి సౌర విద్యుత్తును కొనుగోలు చేయడానికి దేశంలోని ఏ రాష్ట్ర విద్యుత్తు సరఫరా సంస్థా ముందుకు రాలేదు. దీంతో అదానీ రంగంలోకి దిగి లంచాల దందాకు తెరతీసి.. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి చెందిన డిస్కమ్‌లను ఒప్పించినట్టు యూఎస్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఆ లంచాలు ఇవ్వడానికిగాను.. అదానీ గ్రీన్‌ఎనర్జీ 'సౌర విద్యుత్తు ప్రాజెక్టు' పేరుతో అమెరికాలోని బ్యాంకులు, అంతర్జాతీయ పెట్టుబడిదారుల నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు సేకరించింది. అయితే, కార్పొరేట్ కుంభకోణాలకు చెక్ పెట్టడం కోసం.. అమెరికా స్టాక్ ఎక్ఛేంజీల్లో నమోదైన (అమెరికా పెట్టుబడిదారుల ప్రమేయం ఉన్న) విదేశీ కంపెనీలు లంచాలు ఇవ్వడాన్ని, ఇస్తామని ఆశ పెట్టడాన్ని, వ్యాపార లబ్ధి కోసం విదేశీ ప్రభుత్వ పెద్దలకు లంచాలు ఇవ్వజూపడాన్ని నేరంగా పేర్కొంటూ అమెరికా ప్రభుత్వం 'ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సీపీఏ)' పేరిట 1977లో ఒక చట్టం చేసింది. సౌర విద్యుత్తు ప్రాజెక్టు పేరిట అమెరికాలో పెట్టుబడులు సేకరించిన నేపథ్యంలో.. అదానీ గ్రీన్ ఎనర్జీ, న్యూయార్క్ స్టాక్ ఎక్ఛేంజ్‌లో నమోదైన అజూరే కంపెనీ ఈ చట్టం కిందకి వచ్చాయి. అందుకే వారిపై కేసు నమోదైంది. కాగా.. అదానీ లంచాల దందాపై న్యూయార్క్ ప్రాసిక్యూటర్లతో పాటు అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ కమిషన్(ఎస్ఈసీ) కూడా వేరొక సివిల్ కేసు నమోదు చేసింది. అమెరికా పెట్టుబడిదారుల నుంచి అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ 175 మిలియన్ డాలర్లు (మన కరెన్సీలో రూ.1500కోట్లు) సేకరించినట్టు ఎస్ఈసీ ఆ కేసులో పేర్కొంది. తాము ఎవ్వరికీ లంచాలు ఇవ్వలేదని 2021 సెప్టెంబరులో తన కార్పొరేట్ బాండ్ల కొనుగోలు చేసిన పెట్టుబడిదారులకు అదానీ గ్రీన్ కంపెనీ చెప్పిందని.. కానీ, అది నిజం కాదని, గౌతం అదానీ, సాగర్ అదానీ వ్యక్తిగతంగా ఈ అవినీతిలో భాగమయ్యారని ఎస్ఈసీ విస్పష్టంగా వెల్లడించింది. అమెరికాలోని చట్టాల ప్రకారం విదేశాల్లోనూ ముడుపులు, లంచాలు ఇచ్చి వ్యాపారాలు చేయడం, కాంట్రాక్టులు పొందడం చట్ట విరుద్ధం. ఇందుకోసం దేశానికి చెందిన ఫోన్లను, వ్యవస్థలను వాడుకున్నా నేరమే. సంబంధిత కంపెనీలపై కేసు పెడతారు. అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ కమిషన్‌తో ద్వైపాక్షిక అవగాహన ఒప్పందం ఉన్న నేపథ్యంలో ఈ కేసులో సెబీ కూడా రంగంలోకి దిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా, నిబంధనలకు వ్యతిరేకంగా నిధుల సేకరణ, పెట్టుబడిదారులను మోసం చేయడం, ఆ దేశ టెలికామ్ వ్యవస్థను మోసం చేయడం, బాండ్ల జారీలో సెక్యూరిటీ యాక్టును ఉల్లంఘించడం, దర్యాప్తునకు విఘాతం కలిగించడం వంటి అభియోగాల కింద అదానీపై కేసులు నమోదయ్యాయి.

ఆ రాష్ట్రాల పేర్లూ..

- అదానీ లంచాల వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఒడిశా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, జమ్ముకశ్మీర్ పేర్లు
- గౌతమ్ అదానీని 'మిస్టర్ ఎ'గా.. 'ద బిగ్ మ్యాన్'గా పేర్కొంటూ ఎన్‌క్రిప్టెడ్ సందేశాలతో సమాచార సరఫరా
- నేరారోపణ పత్రాల్లో పేర్కొన్న అమెరికా ప్రాసిక్యూటర్లు



న్యూఢిల్లీ, నవంబరు 21: సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల నిమిత్తం అదానీ ఒక్క ఆంధ్రప్రదేశ్ 'ముఖ్యుడి'కే కాదు.. చత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు, జమ్ముకశ్మీర్ ప్రభుత్వ పెద్దలు/అధికారులకూ లంచాలు ఇచ్చినట్టు అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈ నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంతో 12 గిగావాట్ల సౌర విద్యుత్ ఒప్పందం కుదుర్చుకోవడానికి గౌతం అదానీ, మరో ఏడుగురు కలిసి.. 265 మిలియన్ డాలర్లు లంచంగా ఇచ్చినట్టు వారు వెల్లడించారు. ఈ లంచాలు ఇచ్చిన సమయమైన 2022 ఏప్రిల్ నాటికి ఈ సొమ్ము మన కరెన్సీలో రూ.2,029 కోట్లు అని వివరించారు. ఆ రూ.2029 కోట్లలోనూ.. 7 గిగావాట్ల ఒప్పందం నిమిత్తం ఒక్కో మెగావాట్‌కూ రూ.25 లక్షల చొప్పున మొత్తం 7000 మెగావాట్లకుగాను ఏపీ 'ముఖ్యుడి'కి రూ.1750 కోట్లు ఇచ్చినట్టు వెల్లడించారు. అలాగే.. 2021 జూలై-2022 నడుమ 5 గిగావాట్ల ఒప్పందాలకు సంబంధించిన మిగతా సొమ్మును (రూ.279 కోట్లు) మూడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వాల పెద్దలు/నేతలకు ఇచ్చినట్టు తెలిపారు. ఈ ఒప్పందాలు కుదుర్చుకున్నప్పుడు తమిళనాట డీఎంకే, ఒడిశాలో నవీన్‌పట్నాయక్ బిజూ జనతాదళ్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అధికారంలో ఉండగా.. జమ్ము కశ్మీర్ కేంద్ర పాలనలో ఉంది. వీటిలో ఒడిశా డిస్కమ్‌లు 500 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. కాగా.. ఈ లంచాల వ్యవహారంలో అదానీ తదితరులు సంకేత నామాల ద్వారా వ్యవహరించుకున్నారని.. సంకేత నిక్షిప్త (ఎన్‌క్రిప్టెడ్) సందేశాల ద్వారా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారని యూఎస్ ప్రాసిక్యూటర్స్ పేర్కొన్నారు. ఉదాహరణకు.. పరస్పరం రాసుకున్న లేఖల్లో వారు గౌతమ్ అదానీని 'న్యూమరో వన్' అని.. 'ద బిగ్ మ్యాన్' అని.. వినీత్ ఎస్.జైన్‌ను 'వి', 'స్నేక్', 'న్యూమరో యునో మైనస్ వన్' అనే పేర్లతోటి.. వ్యవహరించినట్టు తెలిపారు.

అదానీని అరెస్టు చేయాలి!

- మేం చెబుతున్నది నిజమని రుజువైంది
- సీఎంలనే అరెస్టు చేస్తున్నారు..వేల కోట్ల ఆరోపణలున్న అదానీ స్వేచ్ఛగా తిరుగుతారా?
- మోదీ అదానీకి రక్షణ కల్పిస్తున్నారు
- జేపీసీ వేయాల్సిందే:రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదైన అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అదానీని రక్షిస్తున్న సెబీ చెయిర్ పర్సన్ మాధబి పురీ బుచ్‌ను ఆ పదవి నుంచి తప్పించాలన్నారు. భారతదేశంలో విద్యుత్ ప్రాజెక్టులను దక్కించుకోవటానికి పలు రాష్ట్రాల్లో అధికారులకు అదానీ రూ.2,238 కోట్ల లంచాలు ఇచ్చారంటూ అమెరికాలో కేసు నమోదైన నేపథ్యంలో.. ఢిల్లీలో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌తో కలిసి రాహుల్ మీడియాతో మాట్లాడారు. అదానీ గురించి తాము ఇన్నాళ్లుగా చెబుతున్నది నిజమని అమెరికా అధికారుల ఆరోపణలు నిరూపించాయన్నారు. అదానీ భారత్‌లోనేగాక అమెరికాలోనూ చట్టాలను ఉల్లంఘించినట్లు స్పష్టమవుతోందని, అలాంటి వ్యక్తి బయట స్వేచ్ఛగా ఎలా తిరగగలుగుతున్నారో ఆశ్చర్యంగా ఉందన్నారు. స్వల్పమైన ఆరోపణలపై ఏకంగా ముఖ్యమంత్రులనే అరెస్టు చేస్తున్నప్పుడు.. రూ.2,200 కోట్ల అవినీతి ఆరోపణలు ఉన్న అదానీ స్వేచ్ఛగా ఎలా తిరుగుతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'ఏక్ హై తో సేఫ్ హై' అంటూ ఇటీవలి మహారాష్ట్ర ఎన్నికల్లో మోదీ చెప్పిన నినాదాన్ని ప్రస్తావిస్తూ.. అదానీ, మోదీ కలిసి ఉన్నంతకాలం వారు భారత్‌లో సేఫ్‌గానే ఉంటారని ఎద్దేవా చేశారు. సోమవారం నుంచి ప్రారంభమవుతున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో అదానీ అంశాన్ని ప్రతిపక్షాలు కలిసికట్టుగా లేవనెత్తుతాయని తెలిపారు. అదానీ అక్రమ లావాదేవీలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేయాలన్న విపక్షాల డిమాండ్‌ను రాహుల్ పునరుద్ఘాటించారు. ప్రధాని మోదీ అదానీని రక్షిస్తున్నారని, అందువల్లే రూ.2,000 కోట్ల అవినీతి కుంభకోణంలో ఉన్నప్పటికీ అదానీని అరెస్టు చేయబోరని, కనీసం దర్యాప్తు కూడా జరపరని రాహుల్ చెప్పారు. అయితే, ఈ విషయాన్ని తాము వదిలేయబోమని తేల్చి చెప్పారు.

విశ్వసనీయత కోల్పోయిన ప్రధాని

అదానీ మీద మీరు ఎన్ని ఆరోపణలు చేసినా అతడికి వ్యతిరేకంగా ప్రభుత్వం వైపు నుంచి ఏమీ జరగటం లేదు కదా అన్న విలేకర్ల ప్రశ్నకు రాహుల్ స్పందిస్తూ.. 'మేం లేవనెత్తుతున్న అంశాల వల్లనే ప్రధానమంత్రి తన విశ్వసనీయతను పూర్తిగా కోల్పోయారు. అదానీ, మోదీ ఒకటేనని యావత్ దేశానికి తెలిసింది. దీన్ని ఇంకా ముందుకు తీసుకెళ్తాం. ఇది రాజకీయ-ఆర్థిక-ప్రభుత్వ యంత్రాంగంతో కూడిన నెట్‌వర్క్. ఈ విషవలయం ఇప్పుడు యావత్ దేశాన్ని, దేశ రాజకీయ రంగాన్ని చుట్టుముట్టింది. దేశాన్ని గుప్పిట్లోకి తీసుకున్న అదానీ అన్నింటినీ నియంత్రిస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌లో ఉన్న ప్రతి ఒక్కరినీ బయటకీడుస్తాం. దీనికి మొట్టమొదటి ఉదాహరణ.. మాధవి బుచ్. మేం నింపాదిగా పని చేస్తూనే చివరికి ఈ నెట్‌వర్క్‌ను బద్దలు కొడతాం' అని స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడిన వారెవరైనా వారికి జైలుకు పంపాల్సిందేనన్నారు. అయితే, నిబంధనలకు అనుగుణంగా అదానీ పని చేస్తే తమకు ఎలాంటి సమస్య లేదని రాహుల్ తెలిపారు.

అంతర్జాతీయంగా దేశానికి అప్రతిష్ఠ: ఖర్గే

అదానీ గ్రూపుల పనితీరు, విదేశాల్లో వాటి పెట్టుబడులు, దేశంలో వివిధ సంస్థల ప్రతిష్ఠ మసకబారటం తదితర అంశాలపై సమగ్ర జేపీసీ దర్యాప్తు తక్షణావసరమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఎక్స్‌లో ఈ మేరకు ఒక పోస్ట్ పెట్టారు. భారతదేశానికి చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్తపై విదేశాల్లో అభియోగాలు రావటం అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను దెబ్బ తీస్తుందన్నారు. 'అవినీతి అధికారులు-రాజకీయ నేతలు- ఆశ్రిత పెట్టుబడిదారుల'తో మోదీ-అదానీ సృష్టించిన విష వలయం వల్ల దేశంలోని కోట్లాదిమంది పేద, మధ్యతరగతి ప్రజలు, చిన్న, మధ్యస్థాయి పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, స్టార్టప్‌లు, మదుపరులు తీవ్రంగా నష్టపోతున్నారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు.



సీబీఐ కేసు నమోదు చేయాలి: సీపీఎం

ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇవ్వటం అన్నది అవినీతి నిరోధక చట్టం కిందికి వస్తుందని, అది సీబీఐ పరిధిలో ఉంటుందని.. కాబట్టి, అదానీ మీద తక్షణం సీబీఐ కేసు నమోదు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. అదానీ అవినీతి అమెరికాలో రట్టు కావటం సిగ్గు చేటని పేర్కొంది. అదానీ మీద వచ్చిన ఆరోపణల్ని కేంద్రప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని, దర్యాప్తు జరిపించాలని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. అదానీ వ్యవహారం మీద ప్రధాని మోదీ సవివరమైన ప్రకటన జారీ చేయాలని తృణమూల్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

ఆ ఆరోపణలు పూర్తిగా నిరాధారం

మేం చట్టాలకు లోబడి నడుచుకుంటాం

- అభియోగాలపై అదానీ గ్రూపు ప్రకటన

న్యూఢిల్లీ, నవంబరు 21: సౌర విద్యుత్తు కాంట్రాక్టులు దక్కించుకునేందుకు పెద్ద మొత్తంలో లంచం ఇవ్వజూపారంటూ తమ సంస్థపై అమెరికా ప్రాసిక్యూటర్లు చేసిన ఆరోపణలను అదానీ గ్రూపు తోసిపుచ్చింది. సోలార్ పవర్ ప్రాజెక్టులు దక్కించుకోవడంలో భాగంగా అదానీ గ్రూపు దాదాపు రూ.2,238 కోట్ల లంచాన్ని భారత అధికారులకు ఇవ్వజూపిందన్న ఆరోపణలతో పాటు దాని గురించి పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారం ఇచ్చారంటూ అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. సంస్థ ఛైర్మన్ గౌతమ్ అదానీ సహా మరో ఏడుగురిపై కేసులు నమోదైనట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై అదానీ గ్రూపు స్పందించింది. అమెరికా న్యాయ శాఖ, సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ కమిషన్ అదానీ గ్రీన్ డైరెక్టర్లపై చేసిన ఆరోపణలన్నీ నిరాధారమైనవని సంస్థ అధికార ప్రతినిధి ఓ ప్రకటనలో కొట్టిపారేశారు. తమ సంస్థ చట్టాలకు లోబడి నడుచుకుంటుందని స్పష్టం చేశారు. అవి కేవలం నేరారోపణలు మాత్రమేనని గుర్తుచేశారు. దోషులుగా రుజువయ్యే వరకు నిందితులను నిర్దోషులుగానే భావించాల్సి ఉంటుందని తెలిపారు. పాలనా వ్యవహారాల్లో, పారదర్శకత విషయంలో అదానీ గ్రూపు ఎప్పుడూ అత్యున్నత ప్రమాణాలను పాటిస్తుందన్నారు. తమ సంస్థ కార్యకలాపాలు నిర్వహించే ప్రతిచోటా వీటిని పాటిస్తూ వస్తున్నామని తెలిపారు. చట్టాలను గౌరవిస్తూ, వాటికి లోబడి నడుచుకుంటున్నందున.. వాటాదారులు, భాగస్వాములు, ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై న్యాయపరంగా ముందుకెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. కాగా, అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ జారీ చేసిన 600 మిలియన్ డాలర్ల (రూ.5067 కోట్ల) బాండ్లను రద్దు చేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. అదానీ గ్రూపుపై అభియోగాలు రావడానికి కొద్ది గంటల ముందే ఈ బాండ్లు మూడు రెట్లు అధికంగా సబ్‌స్క్రైబ్ కావడం గమనార్హం. సంస్థపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అనుబంధ కంపెనీలు ప్రతిపాదిత బాండ్లను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు అదానీ గ్రీన్ ఎనర్జీ స్టాక్ ఎక్ఛేంజ్ ఫైలింగ్‌లో తెలిపింది.



గంధమాదన పర్వత సమీపంలో అదానీ మైనింగ్?

నిలదీసిన ఒడిశా విపక్షాలు

భువనేశ్వర్, నవంబరు 21: అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదు ప్రకంపనలు ఒడిశాలోనూ ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ రాష్ట్రంలోని పవిత్ర గంధమర్దన (గంధమాదన) పర్వతాల సమీపంలో ఆ సంస్థ భూములు కొనుగోలు చేయడంపై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. బర్‌గఢ్, బలాంగిర్ జిల్లాలతో కూడిన ఆ ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలకు యోచిస్తున్నారా అని విపక్ష బిజూ జనతాదళ్ (బీజేడీ), కాంగ్రెస్ పార్టీలు గురువారం నిలదీశాయి. అయితే అలాంటిదేమీ లేదని.. అటవీకరణతో స్థానిక పర్యావరణాన్ని మెరుగుపరచడం కోసమే భూములు కొన్నామని.. ఇందులో వాణిజ్యపైన ఉద్దేశాలేమీ లేవని అదానీ గ్రూపు వివరణ ఇచ్చింది. బీజేడీ అధికారంలో ఉండగా.. గంధమాదన పర్వత ప్రాంతాన్ని నిరుడు జీవవైవిధ్య వారసత్వ ప్రాంతంగా ప్రకటించారు. ఈ పర్వతాల్లో 207 మిలియన్ టన్నుల బాక్సైట్ గనులు ఉన్నట్లు అంచనా. దీని సమీపంలో అదానీ భూములు కొనడంలోని ఆంతర్యమేంటో రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని బోలంగీర్ బీజేడీ ఎమ్మెల్యే కలికేశ్ డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కొట్టిపారేశారు. ఇక్కడ మైనింగ్ యోచనే లేదని స్పష్టంచేశారు. మైనింగ్ కోసం అంగుళం భూమి కూడా ఇవ్వబోమని బీజేపీ ఎంపీ ప్రదీప్ తేల్చిచెప్పారు. మరోవైపు.. మైనింగ్ ఆరోపణలను అదానీ గ్రూపు ఖండించింది.

అదానీతో బీజేపీ, కాంగ్రెస్ అనుబంధం దేశానికే అవమానం: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు.. భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడు.. అదానీలాంటి దగాకోరుకు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతులు ఇచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. 'తెలంగాణ ఆస్తులను కొల్లగొట్టే కుయుక్తుల్లో మీ బడే భాయ్ వాటా.. మీ అదానీ భాయ్ వాటా.. మీ హైకమాండ్ వాటా ఎంత?' అని పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డిని 'ఎక్స్'లో ప్రశ్నించారు. అదానీతో బీజేపీ, కాంగ్రెస్ అనుబంధం దేశానికే అవమానం, అరిష్టమని, అవి అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

అదానీకో న్యాయం ఆడబిడ్డకో న్యాయమా ?: కవిత

అఖండ భారతంలో అదానీకో న్యాయం, ఆడబిడ్డకో న్యాయమా? అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఆధారాలు లేకున్నా ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేయడం ఈజీ, ఆధారాలున్నా అదానీని అరెస్ట్ చేయడం కష్టమా? అని అడిగారు.

లోకం తీరు



ముడుపుల ముడి వీడింది!

మూడేళ్ల కిందటే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'.. ఇప్పుడు నిర్ధారించిన అమెరికా సంస్థలు

- నాడు 'సెకీ' టెండరు దక్కించుకున్న అదానీ
- ధర చూసి రాష్ట్ర ప్రభుత్వాలు బెంబేలు
- విద్యుత్ కొనుగోలుకు ముందుకురాని డిస్కమ్‌లు
- కానీ... ఏపీలో తలుపులు తెరిచిన జగన్
- రాష్ట్ర టెండర్లు రద్దు చేసి.. సెకీ పవర్‌కు సై
- అదానీ కలిసిన 4 రోజులకే కేబినెట్‌లో ఆమోదం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అదానీ గ్రూప్ పంచిన 2029 కోట్ల లంచాల్లో నాటి జగన్ సర్కారు వాటానే రూ.1750 కోట్లు! ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెకీ ద్వారా 7వేల మెగావాట్ల అదానీ విద్యుత్తు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఒక్కో మెగావాట్‌కు రూ.25 లక్షల చొప్పున లంచం! 7వేల మెగావాట్లకు... రూ.1750 కోట్లు! ఇది... అమెరికా దర్యాప్తు సంస్థలు తేల్చిన లెక్క..!

పోర్టులు అదానీకి సమర్పయామి! ప్రాజెక్టులూ అదానీకే అప్పగింత! చివరికి... సోలార్ పవర్ కూడా అదానీదే! జగన్ జమానాలో అదానీదే రాజ్యం! ఇప్పుడు వీరిద్దరి అక్రమ బంధాన్ని అమెరికా దర్యాప్తు సంస్థలు ఇప్పుడు బయటపెట్టాయి. కానీ... 'ఆంధ్రజ్యోతి' మూడేళ్ల కిందటే... 2021 సెప్టెంబరు 22వ తేదీనే తెరవెనుక గుట్టు రట్టు చేసింది! 12వేల మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలుకు ఏ రాష్ట్రమూ ముందుకు రాని పరిస్థితుల్లో... దిక్కుతోచని స్థితిలో ఉన్న 'అదానీ'కి జగన్ తలుపులు తెరవడం వెనుక జరిగిన తతంగం ఇప్పుడు బయటపడింది. "భారత సౌర విద్యుత్ కార్పొరేషన్ (సెకీ)తో అదానీ ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ.. అప్పటికే సౌర విద్యుత్తు ధర బాగా పడిపోతోంది. ఈ నేపథ్యంలో అదానీ నుంచి భారీ ధరతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకునేందుకు రాష్ట్రాలేవీ ముందుకు రాలేదు. దీంతో... అదానీ గ్రూప్ ఆయా రాష్ట్రాలకు లంచాలు ఎరవేసింది. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని అదానీ వ్యక్తిగతంగా కలిశారు. ఆ తర్వాతే ఏడువేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఏపీతో ఒప్పందం కుదిరింది" అని అమెరికా దర్యాప్తు సంస్థలు ఇప్పుడు వెల్లడించాయి. అచ్చంగా ఇవే వివరాలతో 2021 సెప్టెంబరు 22న 'ఆంధ్రా సూరీడు అదానీ' శీర్షికతో ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆ ఏడాది సెప్టెంబరు 12వ తేదీన అదానీ తాడేపల్లికి వచ్చి జగన్‌తో రహస్య సమావేశం జరిపారు. ఆ తర్వాత నాలుగు రోజులకు... అంటే సెప్టెంబరు 16వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'సెకీ' ద్వారా విద్యుత్ కొనుగోలుకు ఆమోద ముద్ర పడింది. గతంలో 6600 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా పిలిచిన టెండర్లను రద్దు చేసి మరీ జగన్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. యూనిట్ సౌర విద్యుత్తు ధర రూ.2కు పడిపోయే అవకాశాలున్న నేపథ్యంలో... అదానీ నుంచి విద్యుత్తు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వాలేవీ ముందుకు రాలేదని 'ఆంధ్రజ్యోతి' అప్పుడే వెల్లడించింది. సెకీతో ఒప్పందం చేసుకుని నెలలు గడుస్తున్నా రాష్ట్రాలతో పీపీఏలు కుదరకపోవడం, ప్లాంట్ల ఏర్పాటు కోసం అదానీ గ్రూప్ రాష్ట్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయడం, ఆ సమయంలో ఏపీలో ఉన్న జగన్ సర్కారు అదానీకి 'తలుపులు' తెరవడం వంటి వివరాలన్నీ 'ఆంధ్రజ్యోతి' అప్పుడే రాసింది. వీటి వెనుక 'ముడుపుల మూటలు' ఉన్నట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు ఇప్పుడు వెల్లడించాయి.

'పవర్'ఫుల్ లంచాలు...

అమెరికాకు చెందిన అజ్యూర్ పవర్ 4 గిగావాట్లు, తాను 8 గిగావాట్లు... మొత్తం 12 గిగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్తు సరఫరాపై 'సెకీ'తో అదానీ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో ఏకంగా 7వేల మెగావాట్లు కొనుగోలు చేసేందుకు జగన్ అంగీకరించడం గమనార్హం. రైతులకు 9 గంటల పాటు పగటిపూట ఉచిత విద్యుత్తు ఇవ్వడం కోసమే సెకీతో పాతికేళ్లకు విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకున్నామని శాసనసభలో, బయటా ముఖ్యమంత్రి హోదాలో జగన్ గొప్పగా ప్రకటించారు. 2021 డిసెంబరు ఒకటో తేదీన సెకీ ద్వారా 7000 మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. యూనిట్ విద్యుత్తు ధర రూ.2.49. భారతదేశంలో మరే రాష్ట్రమూ ఇంత ధర చెల్లించేందుకు అంగీకరించలేదు. నిజానికి... వ్యవసాయ విద్యుత్తు పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏపీ రూరల్ అగ్రికల్చరల్ సప్లై కంపెనీ (ఏపీ రాస్కామ్)ను స్థాపించింది. సెకీతో ఈ సంస్థే సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. కానీ... జగన్ సర్కారు డిస్కమ్‌లను రంగంలోకి దించింది. దీని వెనుక ఏదో మర్మం దాగుందని అప్పుడే అనుమానాలు తలెత్తాయి.



జగన్, ఆదానీ సంబంధాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాల్లో కొన్ని




కరెంటు 'పోయింది'

సెకీతో రాష్ట్ర డిస్కమ్‌లు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఈ ఏడాది సెప్టెంబరుకే 3000 మెగావాట్ల విద్యుత్తును రాష్ట్రానికి అదానీ సరఫరా చేయాలి. ఇప్పటిదాకా ఆ దిశగా అడుగులు పడలేదు.

వేల కోట్ల షాకులు...

యూనిట్ సౌర విద్యుత్తు రూ.2.49కు కొనుగోలు చేసేలా 'సెకీ'తో ఒప్పందం కుదిరింది. దేశంలో మరే రాష్ట్రమూ ఇంత రేటు పెట్టేందుకు సిద్ధపడలేదు. అప్పటికి గుజరాత్‌కు సెకీ యూనిట్‌కు రూ.1.99కే విద్యుత్ సరఫరా చేస్తోంది. అంటే.. ఏపీలో యూనిట్‌కు 50 పైసలు అదనం. పైగా... అదనంగా ఎలాంటి ట్రాన్స్‌మిషన్ చార్జీలూ ఉండబోవని నాడు జగన్ వెల్లడించారు. కానీ.. యూనిట్‌కు 80 పైసలు కట్టాల్సిందే అని 'సెకీ' ఇప్పుడు చెబుతోంది. దీని భారం రూ.42 వేల కోట్ల దాకా ఉంటుందని ఇంధనశాఖ చెబుతోంది.

'అక్రమ బంధం'పై ఏపీ సీఎం సమీక్ష



'జగన్-అదానీ' అక్రమ బంధం అంతర్జాతీయ స్థాయిలో రచ్చకెక్కింది. ఇది రాష్ట్రంలో తీవ్ర సంచలనం సృష్టించింది. జగన్ సర్కారు 'సెకీ'తో 7వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు కుదుర్చుకున్న ఒప్పందంపై గురువారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఆ శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష నిర్వహించారు. ఒకటి రెండు రోజుల్లో పూర్తి వివరాలు తెలుసుకుని... తదుపరి నిర్ణయం తీసుకోవాలని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం.

8 మంది ఎవరంటే ?

భారత్‌లో భారీ సౌర విద్యుత్తు ప్రాజెక్టును దక్కించుకునేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, మరో ఏడుగురితో కలిసి అధికారులకు లంచాలు ఇవ్వజూపిన వ్యవహారం దేశంలో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ మేరకు అమెరికా దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అభియోగాలు మోపడం సంచలనంగా మారింది. బ్యాంకులు, పెట్టుబడిదారులకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధులు సమీకరించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపించడం వ్యాపార, రాజకీయ వర్గాల్లో దుమారం సృష్టిస్తోంది. మరి అదానీతో పాటు వారి నేపథ్యం ఏమిటి?

గౌతమ్ అదానీ


1

ప్రపంచంలోనే 18వ అత్యంత ధనవంతుడు. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం రూ.7.17 లక్షల కోట్ల (85 అమెరికన్ బిలియన్ డాలర్లు) ఆస్తి ఈయన సొంతం. 1962లో గుజరాత్‌లోని జన్మించారు. 16వ ఏటనే చదువుకు స్వస్తి చెప్పారు. కమోడిటీస్ ట్రేడింగ్ సంస్థగా 1988లో అదానీ గ్రూప్‌ను స్థాపించారు. ప్రస్తుతం విద్యుత్తు, షిప్పింగ్, ఇంధన, మైనింగ్ వంటి పలు రంగాలకు విస్తరించింది.

సాగర్ అదానీ


2

గౌతమ్ అదానీ తమ్ముడు, అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ రాజేష్ అదానీ కుమారుడీయన. సాగర్.. అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో డిగ్రీ పూర్తయ్యాక 2015లో అదానీ గ్రూప్‌లో చేరారు. కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం.. అదానీ గ్రూప్ గ్రీన్ ఎనర్జీ (పవన్, సౌర విద్యుత్తు) రంగాల్లో అభివృద్ధి వెనుక ఉన్నది సాగర్. ఈ సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.

వినీత్ జైన్


4

అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు ఎండీ, సీఈవో. 15 ఏళ్లుగా అదానీ సంస్థలో పనిచేస్తున్నారు. ఇంధన, మౌలిక వసతుల రంగ వ్యాపారాల్లో అనేక కీలక ప్రాజెక్టుల్లో ప్రభావవంతమైన పాత్ర పోషించారు.

సిరిల్ కాబేన్స్


3

ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ పౌరసత్వం ఉన్న ఈయన సింగపూర్‌లో నివసిస్తున్నారు. అజూర్ పవర్ గ్లోబల్ మాజీ డైరెక్టర్. కెనడా సంస్థాగత పెట్టుబడిదారు సంస్థ సీడీపీక్యూలో పనిచేశారు. 2016-23 మధ్య సీడీపీక్యూలో ఆసియా, పసిఫిక్, పశ్చిమాసియా వ్యవహారాల ఎండీగా వ్యవహరించారు. 2017 జనవరి నుంచి గత ఏడాది అక్టోబరు దాకా కంపెనీ బోర్డులో నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్.

రంజిత్ గుప్తా


5

అజూర్ పవర్ గ్లోబల్ మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) ఈయన. ప్రస్తుతం ఇంధన సంస్థ ఓసియోర్ ఎనర్జీకి సీఈవోగా ఉన్నారు.

రూపేష్ అగర్వాల్


6

అజూర్ పవర్ గ్లోబల్‌కు మాజీ చీఫ్ స్ట్రాటజీ- కమర్షియల్ ఆఫీసర్. 2022 జూలై-ఆగస్టు సమయంలో ఈ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) రెన్యూవబుల్ ఎనర్జీ సీఈవో కౌన్సిల్‌కు కో చైర్‌గా ఉన్నారు.

సౌరభ్ అగర్వాల్


7

భారత్‌కు చెందిన ఈయన కెనడియన్ ఇన్వెస్టర్ సంస్థ సీడీపీక్యూలో 2018 నుంచి 2023 అక్టోబరు వరకు పనిచేశారు.

దీపక్ మల్హోత్రా


8

ఈయన కూడా సీడీపీక్యూలో విధులు నిర్వర్తించారు. సిరిల్ కాబేన్స్‌కు 2017 మే నుంచి 2023 వరకు రిపోర్ట్ చేశారు.

ఆ 4 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో లేదు!

నాడు ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్.. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వాలు ఉన్నాయి

- 'అదానీ' లంచాలకు కాంగ్రెసే సమాధానం చెప్పాలి
- మోదీ ప్రతిష్ఠను దెబ్బతీయడమే రాహుల్ లక్ష్యం
- 2002 నుంచీ నిరాధార ఆరోపణలు చేస్తూనే ఉన్నారు
- రాహుల్ గాంధీపై ధ్వజమెత్తిన బీజేపీ



న్యూఢిల్లీ, నవంబరు 21: అదానీ గ్రూపుపై అమెరికాలో కేసు నమోదైన వ్యవహారంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై చేసిన ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. అదానీ గ్రూపుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై ఘాటుగా స్పందించింది. అమెరికా కోర్టు పేర్కొన్న నాలుగు రాష్ట్రాల్లో ఒక్క చోట కూడా బీజేపీ ప్రభుత్వం అధికారంలో లేదని గుర్తుచేసింది. మోదీ ప్రతిష్ఠను దెబ్బ తీయడమే లక్ష్యంగా రాహుల్, సోనియాలు 2002 నుంచీ ఆయనపై ఆరోపణలు చేస్తూనే ఉన్నారంది. గురువారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ అధికార ప్రతినిధి, ఎంపీ సంబిత్ పాత్రా మాట్లాడుతూ.. రాహుల్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమెరికా కోర్టులో అదానీ కంపెనీపై అభియోగాలు మోపారని.. వాటికి ఆ కంపెనీయే సమాధానం ఇచ్చుకుంటుందని చెప్పారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ చేస్తున్న ఆరోపణలను కొట్టిపారేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. రూ.2238 కోట్ల లంచం ఇవ్వజూపారంటూ అమెరికా కోర్టు పేర్కొన్న రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, ఒడిసా, ఛత్తీస్‌గఢ్, తమిళనాడుల్లో బీజేపీయేతర పార్టీలే అధికారంలో ఉన్నాయని పాత్రా గుర్తుచేశారు. ఆ సమయంలో ఛత్తీస్‌గఢ్, తమిళనాడుల్లో కాంగ్రెస్, దాని మిత్రపక్ష పార్టీలే అధికారంలో ఉన్నాయని చెప్పారు. ఇక ఏపీలో వైసీపీ, ఒడిసాలో బీజేడీ అధికారంలో ఉన్నాయని.. ఆ రెండు ప్రాంతీయ పార్టీలు జాతీయ స్థాయిలో అధికార, ప్రతిపక్ష కూటముల్లో భాగస్వాములుగా లేవని తెలిపారు. గౌతమ్ అదానీ అవినీతిపరుడని ఆరోపిస్తున్న రాహుల్ గాంధీ.. తొలుత కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టిన అదానీ గ్రూప్‌కు, తన పార్టీకి మధ్య ఉన్న సంబంధాలపై ప్రశ్నించాలని సూచించారు. మీడియా సమావేశాలు పెట్టి ఆరోపణలు చేయడం కంటే తప్పు జరిగినట్లు నిజంగా రాహుల్ నమ్మితే కోర్టులను ఆశ్రయించి కేసులు పెట్టొచ్చు కదా? అని పాత్రా అన్నారు. అదానీ కంపెనీ తమిళనాడులో రూ.45 వేల కోట్ల పెట్టుబడులు పెట్టిందని, ఇటీవలే తెలంగాణలో స్కిల్స్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు విరాళంగా ఇచ్చిందని గుర్తుచేశారు. అదానీ అవినీతిపరుడైతే కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎందుకు ఆయన కంపెనీ నుంచి పెట్టుబడులు కోరుకుంటున్నాయని నిలదీశారు. రాహుల్ భారతదేశ ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని అసంబద్ధ ఆరోపణలు చేయడం వల్ల గురువారం స్టాక్ మార్కెట్‌లో 2.5 కోట్ల మంది మదుపరులు భారీగా సొమ్ములు కోల్పోయారని ఆరోపించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాహుల్ కొత్త డ్రామాకు తెరలేపారని ధ్వజమెత్తారు. ఈ అంశాన్ని అడ్డుపెట్టుకొని పార్లమెంటు సమావేశాలకు అంతరాయం కలిగించాలని చూస్తున్నారని విమర్శించారు. "అమెరికా ప్రాసిక్యూటర్లు చేసిన నేరారోపణల ప్రకారం.. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ)కు 12 గిగావాట్ల విద్యుత్తు సరఫరా చేసేందుకు భారత కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. విద్యుత్తు సరఫరా ఖర్చుతో కూడుకున్న పని కావడంతో రాష్ట్రాల కంపెనీలు కొనుగోలుకు ఆసక్తి చూపించలేదు. దీంతో అదానీ గ్రూప్ 2021 జూలై నుంచి 2022 ఫిబ్రవరి మధ్య ఒడిసా, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు 265 మిలియన్ డాలర్లు ముట్టజెప్పింది. ఆ సమయంలో ఈ నాలుగు రాష్ట్రాల్లో బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నాయి. ఆరోపణలు చేసే ముందు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఈ లంచాలకు సమాధానం చెప్పాలి" అని బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయ డిమాండ్ చేశారు.

అదానీతో ఒప్పందాలు

రద్దు చేసుకున్న కెన్యా

అవినీతిపై పక్కా సమాచారంతోనే ఈ నిర్ణయం

అదానీ చేజారిన 30 ఏళ్ల ఎయిర్‌పోర్టు నిర్వహణ, 6220 కోట్ల విద్యుత్ డీల్

నైరోబీ, నవంబరు 21: అమెరికా ఆరోపణల నేపథ్యంలో.. గౌతమ్ అదానీతో గతంలో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నట్లుగా కెన్యా ప్రకటించింది. 'అదానీ అవినీతికి సంబంధించి దేశంలోని దర్యాప్తు సంస్థలు, భాగస్వామ్య దేశాలు అందించిన కొత్త సమాచారం ఆధారంగా.. అదానీ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని నిర్ణయించాం' అని కెన్యా అధ్యక్షుడు విలియం రూటో గురువారం తమ పార్లమెంటు సంయుక్త సమావేశంలో వెల్లడించారు. అయితే, ఆయన తన ప్రకటనలో అమెరికా ప్రస్తావన చేయలేదు. అవినీతి జరిగినట్లుగా తిరుగులేని సాక్ష్యాధారాలున్నాయని.. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. ఈ మేరకు దేశ రాజధాని నైరోబీలో 'జోమో కెన్యట్టా అంతర్జాతీయ విమానాశ్రయం' (జేకేఐఏ) విస్తరణకు సంబంధించి కొనసాగుతున్న సేకరణ ప్రక్రియలను తక్షణం రద్దు చేయాలని రవాణా, ఇంధనం, పెట్రోలియం మంత్రిత్వశాఖలను ఆదేశిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు, ఇటీవలే అదానీ గ్రూపుతో కెన్యా విద్యుత్ పంపిణీ సంస్థ కుదుర్చుకున్న ఒప్పందాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అయితే, ఇవి కీలకమైన ప్రాజెక్టులు కాబట్టి, వాటి అమలుకు వీలైనంత త్వరలో వేరే భాగస్వాములను ఎంపిక చేసుకోవాలని ఆయా శాఖలను ఆదేశించినట్లు వెల్లడించారు. రూటో ఈ ప్రకటన చేయగానే.. పార్లమెంటు సభ్యులు కుర్చీల్లోంచి లేచి నిలబడి కొద్దిసేపు కరతాళ ధ్వనులు చేశారు. ఇద్దరు ఎంపీలైతే డ్యాన్స్ చేయటం లైవ్ దృశ్యాల్లో కనిపించింది.

ఇవీ ఆ కాంట్రాక్టులు!

జేకేఐఏ విస్తరణ పనుల కాంట్రాక్టును అదానీ గ్రూపు గతంలో దక్కించుకుంది. దీంట్లో భాగంగా ఎయిర్‌పోర్టు రన్‌వే విస్తరణ, కొత్త టెర్మినళ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. వీటికిగాను ఆ ఎయిర్‌పోర్టు నిర్వహణను అదానీ కంపెనీకి 30 ఏళ్లపాటు లీజుకిస్తారు. అయితే, అదానీతో ఒప్పందాన్ని ఎయిర్‌పోర్టు సిబ్బంది వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు, కెన్యా ట్రాన్స్‌కోతో 73.6 కోట్ల డాలర్ల (రూ.6,220 కోట్ల) విలువైన విద్యుత్ లైన్ల నిర్మాణం కాంట్రాక్టును కూడా అదానీ సంస్థ గత నెలలో దక్కించుకుంది. కెన్యా అధ్యక్షుడి తాజా ప్రకటనతో.. ఈ రెండు భారీ ప్రాజెక్టులనూ అదానీ కోల్పోయినట్లు స్పష్టమైంది.

హిండెన్‌బర్గ్ నివేదికతో ఏం జరిగింది?

న్యూఢిల్లీ, నవంబరు 21: గౌతమ్ అదానీ కంపెనీలు కాంట్రాక్టులు సంపాదించుకోవడానికి లంచాలు ఇచ్చాయంటూ ఎఫ్‌బీఐ ఆరోపించడంతో గురువారం స్టాక్ మార్కెట్లు ఘోరంగా పడ్డాయి. అదానీ కంపెనీలు తొలిరోజే ఏకంగా 20 శాతం నష్టపోయాయి. రెండు లక్షల కోట్లకు పైగా విలువ కోల్పోయాయి. ఇంతతీవ్రంగా కాకపోయినా 2023 జనవరి 25న హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడినపుడు కూడా ఇలాగే మార్కెట్లు పడ్డాయి. రెండు రోజుల్లో 3.86 లక్షల కోట్లు నష్టపోయాయి. ఇప్పుడు మార్కెట్ పతనానికి లంచాల ఆరోపణలు కారణం కాగా, హిండెన్‌బర్గ్ నివేదికలో కృత్రిమంగా షేర్ల ధరలను పెంచారన్న ఆరోపణలు నాటి పతనానికి కారణమయ్యాయి. అదానీ గ్రూపు సంస్థలు దశాబ్దాలుగా అకౌంటింగ్ ఫ్రాడ్‌కు పాల్పడుతున్నాయని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. కంపెనీ షేర్ల ధరలను కృత్రిమంగా పెంచిందని పేర్కొంది. అదానీతో లింక్ ఉన్న కంపెనీలు విదేశాల నుంచి కంపెనీ షేర్లను కొనుగోలు చేశాయని ఆరోపించింది. అదానీ సోదరుడు వినోద్ అదానీ వీటిని నిర్వహించాడని బయట పెట్టింది. వీటిని ఎక్కడా అధికారికంగా బయట పెట్టలేదని ప్రస్తావించింది. మారిషస్ నుంచి అదానీ గ్రూప్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టిన కంపెనీలు చాలా వరకు ఆ కుటుంబంతో సంబంధం ఉన్నవేనని ఆరోపించింది. దాదాపు 570 చిన్నా చితకా కంపెనీలు అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టాయని లెక్క తేల్చింది. హిండెన్‌బర్గ్ నివేదిక భారతీయ స్టాక్ మార్కెట్లను కుదిపేసింది. అదానీ కంపెనీలు కొద్ది వారాల వ్యవధిలో ఏకంగా 50 శాతం పడిపోయాయి. ప్రపంచ అత్యంత ధనవంతుల్లో ఒకరుగా ఉన్న అదానీ భారతీయ ధనవంతుల జాబితాలోనే ఎక్కడికో జారిపోయారు.

మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యం: కావలి గ్రీష్మ

» మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకారం


చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న గ్రీష్మ

గుంటూరు విద్య, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి, పిల్లలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని ఏపీ మహిళా సహకార ఆర్థిక సంస్థ నూతన చైర్‌పర్సన్ కావలి గీష్మ అన్నారు. గుంటూరులో గురువారం చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రీష్మ మాట్లాడుతూ 'పదవిలో ఉన్నంత కాలం మహిళల అభ్యున్నతి కోసం పని చేస్తా. మహిళా ప్రాంగణాలను స్వయం ఉపాధికి అనుకూలంగా మారుస్తా' అని చెప్పారు. ఆమె వెంట తల్లి ప్రతిభా భారతి ఉన్నారు.

వర్గీకరణపై కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం

» గడువు కంటే ముందుగానే నివేదిక ఇవ్వాలి: మంద కృష్ణ మాదిగ



గుంటూరు తూర్పు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. వర్గీకరణకు సీఎం చంద్రబాబు తొలి నుంచి మద్దతు తెలుపుతూ అండగా నిలబడ్డారని చెప్పారు. కృష్ణ మాదిగ గురువారం గుంటూరులో మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై నివేదిక ఇవ్వాలని కమిషన్‌కు ప్రభుత్వం 60 రోజుల గడువు ఇచ్చిందని, అయితే నెల రోజుల్లోపే నివేదిక ఇచ్చేలా కృషి చేయాలని కోరారు. "ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగాల నోటిఫికేషన్లు జారీ చేయాలని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నాం. వర్గీకరణతో నోటిఫికేషన్లు ముడిపడి ఉన్నందున నివేదిక త్వరగా వచ్చేలా ప్రభుత్వం చూడాలి' అని కోరారు.

మిస్టర్ జగన్‌రెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో: ఏబీవీ

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): 'మిస్టర్ జగన్‌రెడ్డీ... నోరు అదుపులో పెట్టుకో. మాట సరిచేసుకో. భాష సరిచూసుకో' అంటూ విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు మండిపడ్డారు. జగన్మోహన్‌రెడ్డి బుధవారం తనతో సహా విశ్రాంత ఐపీఎస్ అధికారులు ఆర్పీ ఠాకూర్, యోగానంద్‌పై చేసిన ఆరోపణలపై ఏబీవీ ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఒకసారి ప్రజల విశ్వాసం కోల్పోయినా, నోరు జారినా తిరిగి వాటిని ఎన్నటికీ పొందలేరు. నీలా కుసంస్కారంతో నేను మాట్లాడను. తెరవెనుక భాగోతాలు నడపను. నేనేంటో, తలవంచని నా నైజం ఏంటో గడిచిన ఐదేళ్లలో నువ్వే చూశావ్. బీ కేర్‌ఫుల్. ఫర్ ది రికార్డ్స్... నిన్న నువ్వు నా గురించి చెప్పింది పచ్చి అబద్ధం' అని ఏబీవీ కుండబద్దలు కొట్టారు.

టీచర్ల బదిలీలకు యాప్: మంత్రి లోకేశ్

విద్యాశాఖలో తీసుకొచ్చే సంస్కరణలు విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దేలా ఉండాలి తప్ప వారిపై ప్రయోగాలు చేసేలా ఉండకూడదని మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాష్ట్రానికి వచ్చిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులతో గురువారం సచివాలయంలో ఆయన భేటీ అయ్యారు. టీచర్ల బదిలీల్లో ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా చేసేందుకు యాప్‌ను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి చెప్పారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యావిధానాలను తమతో పంచుకోవాలని కోరారు.

హజ్ యాత్రికులకు లక్ష సాయం: మంత్రి ఫరూక్

హజ్ యాత్ర-2025 ఏర్పాట్లపై మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ గురువారం అమరావతి సచివాలయంలో సమీక్ష చేశారు. విజయవాడ(గన్నవరం) విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తుందని మంత్రి తెలిపారు. లక్ష రాయితీ సౌకర్యాన్ని హజ్ యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైసీపీ పాలనలో దళితులపైనా అట్రాసిటీ కేసులు

» కేసులు కొట్టేయాలని టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల మొర

వైసీపీ పాలనలో దళితులమైన తమపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారని బాధితులు వాపోయారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజావేదికలో పలువురు బాధితులు తమపై నమోదైన కేసులు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, టీటీడీ సభ్యుడు రాజశేఖర్‌గౌడ్ ప్రజావినతులు స్వీకరించారు. మన్యం జిల్లా భామిని మండలానికి చెందిన రాజేశ్ అర్జీ ఇస్తూ... 'మాదిగ సామాజిక వర్గానికి చెందిన తన భార్య టీడీపీ తరఫున సర్పంచ్‌గా గెలిచారని, అప్పటి వైసీపీ ఎమ్మెల్యే తనపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించారని, దానిని తొలగించాలని కోరారు. అదే జిల్లా బత్తిలికి చెందిన గణేశ్ గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని కోరారు. వారసత్వంగా వచ్చిన భూమికి అన్ని డాక్యుమెంట్లు ఉన్నా.. నిషేధిత జాబితాలో పెట్టారని నంద్యాల జిల్లా వీరారెడ్డిపల్లెకు చెందిన కోటిరెడ్డి వాపోయారు.

బంధుత్వాలంటే జగన్‌కేం తెలుసు: వర్ల

రక్త మాంసాలు రుచి మరిగిన మారీచునికి మాంసం గురించి తెలియదన్నట్టుగా జగన్ మాటలు ఉన్నాయని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'బంధువులు, బంధుత్వాలు అంటే జగన్‌కు ఏమి తెలుసు? తెలిస్తే.. తల్లి, చెల్లి ఎందుకు దూరమౌతారు? జగన్ అనుమతి, ఆజ్ఞ లేకుండానే వర్రా రవీంద్రారెడ్డి జగన్ తల్లి, చెల్లిపై జుగుప్సాకరమైన పోస్టులు పెడతాడా? స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయించిన జగన్‌కు సీఎం తల్లిదండ్రుల గురించి మాట్లాడే అర్హత లేదు' అని వర్ల మండిపడ్డారు.

రేపటిలోగా అల్పపీడనం!

» 25 కల్లా బంగాళాఖాతంలో తుఫానుగా మారే చాన్స్

విశాఖపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దక్షిణ అండమాన్ సముద్రంలో గురువారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో శుక్రవారం లేదా శనివారం ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్నది. ఇది ఆదివారంకల్లా వాయుగుండంగా బలపడనుంది. తర్వాత తుఫాన్‌గా మారి నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో ఈనెల 24వ తేదీ నుంచి వర్షాలు కురుస్తాయని, 26, 27 తేదీల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. గురువారం రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి.

ఉక్రెయిన్‌పై రష్యా ఖండాంతర క్షిపణి దాడి


రష్యా దాడిలో దగ్ధమవుతున్న ఇల్లు.. మంటలు ఆర్పుతున్న సిబ్బంది

కీవ్, నవంబరు 21: అమెరికా నిఘావర్గాలు హెచ్చరించినట్లుగానే ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్ సహా.. పలు నగరాలను రష్యా టార్గెట్‌గా చేసుకుంది. వెయ్యి రోజులు దాటిన ఈ యుద్ధంలో రష్యా తొలిసారి ఖండాంతర క్షిపణిని ప్రయోగించినట్లు ఉక్రెయిన్ వాయుసేన గురువారం పేర్కొంది. రష్యాలోని అస్త్రాఖన్ రీజియన్ నుంచి ప్రయోగించిన ఆ క్షిపణి డెనిపర్ నగరంపై పడ్డట్లు పేర్కొంది. అయితే.. కచ్చితంగా ఏరకం క్షిపణి అనే విషయాన్ని వెల్లడించలేదు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో ఖండాంతర క్షిపణి తోపాటు.. ఒక ఎక్స్-47ఎం2 కింజాల్ బాలిస్టిక్ క్షిపణి, ఏడు కేహెచ్-101 క్రూయిజ్ క్షిపణులను కీవ్‌పై ప్రయోగించినట్లు తెలిపింది. క్రివిరిహ్‌లో జరిగిన దాడిలో 26 మంది గాయపడ్డారని, వారిలో ఇద్దరు మహిళల పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. కీవ్‌పై రష్యా క్షిపణిదాడులు చేసే ప్రమాదముందని అమెరికా బుధవారమే హెచ్చరించింది. అయితే.. ఉక్రెయిన్‌పై ప్రయోగించిన ఖండాంతర క్షిపణి ఆర్ఎస్-26 రూబెజ్ అయ్యి ఉండొచ్చని రష్యా మీడియా పేర్కొంది. రాయిటర్స్ మాత్రం ఆర్ఎస్-26 రూబెజ్ క్షిపణిని ప్రయోగించినట్లు నిర్ధారిస్తూ.. ఈ మిసైల్ 5,800 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదని వివరించింది.

కాగ్ అధిపతిగా సంజయ్ మూర్తి ప్రమాణం

» తొలి తెలుగు వ్యక్తిగా అరుదైన ఘనత


కాగ్ చీఫ్‌గా సంజయ్‌మూర్తితో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) అధిపతిగా తెలుగు అధికారి కొండ్రు సంజయ్ మూర్తి బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గణతంత్ర మండపంలో గురువారం ఉదయం 10 గంటలకు సంజయ్ మూర్తితో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. ఆ తర్వాత సంబంధిత పత్రాలపై ఆయన సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ పదవి చేపట్టిన తొలి తెలుగు వ్యక్తిగా సంజయ్ మూర్తి అరుదైన ఘనత సాధించారు. సంజయ్ మూర్తి 1964 డిసెంబరు 24న జన్మించారు. మెకానికల్ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 1989లో ఐఏఎస్ అధికారిగా హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. ఆ తర్వాత కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు సహా వివిధ కేంద్ర సర్వీసుల్లో పనిచేశారు. 2021 సెప్టెంబరు నుంచి జాతీయ ఉన్నత విద్యా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం అమలులో సంజయ్ మూర్తి కీలక పాత్ర పోషించారు. సంజయ్ మూర్తి తండ్రి కేఎస్ఆర్ మూర్తి సైతం ఐఏఎస్ అధికారిగా కేంద్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత 1991-1996 వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున అమలాపురం లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు.

1,87,000 కోట్ల పెట్టుబడులు

» ఎన్టీపీసీతో రాష్ట్ర సర్కారు ఒప్పందం

» 1,06,000 మందికి ఉపాధి


సీఎం చంద్రబాబు, మంత్రి గొట్టిపాటి రవి సమక్షంలో ఒప్పంద పత్రాలతో ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు

అమరావతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పునరుత్పాదక రంగానికి మహర్దశ మొదలైంది. నేషనల్ థర్మల్ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)తో రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు రూ.1,87000 కోట్ల పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందం వల్ల రానున్న 25 ఏళ్ల కాలంలో రాష్ట్రానికి రూ.20,620 కోట్ల రాబడి, 1,06,000 మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. గురువారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో... ఎన్టీపీసీ, ఇంధనశాఖ సంయుక్త భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... భవిష్యత్తు పునరుత్పాదక విద్యుత్తు రంగానిదేనన్నారు. ప్రాజెక్టు మొదటి దశను 2027 ఏప్రిల్-మే నాటికి పూర్తి చేయాలని ఎన్టీపీసీని కోరారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా ఐదేళ్లలో 78.50 గిగావాట్ల సౌరశక్తి, 35 గిగావాట్ల పవనశక్తి, 22 గిగావాట్ల పంప్డ్ స్టోరేజీ, 1.50 ఎంటీపీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. 25 గిగావాట్ల సామర్థ్యం కలిగిన సౌర, పవన, హైబ్రీడ్ ఇంధన ప్రాజెక్టులను ఇతర సంస్థ సంయుక్త భాగస్వామ్యంతో అభివృద్ధి చేయాలని ఎన్టీపీసీ లక్ష్యంగా పెట్టుకుంది. కార్యక్రమంలో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎన్టీపీసీ సీఎండీ గురుదేవ్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(బిజినెస్ డెవలప్‌మెంట్) ఆర్. సారంగపాణి, ఇంధనశాఖ ప్రత్యేక సీఎస్ కె.విజయానంద్, నెడ్‌క్యాప్ వీసీఎండీ ఐవీఎస్ చక్రధరబాబు ఇతర విద్యుత్ సంస్థల అధికారులు పాలుపంచుకున్నారు.

ఎన్టీపీసీ పెట్టుబడులు ఇలా ...

- ఏపీతో కలిసి చెరిసగం పెట్టుబడితో భవిష్యత్తులో రూ.13,093 కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను చేపడుతుంది. ఇందులో రూ.8,500 కోట్లతో 1800 మెగావాట్ల సోలార్, రూ.19,000 కోట్లతో 2,400 మెగావాట్ల విండ్, రూ.85,000 కోట్లతో 7,500 టీపీడీ గ్రీన్ హైడ్రోజన్ కోసం 1,12,500 కోట్ల పెట్టుబడులు పెట్టడం జరుగుతుంది.
- 25 గిగావాట్ పునరుత్పాదక ఇంధనం, 10 గిగావాట్ పంప్డ్ స్టోరేజీ, 0.5 ఎంఎంటీపీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి.
- అనంతపురంలో రూ1,746 కోట్లతో 250 మెగావాట్ల సోలార్ ప్లాంటును ఇప్పటికే నిర్మించింది.
- విశాఖ సింహాద్రి విద్యుత్కేంద్రంలో 2,000 మెగావాట్లు, 25 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులను రూ.13,093 కోట్లతో చేపట్టింది. ఇవి ఇప్పటికే ఉత్పత్తి దశలో ఉన్నాయి. కాగా, వీటన్నింటికి కలిపి దాదాపు రెండు లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెడుతున్నట్లు ఎన్టీపీసీ పేర్కొంది.

రామాయపట్నంలో పెట్రో కెమికల్ హబ్!

» 65 వేల కోట్లతో ఏర్పాటుచేయనున్న బీపీసీఎల్

నెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం పోర్టులో పెట్రో కెమికల్ హబ్ ఏర్పాటుకు మార్గం దాదాపుగా సుగమం అయింది. ప్రధాని మోదీ., ముఖ్యమంత్రి చంద్రబాబు మైత్రి ప్రభావం నెల్లూరు జిల్లాలో భారీ పరిశ్రమల స్థాపనకు నాంది పలకనుంది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్).. రూ.65 వేల కోట్ల భారీ పెట్టుబడులతో సిద్ధమవుతోంది. దీనిపై ఢిల్లీలో కదలిక మొదలయింది. అంతా అనుకున్నట్టే జరిగితే నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉపాధి లభిస్తుంది. ప్రత్యక్షంగా 2,500 మందికి, అనుబంధ పరిశ్రమలవల్ల మరికొన్ని వేల మందికి అవకాశాలు దొరుకుతాయి. నిజానికి, ఇది విభజన హామీ. రాష్ట్రంలో పెట్రో కెమికల్ హబ్‌ను ఏర్పాటుచేస్తామని 2014లోనే కేంద్రం ప్రకటించింది. రాష్ట్ర అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళికలు, కచ్చితమైన ప్రతిపాదనలతో ముందుకెళుతున్న చంద్రబాబు.. ఈ అంశంపై ఢిల్లీని కదిలించారు. విశాఖ సమీపంలోని పూడిమడక వద్ద ఎన్టీపీసీ ఏర్పాటుచేస్తున్న గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాలో అనువైన భూమిని గుర్తించే పనులు మొదలుపెట్టాయి. రామాయపట్నం పోర్టు ఉత్తరం వైపు తెట్టు గ్రామం వద్ద మూడు వేల ఎకరాల అటవీ శాఖ భూమి ఉంది. పోర్టుకు దక్షిణం వైపు కావలి నియోజకవర్గం తుమ్మలపెంట వద్ద విస్తారంగా ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో పెట్రో కెమికల్స్ రిఫైండరీ పరిశ్రమల స్థాపనకు ఏది అనువైనదో దానిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. బీపీసీఎల్ రాకతో రామాయపట్నం కొత్త శోభను సంతరించుకుంటుందని పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రముఖ నాటక రచయిత బాదంగీర్ సాయి కన్నుమూత

» 'రంగ స్థలం' అభివృద్ధికి విశేష కృషి



విశాఖపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నాటక రచయిత, రంగసాయి నాటక సంఘం, రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు ఏవీవీఎస్ మూర్తి (బాదంగీర్ సాయి) గురువారం సాయంత్రం కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మూడు నెలల కిందట బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకున్నారు. ఇటీవల మరోసారి స్ట్రోక్ రావడంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయనకు భార్య హైమావతి, కుమారుడు వీరేశు, కుమార్తె నవ్య ఉన్నారు. పాలకొల్లు ప్రాంతానికి చెందిన బాదంగీర్ సాయి (63) నలభై ఏళ్ల కిందట వ్యాపారం నిమిత్తం విశాఖ వచ్చారు. అప్పటి నుంచి దసపల్లా హోటల్ సమీపంలో బాదంపాలు వ్యాపారం చేస్తూ వచ్చారు. విశాఖకు బాదంపాలును పరిచయం చేసిన ఆయన బాదంగీర్ సాయిగా పేరుగాంచారు. నాటక కళాకారుడైన సాయి.. విశాఖలో ఎక్కువ ప్రదర్శనలు జరిగేలా విశేషంగా కృషి చేశారు. నాటక నిర్వాహకుడిగా, నటుడిగా, దర్శకుడిగా, రచయితగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సురభి నాటకాలను విశాఖలో 40 రోజులపాటు ప్రదర్శింపజేసి అందరి మన్ననలు అందుకున్నారు. ప్రేక్షకాదరణ పొందిన అనేక నాటకాలను విశాఖలో ప్రదర్శింపజేసేందుకు 2010లో రంగ సాయి నాటక సంఘంను ఏర్పాటు చేశారు. మరుగునపడిన ఎన్నో నాటకాలను తెలుగు నాటక రంగ దినోత్సవం, ప్రపంచ నాటక రంగ దినోత్సవాల సందర్భంగా ప్రదర్శింపజేసేవారు. కళాకారులను ఘనంగా సత్కరించేవారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న చాలా మంది నాటక కళాకారులను ఆదుకున్నారు. నాటకాల పట్ల ఉన్న అభిరుచితో 10 వేల నాటక పుస్తకాలతో రంగసాయి నాటక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇది దేశంలోనే తొలి నాటక గ్రంథాలయం. ఆయన అంత్యక్రియలు శుక్రవారం మాధవధారలోని శ్మశానవాటికలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

వర్మకు మరో నోటీసు

» రావికమతం పోలీసులు జారీ.. హైదరాబాద్‌లో అందజేత



అమరావతి, రావికమతం, కడప క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మపై అనకాపల్లి జిల్లా రావికమతం పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. రామ్‌గోపాల్‌వర్మ ఈ ఏడాది మే 2న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి లోకేశ్‌లను కించపరిచేలా ఫొటోలను మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్టులు పెట్టారంటూ మండలంలోని గుడ్డిప గ్రామానికి చెందిన టీడీపీ సోషల్ మీడియా ప్రతినిధి గల్లా నానిబాబు ఫిర్యాదు చేశారు. 'వర్మపై మార్ఫింగ్ నేరం కేసు నమోదు చేశాం. స్టేషన్‌కు హాజరు కావాలంటూ హైదరాబాద్ వెళ్లి స్వయంగా ఆయనకు 41ఏ నోటీసు అందజేశాం. అయితే వారం రోజులు గడువు ఇవ్వాలని రామ్‌గోపాల్ వర్మ తరఫు న్యాయవాది కోరారు' అని ఎస్ఐ రఘువర్మ తెలిపారు. కాగా, రామ్‌గోపాల్ వర్మ, శ్రీరెడ్డి, పోసాని కృష్ణమురళిపై పోలీసులకు మరో ఫిర్యాదు అందింది. కడప వన్‌టౌన్ సీఐ రామకృష్ణకు గురువారం ఐటీడీపీ కడప నియోజకవర్గ నేతలు ఫిర్యాదు చేశారు. కాగా, సామాజిక మాధ్యమాల్లో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై నమోదు చేసిన కేసు పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

జల వనరుల సలహాదారుగా కన్నయ్యనాయుడు

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టు గేట్ల నిపుణుడు ఎన్. కన్నయ్య నాయుడును జల వనరుల శాఖ (మెకానికల్) సలహాదారుగా నియమిస్తూ గురువారం ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వు జారీ చేశారు. కన్నయ్య నాయుడు ఈ బాధ్యతల్లో రెండేళ్లపాటు ఉంటారు. నెలకు లక్షన్నర గౌరవ వేతనం చెల్లిస్తారు. విజయవాడలో ఉండగా రోజుకు రూ.1,000 కన్వేయన్స్ అలవెన్స్ చెల్లిస్తారు. విమానం, ఏసీ ఫస్ట్ క్లాస్ చార్జీలను చెల్లిస్తారు.

ఇకపై రాజకీయాలు మాట్లాడను

» ఏ పార్టీనీ పొగడను.. విమర్శించను.. మద్దతివ్వను: పోసాని



హైదరాబాద్ సిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇకపై రాజకీయాలు మాట్లాడనని, ఏ పార్టీని పొగడనని, విమర్శించనని, ఏ పార్టీకి మద్దతివ్వనని సినీనటుడు పోసాని కృష్ణమురళి స్పష్టం చేశారు. రాజకీయాలకు పూర్తిగా గుడ్‌బై చెబుతున్నట్లు గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. చివరి శ్వాస వరకు కుటుంబం కోసమే బతుకుతానని చెప్పారు. 'నేను రాజకీయాల గురించి మాట్లాడుతున్న సమయంలో అందరినీ విమర్శిస్తుంటానని అనుకుంటారు. నాయకుల నీతి, నిజాయితీ, నడవడికను బట్టి కామెంట్స్ చేస్తా తప్ప.. మంచి నాయకుడిని విమర్శించలేదు' అని పోసాని పేర్కొన్నారు. 'నాకు ప్రధాని నరేంద్ర మోదీ 35 ఏళ్లుగా తెలుసు. ఆయనను ఎప్పుడూ విమర్శించలేదు. ఆయన జీవితంలో అవినీతి లేదు.. మంత్రి స్థాయి నుంచి ఎదిగి దేశ ప్రధాని అయ్యారు. ఆయన రూ.కోట్ల ఆస్తులు కూడగట్టారని ఎవరైనా అన్నారా? కాంగ్రెస్ పార్టీ కూడా అలాంటి విమర్శలు చేయలేదు. ఇందిరాగాంధీ, నవీన్ పట్నాయక్... ఇలా ఎవరినీ నేను విమర్శించలేదు. చంద్రబాబు, జగన్, రాజశేఖరరెడ్డి, ఎన్టీఆర్.. ఇలా అందరినీ వారి గుణగణాలను చూసి సపోర్ట్ చేశా. తప్పులు చేసిన ప్రతి ఒక్కరినీ విమర్శించా. 1983నుంచి రాజకీయాలపై మాట్లాడుతున్నా.. ఒక పార్టీని సపోర్ట్ చేస్తూ.. మరో పార్టీని తిట్టను.. ఆయా పార్టీల్లో ఉన్నవాళ్లు తప్పు చేస్తేనే తిట్టాను. ఇకనుంచి నా జీవితకాలం రాజకీయాల గురించి మాట్లాడను. దీనికి కారణం నాపై కేసు పెడుతున్నారని కాదు. 16ఏళ్ల పిల్లల నుంచి 70ఏళ్ల వృద్ధురాలి వరకూ అసభ్య పదజాలంతో తిడుతున్నారు. పదవి కావాలని ఏ పార్టీనీ అడగలేదు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తానని చాలామంది అన్నారు. నేనే వద్దని చెప్పా' అని పోసాని తెలిపారు.

'రాజకీయాల్లో నేను ఎక్కువగా పొగిడింది చంద్రబాబునే. ఆ విషయం ఆయననే అడగండి. ఆయన ఓడిపోయిన తర్వాత జూబ్లీహిల్స్‌లోని ఇంటికి వెళ్లి కలిశా. 'శ్రావణమాసం' సినిమా సమయంలో ఆయనకు 100 అడుగుల కటౌట్ కట్టించా. ఆయన చేత్తో రిబ్బన్ కట్‌చేయించా. నన్ను, నా కుమారులను దీవించారు. ఆయన చేసిన మంచి పనులపై లిస్టు రాశా. ఆయన తప్పులను విమర్శించా.. అప్పుడు తంటా వచ్చింది' అని పోసానితెలిపారు. 'రాజకీయ నేతలందరికీ నమస్కారం చేస్తున్నా.. ఇన్ని సంవత్సరాల పాటు నన్ను ఆదరించారు.. ఇక ఈ రోజు నుంచి చనిపోయే వరకూ నా బిడ్డల కోసం, నా కుటుంబం కోసమే బతుకుతా' అని చెప్పారు. 'దేశంలో ఉన్న ఏ పార్టీ గురించి మాట్లాడను.. చనిపోయేవరకు జగన్‌ను అభిమానిస్తా. ఆయన నన్ను అంతగా ప్రేమించారు. నేను ఏ పార్టీలో ప్రాథమిక సభ్యత్వం తీసుకోలేదు. నేను ఓటరులాగే స్పందిస్తా. ఆయన బాగుంటే ఆయనకు, ఈయన బాగుంటే.. ఈయనకు సపోర్ట్ చేస్తా..' అని పోసాని పేర్కొన్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar**, RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*